22794

భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

*

జులై 1976

సంపుటము : 53 సంచిక : 7

నా పేరేమిటో చెప్పండి

నాకు 20 చేతులున్నాయి
మనిషిని కాదు
మనిషిని బాగుచేయడానికి పుట్టాను
నా పేరేమిటో చెప్పండి......

నాకు 20 కొమ్మలున్నాయి
చెట్టును కాదు
నా నీడలో చేరిన వారికి చల్లని జీవితం ప్రసాదిస్తాను
నా పేరేమిటో చెప్పండి......

నాలో ఇరవై రంగులున్నాయి
ఇంద్ర ధనస్సును కాదు
నిరుపేదల జీవిత ఫలకాల మీద రంగులు వేస్తాను
నా పేరేమిటో చెప్పండి......

నేను యిరవై అమ్ముల గాండీవాన్ని
సమాజంలోని ప్రజా శత్రువులందరినీ గురిచూసి కొడతాను
ఆధునిక కురుక్షేత్ర యుద్ధరంగంలో
అధర్మాన్ని వెంటాడి తరిమి తరిమి కొడతాను!

సమాచార పౌర సంబంధ శాఖ, హైదరాబాద్.

1/76

7-3-76

వి ష యా ను క్ర మ ణి క

జులై 1976

కాలాన్ని నిలిపే క్షణం

డా॥ మాదిరాజు రంగారావు

దీర్ఘ దీర్ఘమౌ నిశ్వాస పరంపరలతో
కలిసిపోయింది జలధి నా ఆయుఃప్రమాణం,
ఊపులో పాడుతూ వచ్చేను పవమానం
మనసులో స్మృతుల కిస్తూ గంధర్వ రూపం.

నా రక్తంలో కణ కణంలో
వెలిగే వసంత సూర్య బింబం,
నా దేహంలో అణువణువులో
చిగిర్చే వన దేవతా ముఖం.

ఈ బింబం నాలో హరిణాన్ని
వదలేను అంతలో సింహాన్ని.
ఈ ముఖం నాలో శత్రుత్వాన్ని
నిలపేను ఆప్తి ఫలభరాన్ని.

ప్రాలింది కిరణం ఎదలో అలజడి
ఏసేసే ఊహ రానీయకుండా,
ప్రవహింప జేస్తూ శరీరమంతా
సహజంగా స్ఫూర్తియుక్త ప్రవాహం.

తేలుగా వెలిగోసేను తీగవలె
పూలను తలలేస్తూ అందుకుంటూ.
పల్లంజేలిస్తే నించేను పిలుపవలె
అఖండాన్ని పాటంలో తెలుస్తూ.

ఎపుడూ కాదు జంతువుని మృగాన్ని
నిజంగా మానవుణ్ణి, బంధువుని,
జీవన గతి శక్తులకు కేంద్రాన్ని
కాలాని కాకృతి నిచ్చే శిల్పిని.

పోతేను, నదీ తీరాల లోకి
పోతేనో, గుహా ముఖాల లోకి,
కప్పించేనా ? నా పాద ముద్ర
విప్పించేనా ? ఆ కంఠ రవం.

శైలాల ధూళి తీరాల పాలించి
రైన్ యూఫ్రెటిస్ అంచుల్లో నిల్చి
వోల్గా సరిత్ భుజాల క్రీడించి
గాంగ ధుని కంఠాన ప్రేలాడి,

నే కన్న కలలనూ విన్న కథలనూ
కళల్ని రహస్యాల్ని వెలిగించేనా ?
ఉషస్ సంస్కృతి చలదరుణాధరాలు
నాలోని మౌనాన్ని పలికించేనా ?

మోగేను జలదం మారిస్తే
పలికేను పవనం గుండెలో
కదిలేను కాలం అర్థిస్తే
మానవుని తేజం కాంక్షిస్తే


నాగార్జునకొండ శిల్పాలలో కానవగు రమణీయ క్రీడలు - వినోదములు


శ్రీ ఐ. కార్తికేయ శర్మ


నాగార్జునకొండ త్రవ్వకాలలో ఇక్ష్వాకుల శ్రీ పర్వత విజయపురి నగర శిథిలావశేషములు పెక్కులు వెలికి వచ్చినవి. ఎన్నో శిల్పములు వాస్తు పట్టడములు సాతవాహన-ఇక్ష్వాకు రాజుల కాలము నాటివి, (క్రీస్త్వబ్దము 2-4 శతాబ్దివి) లభించెను. ఈ కాలమున బౌద్ధ జైనములు రెండునూ మెండగుటచే చక్కని మూర్తులు, శిల్పాలంకార శోభితమైన చైత్యములు పెక్కులు వృద్ధిలోనికి వచ్చినవి. ఇదివరలో నాగార్జున కొండలోని శిల్పశైలి ప్రాభవము, ఆనాటి సాంఘిక మతాచారములు, స్త్రీ పురుష అలంకారములు, ఆభరణములు, ఆసన శయ్యాసామగ్రి, నిత్యముగా వాడుకలోనున్న తదితర వస్తు-వాస్తుశకలముల గూర్చి పలుమార్లు వివరింపబడియుండెను.

శిల్పములలోని విషయము, ముఖ్యముగా బౌద్ధ మతమునకు చెందినదైనను, మధ్య మధ్య ఆనాటి సామాన్య మానవ జీవితానికి సంబంధించిన కొన్ని ఉత్సాహభరితములైన గాథలు, ఆహ్లాదముతో కూడుకొన్న రమణీయమైన ఆటలు, వినోదములు కూడా చెక్కియుండుట గమనింపవలసియున్నది. ఇట్టి శిల్పములు చాల స్వల్పముగా లభ్యమైనను, ఆనాటి జీవన వివరములను, సాంఘిక ఆచారములను, తెలుసుకొనుటకెంతయో ఉపయోగించును. ఈ వ్యాసమున నాగార్జున కొండలో నొక రాజప్రాసాదమున లభించిన రెండు శిల్పశోభితములైన స్తంభములను వివరింతును. ఇచ్చట చూపిన చిత్రములన్నియు పై స్తంభఫలకంపై చెక్కబడిన శిల్పముల ఛాయా ప్రతికలు. మొదటిసారిగా ఇక్కడ ప్రచురింపడమైనది.

విషయములనుబట్టి యీ చిత్రములను రెండు శాఖలుగా పేర్కొందును.







1. రాజుల లేక నాగరకుల జీవిత విశేషములకు చెందినవి.

2. ఆనాటి ఆటలు తదితర వినోదములను చిత్రించునవి.

ఈ వివరములన్నియు రెండు శిల్పస్తంభముల పైననే యుండుట చాల విశేషము. దీనినిబట్టి ఇక్ష్వాకు రాజులు, సామాన్య ప్రజలు వేడుకల వినోదములనెట్లు గడిపిరో, పర్వదినములలో నెట్లు మనోహర భరితమైన వ్యాయామ క్రీడలతో నిండుగా జీవితయాత్ర సాగించుచుండిరో సుస్పష్టమగుచున్నది. ఇట్టి శిల్పములు, భారతీయ శిల్పచరిత్రలోనే, చాల అరుదైనవిగా మనవి చేసుకొందును.

1. మహారాజులు, నా కు , విశిష్టమైన భోగలాలసతతో కూడుకొన్న జీవితము గడుపుచున్నట్లు తెలియుచున్నది.

1. ఉపన్యాస-విన్యాస స్థలములు :

ప్రేక్షకులు, శ్రోతలు కూర్చొనుట కనువుగా చుట్టూ నాలుగువైపుల ఎత్తైన మెట్లవలెనున్న ఆసనములుగల దీర్ఘచతురస్ర ప్రాంగణము (సైట్-17), 16.46 x 13.72 మీటర్లు కలది, నాగార్జునకొండ త్రవ్వకాలలో బయల్పడినది. ఈ పొడుగాటి ఆసనములపైని నునుపైన కడప రాతి పరుపు కలదు. ఇది ప్రాయికముగా బౌద్ధము నుపాసించు అర్హతలు, విద్యార్థులకు సమావేశ రంగముగా నుండెను. నైఋతి మూలనున్న శిలాపీఠము ప్రధాన వక్తకుద్దేశింపబడెను. ఇందలి విచిత్రమేమన ధ్వని సంబంధమైన ప్రత్యేక యేర్పాటు (Acoustics). మధ్యన నిలబడి ఉపన్యసించెడి వ్యక్తి మాట దూరమున కూర్చొన్న వారికి మరింత స్పష్టతరముగా వినబడుట. ఈ కట్టడమున సుమారు వెయ్యిమందికిపైగా సరిపోవు ఆసనములు కలవు. నాగార్జున కొండ త్రవ్వకములలో మరికొన్ని విశిష్టమైన ప్రాచీన కట్టడములను కూడ నిచ్చట పేర్కొనుట ముఖ్యము.


2. క్రీడాస్థలము; స్నానఘట్టములు వగైరా :


విజయపురి రాచనగరుకు పడమటుగా కొండ అంచు నానుకొని కృష్ణాతీరమునయున్న సోపాన స్నాన ఘట్టము (Site-34). ఇది చాల పెద్దది. పారుచున్న నదీపాయకు చేరువుగా రెండు పొడుగాటి వరుసలలో తోరణాలంకృతమైన పంక్తితో (ఒక్కొక్క మెట్టు కేవలం నాలుగు అంగుళముల ఎత్తు మాత్రమే), నున్నటి కడప రాయి పరుపుతోకూడ చక్కనిదిగా కనిపించును. ఇది మహారాజుల, రాణులకు స్నానఘట్టముగా నుండెను. దీని నానుకొనియే, ఇక్ష్వాకుల ఇష్టదేవతలైన మహాసేన (కార్తికేయ), దేవసేన, పుష్పభద్ర తదితర శైవ దేవతల ఆలయకూటముకూడ కలవు. వీని చేరువనే పౌరవోత్స



వాది కార్యముల కనువైన సువిశాల రంగస్థలము (సైట్-122), సుమారు 115 మీటర్ల పొడవు, 107 మీటర్ల వెడల్పున దీర్ఘ చతురస్రాకారపు యిటుకతో నిర్మితమైన సోపాన పంక్తులతో మహోన్నత కట్టడము కలదు. దీని పశ్చిమ దిశన సోపాన పంక్తులపై మధ్యగా ఎత్తైన మండప వేదికకలదు. ఇచట అయిదు పుష్పాసనములున్నవి. ఈ ఆసనములనుండి రాజులు, రాణులు కట్టడపు మధ్యలో గల క్రీడాస్థలమున జరుగు అంశములను తిలకించు చుండెడివారు. మిగత సామాన్యులందరను తక్కిన మూడు దిశల సోపాన పంక్తులలో కూర్చొనువారు. ఇది ఇంచుమించు మన లాల్ బహదూర్ స్టేడియం వలె నుండెడిదన్నమాట.

పై నుదహరించిన కీడారంగస్థలములు ఉపన్యాస — విన్యాస స్థలములు బహుశా రోమ్ పట్టణమునగల ''గ్లేడియేటరులు'', మరియు ''యాంపీ థియేటరు'' లను బోలినవిగా తోచుచున్నవి. ఇక్ష్వాకు రాజులు రోమ్‌నగరముతో మిక్కిలి సంబంధమున్నట్లు యీ కట్టడములేకాక రోమన్ చక్రవర్తులనాణెములు, గ్రీకు రోమ్‌నగరముల యోధులను రాజప్రాసాదములకు కావలులుగా నుంచుటనుబట్టి తెలియుచున్నది. ఈ రోమన్ కావలాదారులు ధరించే కంచుకీ, ఇనుప కుళాయి, కుట్టిన చొక్కాలు, ఇరుకు పంట్లాము, బూట్లువేసు కొన్న యోధుల చిత్రములు, ఈ ప్రాసాదములలో లభ్యమైన శిల్ప స్తంభములపై గుండుటకూడ విశేషము. యింకనూ, శకులు,





శకస్త్రీలు, బౌద్ధమతమును అవలంబించిన దానములుకూడ యొసగియున్నారు. ఈ రోమ్ పట్టణమునుండి సారాయినికూడ తెచ్చేవారు. ఒక సిథియన్‌కావలాదారు పెద్ద కొమ్ముతో చేసినట్టి త్రాగుడు కుప్పెయుక్తమైన గొట్టమువలెనున్న పాత్రను, దాని ప్రక్కనె యెత్తైన బల్లపైగల మద్యపుకుండ, రోమన్ డయోనిసిస్‌ను పోలియున్నది. ఇవికాక మరికొన్ని చిన్న కట్టడములు, మార్గమధ్యమునగల విశ్రాంతి గృహములు(సైట్‌నెంబర్లు 37, 70, 71, 81, 88, 107, 111, 114, 121), కొన్నింట లభ్యమైన పురావస్తువులనుబట్టి నృత్యములకు, విలాస వినోదముల కనువగు 'క్లబ్బు' లుండినట్లు తెలియుచున్నది. ఈకోవకు చెందిన ఒక కట్టడమున నర్తకి చిత్రముకల శిల్పస్తంభము, ఒక శిలాఫలకము కూడ లభ్యమైనది. ఆ నర్తకిపేరు శశికళ. కొంతమంది నాగరికులు స్త్రీలోలురుగాకూడ కన్పట్టుచున్నారు.

II వినోదములు - క్రీడలు :

నాగరికునకు తన ప్రాసాదమున ప్రత్యేకముగా రెండు లోగిలి గదులుండెడివట. ఒకటి తన భోగములకు వేరుగానుండెను. మరి యొకటి తన భార్యకు, వీనిలో చక్కటి ఆసనశయ్యా సామగ్రి అమర్చబడియుండెను. (చిత్రము-1). ఇందుచూపిన చిత్రమున ఒక నాగరికుడు శయ్యాసనముపై గగుర్పాటుతో లేచి కూర్చున్నట్లు చూపబడియున్నది. తన పుంపుడు కత్తె భయలజ్జావియై శయ్యదిగి

జారిపోవుచున్నది. ఇది హటాత్తుగా ఆ నాగరికుని భార్యబిడ్డతోసహా తన భర్త చేష్టను చూచుటవలన జరిగిన ప్రణయ సంక్షోభము. సంభ్రమాశ్చర్యములతో, కోపముతో యెంతో సహజముగా కన్పట్టుచున్న దీతని భార్య.

3. సురాపానము :

వాత్స్యాయనుని కామ సూత్రమున నాగరికుల భోగలాలసత్వములను యెన్నియో పేర్కొనియున్నాడు. చాల వినోదములు ఆపానక అనగా సామూహికముగా త్రాగుట ఉద్యానయాత్ర, సమాజక్రీడ, గోష్ఠిగా గణములలో చక్కటి చెలికత్తెలమధ్య, సర్వసాధారణముగా జరుగుచుండెడివి.

ఉపనిషత్తులలో సురాపానమును ఖండించినను, ధర్మశాస్త్రము, మను–యజ్ఞవల్క్యులు, ప్రాయశ్చిత్తములు, తీవ్రముగా పేర్కొన్నను, ఇక్ష్వాకుల కాలమున పాశ్చాత్య నాగరికతకులోనై కాబోలు నాగరకులు సురాపానము నొక క్రీడగా, వినోదముగా తమ రాణులతో తదితర ప్రాసాద స్త్రీలతో కలిసి చేయుచుండిరి.

(చిత్రము–2)

ఆ వయ్యారి యెంతో సహజముగా పాన పాత్రను అందించుచున్న చెలికాని బారినుండి తప్పించుకొనుటకు ప్రయత్నించుచున్నది.





కాని సురాపానానికి పరిచితగానే కనుపించుచున్నది.

మహారాజులు, నాగరకులు స్నానము చేయుతీరు గమనించవలసి యున్నది. ఒక పెద్ద తొట్టిలో సుగంధ పరిమళజలము పోయించుకొని స్నానమాడెడివారు.

(చిత్రము–3)

4. చిందులాట

భరతముని నాట్యశాస్త్రమున బృందగాన – అభినయముతో కూడుకొన్నవి, గాయనీ బృందములను, పేర్కొనియున్నాడు. పల్లెలలో చేయు జాతరలలో చిందులువేసి, ఆడ మగ కలిసి యెగురుట లేక త్రాగి పోలేరమ్మ, అంకమ్మలు పూనినట్లుగా చిందులువేయుట యీనాడున్ను మనము చూచుచున్నాము. ఈ యేనాది చిందులాటను బోలినవి ఇక్ష్వాకుల శిల్పమున కూడ కలదు.

(చిత్రము–4)

తప్పెట, లేక దుందుభి సహాయమున వేయు చిందులే కదా? పైగా తాగి ఆడుచున్నట్లు ముఖకవళికలు తెల్పుచున్నవి. ఆంధ్రమున



తిరునాళ్ళలో,పండుగ దినములలో మామూలుగా సామాన్య ప్రజలను రంజింపచేయునట్టివి యిట్టి నృత్యములు.

5. చదరంగము

ఈ సురాపానమే గాక జూదములు యింటిలోను, ఆరు బయటను కూర్చొని ఆడుకొను వీలగు చదరంగం, పచ్చీసుపాళీ, వైకుంఠపాళీ మొదలగు ఆటలెన్నియో యున్నట్లు విదితమగుచున్నవి. పైన వివరించిన రాజప్రాసాదములు, స్నానఘట్టము మరియు విశ్రాంతి గృహములలో యిట్టి క్రీడలకు సంబంధించిన గళ్ళు, కూటములు, నేలపై పరుపబడిన రాళ్ళపై మెండుగా లభించినవి. ముఖ్యముగా చదరంగము అతి ప్రాచీనమైన భారతీయ క్రీడ. ద్యూత క్రీడను గూర్చి ఋగ్వేదమున ప్రసక్తి కలదు. వేదకాలమునుంచి 'అక్షక్రీడ' చతురంగానికి ప్రాతిపదిక. అర్థశాస్త్రమున కౌటిల్యుడు ఈ ద్యూతాధ్యక్ష యే విధముగా యీ వినోదముపై సుంకమును వసూలు చేయవలెనో చెప్పియున్నాడు. నగర అక్షదర్శకులు కూడ నుండినట్లు వ్యాఘ్రగుంఫ (ఉదయగిరి, ఒరిస్సా) శాసనము తెలుపుచున్నది. ఈ చదరంగమువంటి ఆటలలో పావులు వేరు వేరు ఆకారములు కలిగినవి రంగులు భేదముగా నుండెడివి నెన్నియో కలవు. పటముపై ఆడ, మగ కూడ ఆడుచుండిరి. పాచికలు ఈ పావులను నడిపించుచుండును. నాగార్జునకొండలో లభించిన పాచికలు రెండు రకములు. ఒకటి పొడుగుపాటి నలుపలకలవి. పొట్టివి, ఘన చతురస్రపువి. వీనిపై ఒకటి మొదలు ఎనిమిదివరకు గుర్తులుండెడివి. ఇవి మట్టితోను లేక దంతముతోను చేయబడినవి. ఈ చదరంగము రామాయణ, భారత కాలములోనేగాక శ్రీకృష్ణదేవరాయల కాలమువరకు గూడ మరియు యీనాటికిని భారత దేశమునంతను సర్వసాధారణముగా, ముఖ్యముగా పండుగ రోజులలో ఆడుట విహారము. రాయలవారు యెంతో మక్కువతో తిమ్మనతో వెయ్యార్లు పందెములువేసి ఆటఆడేవారని, అగ్రహారాలుకూడ మాన్యములుగా యిచ్చెనని ప్రతీతి కలదు. క్రీడాభిరామమున వేశ్యలు యిట్టి ఆటలలో విటులను ఓడించి వారి సంపదను మింగివైచెడివారని పేర్కొనబడినదికదా,


6. మల్లవిద్య

ఇక్ష్వాకు కాలమున యీ మల్లయుద్ధము పలుతెగుల చాల ప్రాముఖ్యమైనదిగా పైన వివరించిన క్రీడారంగస్థలములలో జరుగుచుండెడిదిగా కనబడుచున్నవి. ఇందుకనుబరచిన చిత్రములు పైన పేర్కొనబడిన స్తంభములపై చెక్కబడియుండెను. విశాలమైన పోకడలతో బహుళ జనాదరణతో యీ క్రీడను రాజులు, సామాన్య ప్రజలు కూడ ఆదరించుచుండినటుల వివిధ చిత్రములద్వారా తెలియనగును.

(చిత్రములు 5-10)

ఈ మల్లయుద్ధమున ఆరితేరిన జట్టి మల్లు





లుండినట్లు విదితమగుచున్నది. గరిడీ శాలలుండెడివి. వీనికి రాజ పోషణ మెండు. మూడవ ఇక్ష్వాకురాజు చాంతమూలుడు బహు బలుడు. బహుశా యితడు గొప్ప ఆరితేరిన మల్లుడు కాబోలు. యిన్ని రకముల మల్లయుద్ధమును చూపు శిల్పములు మరెక్కడను కానరావు.

(చిత్రము-11)

ఇదికాక, బాణవిద్యకూడ ఒక సామాజిక ఆటగా యుండు నటుల మరియొక శిల్పమువలన తెలియుచున్నది. మనపూర్వులు యిట్టి విద్యలన్నింటిని చతుష్షష్టి విద్యలలో చెప్పియున్నారు కదా!

7. కోడిపందెములు

సంక్రాంతి మొదలగు పండుగ దినములలో జరుపుకొను వేడుకలలో అత్యంత ప్రాముఖ్యమైనది, ప్రాచీనమైనది కోడిపందెముల యాట. పూర్వ సంస్థానాధీశ్వరులు కోడి పోరును చాల ప్రియమైన వుత్సాహవంతమైన ఆటగా పలుచోట్ల పెట్టువారు. ముఖ్యముగా పలనాడులో చాల వైభవోపేతముగా, పండుగరోజులలో ఆడెడివారు. పల్నాటి వీరయుద్ధమునకు కోడిపందెములే కారణముగదా!


ఈ కోడి పోట్లాట మనదేశమునకు పర్షియానుండి దిగుమతి అయినట్లు తోచుచున్నది, ఏథెన్స్ నగరమున ఈ పోట్లాట క్రీస్తు పూర్వము 6–7 శతాబ్దిలో సంవత్సరమునకొకసారి గొప్పమత సాంఘిక సాంస్కృతిక పరమైన విలాస క్రీడగా జరుపుకొనుచుండిరి. తక్షశిల త్రవ్వకములలో యీ కోడిపందెమును చూపు ఒక రాగి తాయెత్తు బిళ్ళ క్రీస్తుశకము 1 వ శతాబ్దికి చెందినది లభ్యమైనది. మన యాంధ్రమున ఇక్ష్వాకుల కాలమున మిక్కిలి ప్రచారములోనున్నట్లు నిర్దుష్టమైన శిల్పములు లభ్యమైనవి. యెంత పుద్రేకముతో భీభత్సముగా పోట్లాడుచున్నవో చూడుడు.

(చిత్రము-12).

వెనుకనిలబడిన యిద్దఱు పందెగాండ్లు జుగుప్సతో చూచుచున్నారు. అమరుడు (క్రీస్తుశకము 4 వ శతాబ్ది) తామ్రచూడ యుద్ధమునుగూర్చి చెప్పియున్నాడు.

"క్రూకవాకుః తామ్రచూడః!
కుక్కుటః చరణాయుధః॥

దీనినిబట్టి యీ యుద్ధము చాల పోటీతో, లోహపు కత్తులను కోడి కాళ్ళకు కట్టి పందెమువేసి యాడువారు. మానసోల్లాసమున (క్రీ. శ. 12 వ శతాబ్ది), ఈ యాటనుగూర్చి చాల వివరములు చెప్పబడియున్నవి. ఈ పోరాటమునకుండవలసిన మెళకువలు,



స్థలము, దాని తయారీ సందెపు కోళ్ళను సాకుట, కత్తులుకట్టుట, మొదలగున వెన్నియో తెలుపుచున్నవి నాగార్జున కొండలో లభ్యమైన ఈ కోడిపందెమును చూపు శిల్పములలోని కంతకు చిత్రమైన దీశిల్పము. చాల జిగుప్సాకరముగానున్నది. రెండుకోళ్ళు రంగస్థలమున పోట్లాడుట సాధారణముగ తెలిసినదే. కాని మనిషి కోడితో పోరుట మరెక్కడను కానరాదు.

(చిత్రము-13)

యిట్టిపోరు వాడుకలో నున్నట్లు మొట్టమొదటగా హిందూ దేశమున (నాకు తెలిసి) మరెక్కడను గ్రంథస్థముగాగాని, శిల్పమున గాని కానరాలేదు.

8. జంతువుల పోరులు

ఇట్టి పోరాటమునకు కావలసిన రంగస్థలము విజయపురి నగరమున లభ్యమైనట్లు చెప్పియుంటిని. పై క్రీడావినోదములే కాక, గజ యుద్ధములు, అబోతు, దున్నపోతుల పోరాటములు, పొట్టేళ్ళ యుద్ధములు యీ ఇక్ష్వాకుల కాలమున జరుగుచుండినటుల శిల్పములవలన, తదితర, పురావస్తు అవశేషములవలన తెలియుచున్నది.





గజయుద్ధము రాజులకు అత్యంత వినోదకరముగా నున్నటుల విజయపురిలోని రంగస్థలపు మధ్యభాగమున దొరికిన గజముల అవశేషముల ద్వారా తెలియనగును. ఈ రంగస్థల నేలపై పోరాట స్థలము విభజన తీరు విలువురాళ్ళనుంచుటనుబట్టి యీ పోరాటము పలువిధములుగా జరుగుచుండునటుల తెలియును. ఇట్లు జంతువుల పోరాటములే గాక మనిషి–గుఱ్ఱము పోట్లాట.

(చిత్రము 14)

పొట్టేలు మనిషి పోట్లాట మొదలగునవి జరుగుచున్నటుల తెలియుచున్నది.

(చిత్రము 15)

పైన వివరించిన శిల్పములను, రంగస్థలములను, పరిశీలించి చూచినచో అభిలషితార్థచింతామణి (అనగా మానసోల్లాసము)యందు అభివర్ణించియున్న వినోద ప్రకరణము పూర్తిగా సత్యమని, ప్రాచీనముగా ఆంధ్రదేశమున యిట్టి పలురకములైన క్రీడలు, సామాన్య ప్రజలను, నాగరీకులను, రాజులను రంజింపచేయుచుండెనను మాటలో యిసుమంత సంశయములేదు. ముఖ్యముగ కోడి-మనిషిపోరు పొట్టేలు, గుఱ్ఱము మనిషితో పోరుట మున్నగునవి మరెక్కడను కానరావని.

రాగార్జునకొండలో లభ్యమయిన శిల్పరాజములలో మరింకెన్నియో విశేషములను తెలియజేయునట్టివి చాలకలవు. వీటిని గూర్చి సమగ్రముగా పరిశీలించవలసిన అవసరము యెంతైనా కలదు.



అధోజ్ఞాపికలు

1. ఐ. కార్తికేయశర్మ, "ది యేన్షియంట్ గేమ్ ఆఫ్ కాక్ ఫైట్ ఇన్ ఇండియా" జర్నల్ ఆఫ్ మిథిక్ సొసైటీ, (బెంగుళూరు, 1964) IV నం. 4 పుటలు. 113-120.
2. హెచ్. సర్కారు మరియు బి. యస్. మిశ్రా, నాగార్జునకొండ, (న్యూఢిల్లీ, 1972)
3. పై వ్యాసము ఛాయాచిత్రములు భారతీయ పురావస్తు సర్వేక్షణ వారి యనుమతి పొందనిదే ప్రచురించరాదు

ప్రసిద్ధ చరిత్రకారులు, గురుపితామహులునైన శ్రీ నేలటూరి వేంకటరమణయ్యగారు మిక్కిలి ఆదరముతో నీ వ్యాసమును చదివి కొన్ని మెరుగులు దిద్దిరి. వారి నేను సర్వదా కృతజ్ఞుడను.

ఆంధ్రగ్రంథమాల ప్రచురణలు

పండితారాధ్య చరిత్ర

డాక్టరు తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు వ్రాసిన పీఠికతో అమ్మకానికి సిద్ధంగాఉంది. వెల రు. 15-00 (పోస్టేజి అదనం)

బసవ పురాణము

బైండుచేసిన రంగుల అట్టతో, కీ. శే. కాశీనాధుని నాగేశ్వరరావుగారి 'ప్రస్తావన'తో కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావుగారి విపుల పీఠికతో అమ్మకానికి సిద్ధంగా ఉంది. వెల : రు 7-50 (పోస్టేజి అదనం)

భగవద్గీత

కీ. శే. కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు వ్రాసిన వ్యాఖ్యానముతో బైండు చేసి అమ్మకమునకు సిద్ధముగా నున్నది. వెల : రు 7-50 (పోస్టేజి అదనం)

ఆంధ్రపత్రిక ఏజెంట్లద్వారా కూడా తెప్పించుకోవచ్చు.

..........ప్రతులకు..........

మేనేజరు

ఆంధ్రపత్రిక, గాంధీనగర్, విజయవాడ-3

వరంగల్లులో గజపతిరాజు నాణెములు

శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి

1976 మే నెల భారతిలో 'కొన్ని నాణాలు' అను శీర్షికతో డాక్టరు ఎం. అబ్దుల్ అలీగారు ఒకవ్యాసమును వ్రాసిరి. ఈ వ్యాసము లోగడ 1970 లో న్యూమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా జర్నలు (**JNSI. Vol. XXXII Part II, Page 188**) లో వారు ప్రకటించిన ఆంగ్లవ్యాసమునకు ఇంచుమించు అనువాదము వంటిదే. కాని గడిచిన డిసెంబరులో ప్రస్తుత రచయిత **Kakatiya coins and Measrues** అను నొక పుస్తకమును ఆంధ్రప్రదేశ్ పురావస్తుశాఖద్వారా ప్రకటించియుండెను. దీనితో డా. అబ్దుల్ అలీగారు ఏకీభవించని విషయములు కొన్ని యిచట పరిశీలించబడును. 1976లో పై జెప్పిన న్యూమిస్మాటిక్ జర్నల్లో వారు మొదట కొన్ని రాగినాణెములను ప్రచురించిరి. వాటి పైనున్న ఈ క్రింది వ్రాతను బట్టి వారు వాటిని కాకతీయప్రతాపరుద్రునివని నిర్ణయించిరి. అవి వరంగల్లు ప్రాంతంలో దొరకుటనుబట్టి కూడ వారా నిర్ణయమునకు రాగలిగిరి.

ముందువైపు	**వెనుకవైపు**
శ్రీ మ ధు క	ద్రదేవవి
ర కా క తీ య	జ య క ట క
ప్ర తా ప రు	22 లం క

అట్లేతమదగ్గరున్నమరికొన్నినాణెములపై '23లంక' అనియు 'విజయకటక' కు బదులు 'విజయః ఉత్కల' అనియు మార్పులతో కూడిన వ్రాతలుకూడ కలవనిరి. 1968 లో డా. నేలటూరి వేంకటరమణయ్యగారు పై నాణెములన్నియు ఒరిస్సా రాజగు ప్రతాపరుద్ర గజపతికి చెందినవిగాని కాకతి ప్రతాపరుద్రునివి కావని నిష్కర్షగా తెల్పి అదే ఇంగ్లీషు జర్నలులో (**JNSI XXX Page 213-14**) ఒక ఖండన వ్రాసిరి. దానిపై అబ్దుల్ అలీగారు తమ వాదమును సమర్థించుకొనుచు 1970లో పై జర్నలులోను, ఈ మేనెల భారతిలోను వ్రాసిరి. కనుక పై వ్రాతలుగల నాణెములుకాకతీప్రతాపరుద్రుడివా, లేక గజపతి ప్రతాపరుద్రుడివా అని నిర్ణయించవలసివచ్చినది.

డా. వెంకటరమణయ్యగారి వాదములోని అంశములు :

1. నాణెములపైనున్న 'శ్రీమధుకర' అనుపదము వ్రాచీన కళింగ నగరమైన ముఖలింగమునందున్న మధుకేశ్వర దేవునికి వర్తించును—కనుక నాణెము గజపతులది.

2. గజపతిప్రతాపరుద్రుడు (1497-1540) 'కాకతీయ' అను బిరుదును కలిగియుండెను. అందుకు నిదర్శనము ఆరాజుయొక్క వంకాయపాడు-గడిమెల్లతా మ్రశాసనములోని యీ దిగువ చూపబడిన వాని ప్రశస్తి.

"వీరశ్రీ గజపతి గౌడేశ్వర నవకోటి కర్ణాట కలుబరిగేశ్వర కాకెతిరుద్ర వెంకటరాయ శ్రీప్రతాపరుద్రదేవ మహారాజులకరు విజయరాజ్యే..."

(నెల్లూరుజిల్లా శాసన సంపుటి I-P. 185)

ఇందు ఓఢ్ర గజపతి ప్రతాపరుద్రుడికి 'కాకెతి' అను బిరుదున్నది కనుక పై నాణెములుకూడ అతనివే కావలెను.


3. నాణెములను ముద్రించినచోటు విజయకటకము ఇది గజపతి ప్రతాపరుద్రుని రాజధానీ నగరమైన కటకము. కనుక ఆ నాణెములు గజపతి రాజువే.

4. నాణెములపై తేదీని సూచించే 'అంక' అనుపదము ప్రత్యేకించి కళింగము నేలిన రాజులచే 11వ శతాబ్ది నుండి చెల్లుచుండెను. ఇతరులెవ్వరు తమ సంవత్సర గణనలో ఆ పదమును వాడలేదు. కనుక ఆ నాణెములు ఒరిస్సా రాజగు ప్రతాపరుద్ర గజపతివే.

కాకతీయ ప్రతాపరుద్రుడివేమాత్రము కాజాలవు అని తెల్పి చెప్పిరి. ఈ విధంగా డా. వెంకటరమణయ్య గారు వ్రాసిన తర్వాత ప్రస్తుత మీ వ్యాసము వ్రాయనవసరములేదు అయినను డా. అబ్దుల్ అలీగారు తమ వాదాన్ని సమర్థించుకొంటూ రెండువ్యాసాలు వ్రాసిరి. కనుక కొంత వివరించి వ్రాయుట తప్పనిసరి యయ్యెను. కాకతి ప్రతాపరుద్రుడు క్రీ. 1290 నుండి 1323 వరకు ఓరుగల్లు రాజధానిగ ఆంధ్రదేశము నేలెను. ఓఢ్రరాజగు ప్రతాపరుద్ర గజపతి ఒరిస్సాలోని కటకం రాజధానిగ ఉత్తరమున గంగనుండి దక్షిణమున

పెప్పనదివరకు తూర్పుకోస్తాను క్రీ. 1497నుండి షుమారు 1514వరకు ఏలెను. ఇంక నాణెములపైనున్న పదముల సార్థకతను గూర్చి విచారింతము.

1. శ్రీమధుకర : నాణెముపైనున్నది ఈ పదముకాదు. ఈమధ్య జనగాం తాలూకాలో దేవరుప్పుల అనే గ్రామంలో ఇదే తరగతికి చెందిన మరికొన్ని నాణెములు దొరికినవి. అవి ఆ గ్రామంలో శ్రీ గోపాలరెడ్డిగారి యొద్ద నున్నవి. వాటిని పరిశీలించగా 'శ్రీ మద్వేంకట' అని స్పష్టముగ నున్నది. దీనిలోని ద్వే అను సంయుక్తాక్షరమును ద్వి అని పూర్వము కొందరు చదివిరి. వారు 'శ్రీ మద్విక్రమ' అనుకొనిరి. కాని నిజమునకది 'శ్రీమద్వేంకట'. ఈ బిరుదులో గజపతి ప్రతాపరుద్రుడు తన దక్షిణ రాజ్యావధిని తెలుపుటకు వెంకటాద్రిని చేర్చుకొనెను. నిజమునకతని రాజ్యము నెల్లూరువరకే యుండెను. చంద్రగిరి విజయనగర సామ్రాజ్యాంతర్గతమే. అయినను గజపతిరాజు తిరుమలను తన రాజ్యములోనిదిగ చెప్పుకొనుచుండెను. ఈ యభిప్రాయమును నిర్మూలించుటకే శ్రీకృష్ణదేవరాయలు 1514లో ఉదయగిరి, కొండవీడు రాజ్యాలను జయించి తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుని సన్నిధియందు తన రాణులతో కూడ కంచువిగ్రహములను స్థాపించుకొని వెంకటాద్రి తనదేనని ధ్రువపరచెను. అయినను గజపతిరాజు ఆ బిరుదును విడువలేదు. పైజెప్పిన వంకాయలపాడు, గుడిమెళ్ళ దాన శాసనములో కూడ 'వెంకట' పదము కలదు. ఇది కాకతీయ ప్రతాపరుద్రుడి కెచటను వాడబడలేదు. కనుక ఈ నాణెములు కాకతీయులవి కావు.



ముందు వైపు వెనుక వైపు

దేవరుప్పులలో దొరికిన నాణెము (1½ రెట్లు)

దేవరుప్పులలో దొరకిన నాణెము-దీనిలో "శ్రీమద్వేంకట కాకతీయ ప్రతాపరుద్రదేవ విజయకటక 21 అంక" అని యున్నది.

ఇచట 21 అనే అంకె స్పష్టముగ లేకుండుటచే 31గ కొన్నిటిపై కనపడును.

అది గజపతి ప్రతాపరుద్రుని బిరుదావళి లోనిదే కనుక ఈ నాణెములు అతనివేనని చెప్పుటలో అభ్యంతరముండదు.

2. 'కాకతి' అను పదమును గూర్చి తరువాత వివరించెదను.

3. 'విజయకటక' అనునది ఓఢ్రగజపతి రాజుల రాజధాని యగు కటక నగరమనియు అది నాణెములు ముద్రించిన స్థానమనియు డా. వెంకటరమణయ్యగారు చెప్పిరి. అహ్మద్ అలీగారు 'విజయకటక' అను పదమునకు విజయస్కంధావారమని చెప్పవలెననిరి. పైగా రాజధానీ నగరమును నాణెములపై వ్రాయుట కనుపించదనిరి. ఇంకా కటక్ నగరాన్ని 'విజయకటకమ'ని చెప్పటం కూడ లేదనిరి. అనగా 'విజయ' పదము స్కంధావారానికి మాత్రమే చెల్లుతుందని వారి అభిప్రాయము కావచ్చును. కాని రాజధాని నగరాన్ని కూడా 'విజయ' అను విశేషణ పదంతో చేర్చి వ్రాయడం అనేక శాసనాల్లో కనుపించును. 'విజయ కళింగ నగరాత్', 'విజయవేంగి పురాత్', విజయకొండు లూరవాసకాత్', 'విజయ సిష్టపురాత్', 'విజయ కాంచీపురాత్' అని ఆ యా రాజుల శాసనాల్లో కనుపిస్తోంది. కనుక వారు చెప్పిన ఈ అభ్యంతరం చెల్లదు. వారు అభిప్రాయపడినట్లు 'స్కంధావారమనే' దాని కర్థముగా చెప్పచో అది సామాన్య వాచకమై సంక్షిప్తముగా అర్థవంతమగు పదములనే నాణెములపై వాడుదురు గనుక, విశేషార్థమును దేనిని బోధించదు. 'ఆ సైనిక శిబిరము పేరేదో తెలిపినగాని దానికి ప్రయోజనముండదు. అట్టి స్కంధావార నామమిందు లేదు కనుక అది ఒరిస్సా రాజధాని నగరమగు 'కటక్'నే తెలుపును. అది నాణెములు ముద్రించిన చోటుగ భావించవలసియుండును. అందువల్ల ఈ నాణెములు ప్రతాపరుద్ర గజపతివేనని చెప్పవలయును.

పక్షాంతరముగ వారింకొక సమాధానము చెప్పిరి. కాకతి గణపతిదేవుడు తన విజయయాత్రలో ఒరిస్సా రాజధానియైన కటకం వరకు వెళ్ళి ఆ కటకపదాన్ని తన ప్రశస్తిలో చేర్చుకొని యుండును. అతని తర్వాత ప్రతాపరుద్రుడు కూడ దానిని తన నాణెములపై వ్రాయించి యుండును అని. ఇందు మొదటి అభ్యంతరము, కాకతి గణపతిదేవుడు కటకం వరకు విజయయాత్ర సాగించినట్లు మనకు నిదర్శనమేమియులేదు. ఒకప్పుడు గంజాం జిల్లాలోని ఆస్కా తాలూకలోని బొక్కెరవరకు కాకతీయ సైన్యము వెళ్ళినట్లున్నది. అయినా యీ విజయయాత్రను చూపుకొని గణపతిదేవుడు 'విజయకటకం' అనే ప్రశస్తిని చేర్చుకొనలేడు. అట్టి సందర్భములలో 'కటకచూరకార' ఇత్యాది బిరుదులుండును కాని 'విజయ కటక' అనే బిరుదుండదు'

కాకతి మహాదేవుడు యాదవులపై దండెత్తిపోయినపుడో లేక అంతకు ముందో కళ్యాణి కటకముపై దాడి సలిపి 'కటకచూరకార' అనే బిరుదును పెట్టుకొన్నాడు. ఆ తరాత దాన్ని కాకతీయులెవరు వాడినట్లు లేదు. ద్రాక్షారామందాటి కళింగదేశములో నెచట కాకతీయులు స్థిరపడి రాజ్యము చేసినట్లు తెలియదు. కనుక 'విజయకటక' అనే బిరుదు కాకతీయుల కున్నదని తెలుపు ఆధారాంతములేదు. ఈ పక్షాంతరమును ఆశ్రయించుటవలన అహ్మద్ అలీగారు 'విజయస్కన్ధావార' మనే వాదాన్ని విడిచి ఒరిస్సా రాజధానియగు 'కటక్'ను ఒప్పినట్లైనది. కాని వారనుకొన్నట్లు అది కాకతీయుల కెప్పుడు వాడబడలేదు. కనుక 'విజయకటక'మనే పదము నాణెములు ముద్రించబడిన గజపతి ప్రతాపరుద్రుని రాజధానీ నగరమగు కటక్ మాత్రమే యగును.

4. 'అంక' అనునది కళింగరాజుల విజయరాజ్య సంవత్సరాన్ని సూచించు నపుడు వాడు పదము ఈ పదముతో మరి యే యితర రాజులు తమ రాజ్యవర్షమును తెలిపెడివారుకాదు కనుక ఈ నాణెములపైనున్న 'అంక' పదము అవి ఓఢ్ర గజపతిరాజులవేనని వెంకటరమణయ్యగారు చెప్పిరి. అహ్మద్ అలీగారు 'అంక' అనేది సామాన్యంగా విజయరాజ్య సంవత్సర గణనలో అందరు రాజులు వాడతగినదే కావచ్చును. కాకతీయులనుండి కళింగరాజులు ఈ సంప్రదాయాన్ని గ్రహించియుందురు అని సమాధానమిచ్చిరి. కళింగదేశ చరిత్రను చదువువారికందరికి ఈ 'అంక' పదమును గూర్చిన విశేషము పూర్తిగా కాకపోయినను కొంత తెలియగలదు. ఆరాజులు భాద్రపదమునుండి సంవత్సరమును ప్రారంభించుట, పూర్ణిమాంత మాసమును గ్రహించుట, సంవత్సరముకన్న తక్కువయగు కాలమునుకూడ సంవత్సరముగా పరిగణించుట మున్నగు విశేషములీ 'అంక' గణనమునందుండును. '22 అంక' అనగా 22వ రాజ్య సంవత్సరమని గ్రహించుటకు వీలు కాదు: అయిదేసి సంవత్సరముల నొక మొత్తముగా గ్రహించి దాని నుండి భాద్రపదమునుండి గణించబడే పూర్తి సంవత్సరములుపోను మిగులు తగులులను మినహాయించి లెక్కించినగాని అసలు సంవత్సరముల సంఖ్యరాదు. '22 అంక' అని యున్నచో దానిలో సుమారు 4 తీసివేయవలసియుండును. అంటే 18వ రాజ్య సంవత్సరమగును. కనుక 'అంక' అనేది కళింగరాజులువాడే సాంకేతిక గణనా విధానము. ఇతర రాజులు దీనిని వాడువారుకారు. కాకతీయులు ఈ పద్ధతిలో సంవత్సరగణన చేసినట్లు ఎక్కడ కనుపించదు కనుక ఈనాణెములు గజపతిరాజులవే కాని కాకతీయులవికావు.

పై సమాధానములుపోగా డా. అహ్మద్ అలీగారు వేసిన రెండు ప్రశ్నలు చాలా గడ్డువి కలవు. ఈ నాణెములు కాకతీయరాజధాని పరిసరములందే యేల దొరకుచున్నవి? (ఇతరత్ర యేలకానరావు?) కాకతి పదమును ప్రతాపరుద్ర గజపతియే కారణముతో స్వీకరించెను?

ఈ ప్రశ్నలకు సమాధాన మరయవలెనన్న అనాటి చరిత్రను కొంత వివరించవలసియున్నది.

క్రీ. 1323 లో కాకతీయ రాజ్యపతనానంతరము బహమనీ సుల్తానులు తెలుగుదేశములో స్థిరపడి నిలువజాలకపోయిరి. ముందుగా ముసునూరి కాపయనాయకుడు ఓరుగల్లును తురుష్కులనుండి స్వాధీనము చేసుకొనెను. అతనినిచంపి రేచర్ల వెలమరాజు అనపోతానాయుడు క్రీ. 1369 ప్రాంతములో తెలంగాణమున స్వతంత్రుడయ్యెను. కాని కొలదికాలమునకే వెలమరాజులు బహమనీలకు సామంతులైయుండక తప్పలేదు. దీనికి కొండవీటిరెడ్లు కొంతకారణము. ప్రక్కనే విజయనగరరాజుల ఒత్తిడికూడ కొంతకారణము. మొత్తముమీద తెలంగాణములో రాచకొండ దేవరకొండలు రాజధానులుగ వెలమసోదరులు తమ ప్రత్యేకతను నిలబెట్టుకొనిరి. రెడ్ల రాజ్యమును కపిలేంద్ర గజపతి ఆక్రమించుకొనెను. వెలమరాజులు కపిలేంద్రుని సహాయముతో ముసల్మానుల కెదురుతిరిగి 1460 ప్రాంతములో రాచకొండ, దేవరకొండ, ఓరుగల్లు మున్నగు దుర్గములను స్వాధీనము చేసుకొని హిందూ తెలంగాణమును మరల స్థాపించిరి. కాని గజపతులకు సామంతులుగనుండిరి. 1470 లో కపిలేంద్ర గజపతి మరణించెను. ఈ వార్తవిని మహమ్మదు షా బహమనీ తెలంగాణముపై పెద్ద యెత్తున దండెత్తి వెలమరాజులను పూర్తిగ నోడించెను. దీనితో వారు తెలంగాణమును విడిచి విజయనగరరాజుల నాశ్రయించిరి. వెలుగోడులో తమ స్థావరమేర్పరచుకొనిరి. ఓరుగల్లు, ఇతర అనేక ఆంధ్రనగరములతో బాటు బహమనీ సులానుల పరమయ్యెను. కపిలేంద్ర గజపతి కొడుకులు హంవీరుడు, పురుషోత్తముడు సింహాసనమునకై తగవులాడుకొనుట యదనుగా సాళువ నరసింహరాయలు కృష్ణవరకుగల కోస్తా ప్రాంతము నాక్రమించెను. బహమనీసుల్తాను కృష్ణకు ఉత్తర భాగమును తెలంగాణముతోసహా ఆక్రమించెను. తాను సింహాసనముపై స్థిరపడిన కొద్దికాలమునకే పురుషోత్తమ గజపతి రాజమండ్రిలో నున్న ముసల్మాను గవర్నరును తరిమివేసి దక్షిణదేశముపై విజయయాత్ర సాగించెను. కాంచీనగరమువరకు వెళ్లగలిగెనని కొందరు చెప్పిరి. అది యెట్లున్నను ఉదయగిరిని జయించెను. నెల్లూరునుండి గంగానదివరకుగల కోస్తామండలమునంతను తన రాజ్యములో చేర్చుకొనెను. అతని కొడుకైన ప్రతాపరుద్రగజపతి రాజగునప్పటికి వారి రాజ్య విస్తీర్ణమిది. 1490లో సాళువ నృసింహుడు చనిపోయెను. విజయనగరరాజ్యం తుళువ నరసానాయకుడి నాయకత్వమున సాగుచుండెను. ఇమ్మడి నరసింహుడు పేరుకిమాత్రమేరాజు. అతి సమ

ర్షుడైన మహమ్మద్ గవాన్ మంత్రి 1481 లో చంపబడినది మొదలు బహమనీరాజ్యములో కలతలు బయల్దేరి దాని విచ్ఛిత్తికి దారి తీసెను. గవర్నరులు బలవంతులై సుల్తానున కెదురు దిరుగుచుండిరి. ఈ యదనుచూచుకొని ప్రతాపరుద్ర గజపతి తెలంగాణమును జయించనుద్యమించెను. కుతుబ్‌ముల్కు తెలింగాణమునకు గవర్నరుగా నుండెను. కాని యితని యాధిపత్యమును సహించని జాగీర్దారు లనేకులు ఇతని నెదిర్చి తిరుగుబాటుచేసిరి. ఈ సమయములో ప్రతాపరుద్ర గజపతి మునల్మానుల కొలువులో నున్న గొప్ప హిందూనాయకుడైన షితాబుఖాను అనువానిని తనవైపుకు తీసుకొని వాని సహాయముతో ముసల్మానుల వశమందున్న అనేక స్థావరాలను తిరిగి ఆక్రమించుకొనెను.

క్రీస్తు 1500 నుండి 1526 వరకు తెలింగాణా చరిత్రలో మరుగుపడిన విశేషములు అనేకముకలవు. ఇది బిదరులో బహమని వంశపతనమునకు చెందినకాలము. గోల్కొండ గవర్నరగు కుతుబ్ ముల్కు అన్నివిధముల సుల్తానుకు విధేయుడుగనే యుండెను. కాని తెలింగాణములోబహమనీయాధిపత్యమును సుస్థిరమొనర్పజాలకుండెను. ప్రతాపరుద్ర గజపతి షితాబుఖానుకి తగినంత సైన్యమునిచ్చి ఖమ్మం మెట్టు, వరంగల్లు, రాచకొండ, దేవరకొండ, మున్నగు దుర్గములను స్వాధీనము చేసుకొనెను. 1504 లో వరంగల్లునుండి తురుష్కులు పలాయనమైరి. షితాబుఖానుడు లేక చితాపుఖాను దాని నాక్రమించుకొని తాను మరల కాకతి రాజ్యవైభవమునచట స్థాపించు చుంటినని చెప్పుకొనుచు గొప్పశాసనమును వ్రాయించెను. ఈ శాసన మిప్పుడుకూడ కోటలో శంభుని గుడి దగ్గరున్న తోరణద్వారమువద్ద నున్నది. దాని ననుసరించి యితడు హిందువని స్పష్టముగా తెలియ గలదు. ఇతనికి షితాపుఖాను అను పేరు మహమ్మదీయుల కొలువులో నుండుటవల్ల వచ్చినదే. భోగి వంశమునకు చెందినట్లు చెప్పబడెను. ఇది ఖమ్మం జిల్లాలోని అటవికుల వంశమని కొందరు తలంతురు ఇతని తాతపేరు నాగనాయకుడు, తండ్రిపేరు మానయ నాయకుడు, తల్లి గౌరాంబ.

వీరుగొప్పధానుష్కుడట.అనేకవేల యోధులకితడునాయకుడట. శకవర్షము 1425, రుదిరోద్గారి సంవత్సరములో (క్రీ. 1504) యవనులు విడిచిపెట్టిపోయిన వరంగల్లు రాజధానిని తానాక్రమించు కొంటినని చితాపఖాను చెప్పుకొనెను. దీనివల్లయవనులను తరిమివేయు నంతటి బలమితనికి ఇతరులవల్ల వచ్చినదని స్పష్టము. ఇతనిని గూర్చిన తర్వాతి వృత్తాంతమునుబట్టి యీతడు గజపతిరాజుల సామంతుడని తెలియుచున్నది. ఖమ్మంజిల్లా, నల్లగొండజిల్లా, వరంగల్లు జిల్లాలే కాక గుంటూరు మండలములోని బెల్లంకొండ దుర్గము కూడ ఇతని రాజ్యములో చేరియుండెను. ఇంత విస్తీర్ణమండలాన్ని ఇతడు స్వతంత్రుడుగా పాలించుచుండెనని చెప్పుటకేమా తము అవకాశములేదు. కుతుబ్‌షా వంశస్థాపకుడైన పై జెప్పిన కుతుబ్‌ముల్కు ఇతనిపై సైన్యమునంపగా ఇతడు గజపతిరాజుల సహాయముతో నెదిర్చినట్లు ముస్లిం చరిత్రకారులు తెలుపుచుండిరి. ప్రతాపరుద్ర గజపతిపై 1516–19 ప్రాంతములో శ్రీ కృష్ణదేవరాయలు దండెత్తిపోవు నపుడు చితాపుఖాను 60 వేల సైన్యము తీసుకొని విజయనగర సైన్యముతో తీవ్రపోరాటము సలిపినట్లు రాయవాచకములోను, కృష్ణరాయ విజయమను గ్రంధములోను వ్రాయబడెను. కనుక షితాపుఖాను ప్రతాపరుద్ర గజపతికి సామంతుడుగనే తెలంగాణమును పాలించుచుండె ననుట నిర్వివాదము. ఒక ప్రతాపరుద్ర రాజుయొక్క ధన సహాయముతో నితడు పాకాల చెరువును మరమ్మతు చేయించినటుల గా చెప్పబడు నొక యైతిహ్యము Glimpses of the Nizam's Dominions గ్రంధములో (పుట 490) వ్రాయబడెను. దీనిని త్రోసిపుచ్చుటకు వీలులేదు. ఇద్దరు సమకాలికులు. ప్రతాపరుద్ర గజపతి రాజు—పితాపుఖాను అతనికి సామంతుడు. కనుక ఆ రాజుయొక్క ద్రవ్యమును వినియోగించి పాకాల చెరువును పితాపుఖాను మరమ్మతు చేయుట నమ్మదగిన విషయమే ఈ గజపతిరాజు కంబం చెరువును త్రవ్వించుటకు కూడ విశేషముగ ధనమును తన కూతురి కిచ్చినట్లు వేరొక యైతిహ్యము గలదు. అదియు సత్యమే కావచ్చును. పితాపుఖాను పాకాల చెర్వు నుద్ధరించెనని చరిగొండ ధర్మన్న ప్రణీతమైన చిత్రభారతములో ప్రశంసించబడెను. చితాపుఖాను మంత్రియగు పెద్దనామాత్యున కంకితమీయబడిన గ్రంధమిది.

"గంధుల కెనగ బాకాల చెర్వాదిగా చెరువులు విలుపు నగరుని కరణి దివ్య ప్రతాపుడై దిగ్విజయంబు గావించు మాంధాతృ భూవిభుని లీల
....
అతుల ధైర్యాభిభూత హిమాచలుండు మానభూపాల చితాబుఖాన ఘనుడు."

(ఈ విషయము కీ. శే. ఆదిరాజు వీరభద్రరావుగారు ప్రకటించిన 'షితాబుఖాను' లేక 'సీతాపతి రాజు' అను గ్రంధము నుండి గ్రహింపబడెను.)

ఇప్పటికిని ఆ చెర్వుదగ్గర షితాబుఖాను గండి యనబడు తూము కలదు. అద్దంకి గంగాధర కవి రచితమగు తపతీ సంవరణోపాఖ్యానమునందుకూడ చితాపుఖానుయొక్క ప్రశంస కలదు. కుతుబ్ ముల్కు గోల్కొండలో స్థిరపడి తెలంగాణములోని దుర్గములనంటిని వరుసగా లోబరచుకొనువరకు ఇతడు తెలంగాణమును గజపతి ప్రతాప

రుద్రునికి సామంతుడుగ రాజ్యమేలెను. కుత్బుషా 1524 ప్రాంతమున ఖమ్మంమెట్టును పట్టుకొనుటతో షితాపుఖాను రాజమహేంద్రి వైపు పారిపోయెనందురు. తర్వాత ఇతని సంగతి తెలియదు. కనుక దాదాపు 1504 నుండి 1524 వరకు ఇతడు తెలంగాణమునేలెను. ప్రతాపరుద్ర గజపతియొక్క నాణెములు తెలంగాణములో వరంగల్లు ప్రాంతంలో దొరకుట సహజమే. అవి కాకతీయప్రతాపరుద్రుడివనుటకు అట్లు దొరకుట కారణముకాదు.

కాకతి బిరుదు :

డా॥ అబ్దుల్‌వలీగారు నాణెములపైన 'కాకతీయ'అని ఉండగా డా. వెంకటరమణయ్యగారు ఉదహరించిన పంకాయలపాడు — గుడిమెళ్ల దాన శాసనములో 'కాకెత' అనియుండుట విరుద్ధాంశమని చూపిరి. కాకతి, కాకతీయ, కాకెత, కాకత్య, కాకర్త్య మున్నగునవన్నియు శాసనాల్లో కనుపించును కనుక వారుచూపిన పదభేదము పరిగణింపతగినదికాదు. కాగా అది గజపతి రాజునకెట్లు వెల్లును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పవలసియున్నది 1323 లో కాకతీయుల పతనానంతరము తెలంగాణములోను కోస్తా అంధ్రమండలములోను అధికారమునకు వచ్చిన హిందూరాజులనేకులు కాకతీయులను ప్రశంసించుచు శాసనములు వ్రాయించుకొనిరి. ముసునూరి ప్రోలయ నాయకుని విలస తామ్రశాసనము అట్టివాటిలో మొదటిది ఇది 1330 ప్రాంతము నాటిదని యెంచెదరు. ఇందు సుమారు పదిశ్లోకములు కాకతీయ పతాపరుద్రునిగూర్చి చెప్పబడినవి. (ఎ. పి. ఇండికా. XXXII – 239 – 268) ముసునూరి నాయకుల తర్వాత ఓరుగల్లునాక్రమించినవెలమరాజగురేచెర్ల అనవోతనాయకుడు కూడ తనపూర్వులుకాకతిరాజ్య సముద్ధరణము చేసినట్లు చెప్పుకొనెను. తర్వాత అనితల్లియొక్క కలువచెరు శాసనంలో మరల కాకతీయ ప్రతాపరుద్రుని ప్రశంస కానవచ్చును. (తెలుగు సాహిత్యపరిషత్పత్రిక II. 106). సుమారు రెండు నూర్ల సంవత్సరాల తర్వాత ఓరుగల్లును ఆక్రమించుకొన్న షితాపు ఖానుకూడ తాను మరల కాకతి రాజ్యవైభవాన్ని నిలబెట్టదలచినట్లే చెప్పుకొనెను. ముందుగా వరాహమును తదుపరి కాకతీయుల కులదైవమగు స్వయంభు శివుని స్తుతించి తనవంశవర్ణన చేసుకొని కాకతి నగరమును హిందూధర్మోద్ధరణకొరకు తానాక్రమించినట్లు చెప్పెను.

శ్లో. పూర్వం కాకతి వంశ్యరాజ నివహైర్వ్యాపాలి ధర్మాత్మభిః
యానానా నిధిభిః కుబేర నగరీ వాధ్యాసితా ద్యోతతే
తస్యా మేక శిలాపురీం సవిభవ శ్చితాపఖానో న్నపో
గృహ్ణాద్భోగి కులాగ్రణీః సురధరాదేవార్చనే యాధికః॥

(వరంగల్లుజిల్లా శాసన సంపుటి - పుట 295)

కాకతీయులు ప్రతిష్ఠించిన దేవతలు స్థానభ్రష్టముకాగా తాను వాటిని పునరుద్ధరించుచుంటిననికూడ చెప్పెను. తుదకు "కాకతి వంశరక్షణయందు చింతామణివలె కృపామయుడైన స్వయంభు దేవుని నిత్యము అతిభక్తితో సేవించుచు చితాపఖాను ఏకశిలానగరము నందు సమస్తైశ్వర్యముతో సుఖించుచుండెను" అని శాసనము నందు వ్రాసుకొనెను. దీనినిబట్టి యెన్నడో ఇన్నూరేండ్ల క్రిందట అంతరించిన కాకతి వైభవాన్ని ఈ విధంగా ప్రశంసించటం ఓరుగంటిని పాలించు హిందూరాజులకు మామూలయ్యెను. ఇది వారికి కాకతీయులయెడ నిజమగు ఆదరాభిమానములను తెలుపును. అవటి ప్రజలయొక్క ఆదరమునకు పాత్రులుకూడ అగుదురు. ఇంత అభినివేశముగల షితాపుఖాను తనను నిలబెట్టిన ప్రతాపరుద్ర గజపతిచే తన ఓరుగల్లు రాజధానికి కావలసిన నాణెములను 'కాకతి' అను పదమును చేర్చి ముద్రిపించు కొనుటలో విచిత్రములేదు. ఇంకా 'ఓరుగల్లు' అంటే 'కాకతి' అనే భావం ప్రజల్లో పూర్తిగా నాటుకొనియున్నది. కనుక ప్రతాపరుద్ర గజపతి 'కాకతి' బిరుదును స్వీకరించుట సార్థ

భారతి

చందా వివరములు

	ఏజంటుద్వారా	పోస్టులో
విడి ప్రతి	రు. 1-50	-
సంవత్సరచందా	రు. 18-00	19-20
6మాసములచందా	రు. 9-00	9-60

మేనేజరు
భారతి

కనే యగును. తనకది ముఖ్యముగ విజయసూచకము కూడా. తన అని శాసనాల్లోను ఈ బిరుదును చెప్పకొనకపోయినను కనీస మొకటి యైన ఆ బిరుదున్న శాసనము (వంకాయలపాడు-గుడిమెళ్ల దానశాసనము) మనకు లభించుటే దీనికి నిదర్శనము. షితాఫఖాను పాలించుచున్న వరంగల్లు రాష్ట్రమునకు కావలసిన నాణెములపై గూడ 'కాకతి' అనే బిరుదును ముద్రించుకొనెను. కనుక ఈ బిరుదుగల నాణెములు వరంగల్లు ప్రాంతములో దొరుకును. ఇతరత్ర కూడ దొరుకుటలో తప్పులేదు. శ్రీ దినకరరావుగారు మొదట న్యూమిస్మాటిక్ సొసైటీ జర్నల్లో ప్రకటించిన నాణెములు మాల్ఖేడు దగ్గర దొరికినవనిరి. నాణెములు పలుచోట్లకు ప్రయాణము చేయుచుండును కనుక తప్పులేదు పాకాల చెరువు మరమ్మతుకోసం షితాపుఖాను ప్రతాపరుద్ర దేవునినుండి విశేష ధనమును తెచ్చుకొనెనని పూర్వము చెప్పితిమిగదా.

'కాకతి' బిరుదులేని 'గజపతి ప్రతాపరుద్రుని' నాణెములను కూడ డా. అబ్దుల్ అలీగారు తమ వ్యాసములో ఫొటోతోసహా ఉదహరించిరి. కనుక వరంగల్లు ప్రాంతంలో ఆ గజపతిరాజుయొక్క నాణెములుండుట కిది బలమైన నిదర్శనముకదా అంటే 'కాకతి' అను బిరుదు కలవి కొన్ని ఆ'గజపతి' బిరుదుకలవి కొన్ని ప్రతాపరుద్రుని నాణెములు వరంగల్లు ప్రాంతానికిచేరియుండుననిస్పష్టమగుచున్నది. వెండి,బంగారు నాణెములమాట యెట్లున్నను రాగినాణెములు విశేషముగ ఆ గజపతి రాజువి వరంగల్లు చేరెను.

షితాపుఖాను వరంగల్లులో నెంతకాలమున్నది చెప్పుటకు తగిన ఆధార మింతవరకు సరియైనది దొరకలేదు అతడు వరంగల్లు నాక్రమించుకొన్నపుడు ఇంకా బహమనీ సుల్తానుల యధికారము తెలంగాణములో పూర్తిగా నశించలేదు గోల్కొండ గవర్నరుగనున్న కుతుబ్‌షా (మాలిక్ కుత్బుల్ ముల్క్) క్రీ. 1512లో స్వతంత్రుడైనట్లు మహమ్మదీయచరిత్రకారులుచెప్పిరి.అతడు 1523-24లో రాచకొండ, దేవరకొండ, కోవిలకొండ, వజీరాబాదు, ఖమ్మంమెట్టు, బెల్లంకొండ దుర్గములను స్వాధీనము చేసుకొన్నట్లును అప్పుడే షితాపుఖాను ఒరిస్సావైపు పారిపోయెననియు చెప్పబడుచున్నది. కాని యీదం యూ తన్ను ప్రతాపరుద్రుడు ప్రతిఘటించగామరల 1530-31లో కోస్తా ప్రాంతమును స్వాధీనము చేసుకొనెననియు డా. రాయప్రోలు సుబ్రహ్మణ్యముగారు చెప్పిరి (సూర్యవంశ గజపతులు పుట. 121-22). కాని వరంగల్లు ఎప్పుడు షితాపుఖానునుండి కుతుబ్‌షాకు స్వాధీనమయ్యెనో నిర్ణయముగ తెలియదు. డా. అబ్దుల్ అలీగారు ప్రకటించిన నాణెములపై స్పష్టముగ '21 అంక' అనియు '22 అంక' అనియు ఉండుటచే ప్రతాపరుద్ర గజపతియొక్క 18వ విజయరాజ్య సంవత్సరపు నాణెములు వరంగల్లు చేరునంతవరకు షితాపుఖాను వరంగల్లులో పాలించుచుండెనని చెప్పవచ్చును. ఇది సరిగా 1514 కి సమానమగును. శ్రీకృష్ణదేవరాయుల రెండవ కళింగయాత్ర 1519 జరిగెనని డా సుబ్రహ్మణ్యముగారు నిరూపించిరి అప్పటికి కుతుబ్‌షా ఖమ్మంమెట్టు, బెల్లంకొండ దుర్గములను సాధించలేదు. షితాపుఖాను వాటికి పాలకుడుగనుండెను. అంతకు ముందే వరంగల్లు అతనిచేయి జారిపోయెనని తోచుచున్నది.

డా. అబ్దుల్ అలీగారి 'గజపతి' అని వ్రాయబడిన నాణెము వలన వేరొక అంశము బయల్పడుచున్నది. దాని రెండవవైపున వారు 'రాయన, నాయక' అని రెండు పంక్తులలో చదివిరి. అది 'రాయనా, [గ] నాయక' అని చదువ వీలగునేమో పరిశీలించవలసియున్నది. కొన్ని సంవత్సరములకుపూర్వము మాయొద్దకు ఒక నాణెముల పరిశోధకుడు 'నాగనాయక' అని వ్రాసియున్న నాణెము నొకదానిని తెచ్చి చూపెను మొదటివైపునగల అక్షరముల నపుడు విశేషించిచదువలేదు. కాని వానితో నది షితాపుఖాను తాతయగు 'నాగనాయకు'నిది కావచ్చునని తెలిపితిమి. కాని ఆ నాగనాయకుడు నాణెములను ముద్రించుకొనునంత గొప్పవాడుకాదు అతని మనుమడైన షితాపుఖానుకి నాగనాయకుడనే పేరుకూడ కలదేమోనను సందేహము కలుగుచున్నది. హిందువుకి షితాపుఖాను అనేపేరు అసహజముకదా. చిన్నతనములోనే మహమ్మదీయుల కొలువులో చేరియుండుటచేత ఈ పేరు స్థిరపడియుండును. గజపతి ప్రతాపరుద్రుని నాణెముపై తనపేరుకూడ వేరొకవైపున 'రాయనా [గ] నాయక'అని ముద్రించుకొనుట జరిగియుండవచ్చును. కాని అతని కెక్కడ నాగనాయకుడనే పేరులేకపోవుటచే నిది ఊహమాత్రమే కాగలదు. ముందు పరిశోధనలనుబట్టి నిజము తెలియవలెను.

డా. అబ్దుల్అలీగారు ఈ నాణెములపై సమస్యను తిరుగ తోడినందువలన కొన్ని క్రొత్త విశేషములు తెలియవచ్చినవి. 1. ప్రతాపరుద్రగజపతి షితాపుఖానుద్వారా వరంగల్లును లోబరచుకొనెను. 2. షితాపుఖాను వరంగల్లు రాజ్యములో నాడుటకై 'కాకతి' బిరుదు గల ఆ ప్రతాపరుద్ర గజపతి నాణెములను కటకములో ముద్రింపించి తెప్పించుకొనెను. 3. వాటితోపాటు 'విజయశత్ప్రళి', 'గజపతి ప్రతాపరుద' అని వ్రాయబడిన వేరే నాణెములుకూడ వరంగల్లుచేరెను. 4. షితాపుఖాను 1514 వరకు వరంగల్లును పాలించెనని నిశ్చయముగ చెప్పవీలగుచున్నది. 5 షితాపుఖానుకి తాతపేరగు 'నాగనాయక' అనునది అసలుపేరగునేమో పరిశోధించవలసియున్నది.

ఇట్టి చరిత్రాంశములు ఇతరత్ర తెలియని వాటిని అబ్దుల్ అలీగారి ప్రేరణవలన తెలుసుకొనగలిగినందుకు వారికి కృతజ్ఞుడను. అట్లే వారీమధ్య నాకు 'రాయగజకేసరి' అని వ్రాసియున్న వెండి నాణెములను కొన్నిటినిచూపిరి. అవి కాకతి గణపతిదేవుడివి కాని రుద్రమదేవివి కాని కావచ్చును. అవి రూకలు అయియుండును.అట్టివి పదిరూకలగుచో 1 గద్యాణము. ఇది బంగారు నాణెము. వీరు చూపిన రూకలు వరంగల్లు కోటలో దొరికినవనిరి. కనుక 'రాయగజకేసరి' లేక 'దాయగజకేసరి' అని వ్రాయబడియున్న నాణెము లింతవరకు వరంగల్లులో దొరకకపోవుటయేల అని ప్రశ్నించుటకిపుడు తావులేదు.

ఇరుకులోంచి...

"సాంధ్యశ్రీ"

నీలి పావడా కట్టుకొని
చంద్రుడి బొట్టు పెట్టుకొని
చుక్కల పూ కొప్పుతో
వెన్నెల్లో మజ్జన మాడుతున్న
నా కజ్జల సుందరీ. . !
ఉదయం కానీకు-
సమస్యోదయం. . !

చంద్రాతప చంపకాన్ని
నా చెక్కిలికానించి
ఒక్క క్షణం
ఏదో స్మృతిని
మరేదో అనుభూతిని
కలిపి నిలిపి
మరు క్షణంలో
ఉదయ రాగాన్ని పాడుకుంటూ
నా హృదయాన్ని ముక్కలు చేయకు. . !

నా చెలిమి కోసం
క్షణ జీవితాన్ని
అక్షయమని తలుస్తూ
తపించి పోతున్న
నిరు పేద
ఆ గడ్డి పువ్వును చూడు. . .
తెల్లవారితే
సూర్యుడి పాదులు గుచ్చుకొని
నెత్తురు కక్కుతూ వచ్చి పోతుంది. . !

ఈ క్షణంనుండి
నా చెలిని
నా చెలిమిని
వేరు చేయకు ఉదయంలో. . !
ఈ సైకతాంగన చూడు
చంద్రికా గంధం వెన్నెలదికొందికదా !
నగ్నంగా
ఉద్విగ్నంగా. . .

ఈ శీత శీతలా తర్పణాన్ని
ఆతపంతో ఆవిరి చేయకు. . !

విరులతో
విరహపు టావిరులతో
విలసిల్లిన
అవంధ్య సౌగంధ్య వాసిత సమీరణ
శ్రావ్య సమీర సంగీతాన్ని
సూర్యాగమన రావంతో
అపశ్రుతి పాలు చేయకు. . .
హిందోళకు - ఆందోళన కలిగించకు. . !

ఏ ప్రియుని కోసమో
ఈ చెట్లు
మంచు గొజ్జంగి పూ నీటితో
మజ్జనాలాడి
విరబూచిన పూలతో
పరిసరాలను పక్కలు చేసి
వాసక సజ్జికలయి
ఒళ్లంతా కళ్లు చేసుకొని
ఎలా చూస్తున్నాయో. . .
ఖచర సందర్శనం చేయించి
కళ్లలో నీళ్లు తెప్పించి
వియోగ గ్లాని కలిగించకు. . !

ధరిత్రి
నిశ్చల సమాధిలో
ఏ అలౌకిక దివ్యానంద ప్రాభవాన్ని
సచరిస్తుందో. . .
చూడు. . .
పగలెల్లా మురికి శరీరాలను కడగటం
కావడి బిందెలతో—కాళ్లతో, తాళ్లతో
తప్పవు కదా తలపట్లు — తల పోట్లు
ఎందుకింకా
ఏటి వధూటికీ పగటి పాట్లు. . ?

పగటి సూదుల్ని
కళ్లలో గుచ్చుకొని
బాధ పడుతూ
రాత్రంతా
నిద్రపోయే - ఈ జనం
వెన్నెల చాందినీ క్రింద కళ్ళు
తెరవరేం. . .?

సూర్యుడు
వెల్తురు పేరుతో
ఇంత కిరణాల దుమ్ము
కళ్లలో చల్లి పోతున్నాడు
కర్పూర పొడిలా. . .!

ప్రణవం నుండి
ప్రణయం వరకు
ప్రయాణించే నిశ్శబ్ద గంభీరతకు
శతాబ్దాల సమస్యల చప్పుళ్ళు తప్ప
ఈ దినకరు డిచ్చిందే ముంది. . .?

తెల్లవారితే
కప్పుకున్న దుప్పటి తీసి
సమాధానం దొరకని
సందేహ దేహాన్ని చూపే
ఎగ్నత్వానికి
ప్రతీక - ఈ - సూర్యుడు!

రాత్రంటే తెలియని పాంథుడు
పగలెల్లా
బాధలు పోగేసుకుంటూ
రాత్రిళ్లు ఎక్కడెక్కడో
విడిచేస్తుంటాడు -
కాల్వ ప్రక్క వంతెనముందో
చౌకబారు నిషా క్రిందో
నిద్రలోనో - దరిద్ర స్వప్నాల్లోనో .

పగటి నిజం తెలిసిన
ప్రతి మనిషి
వెన్నెల మధువును చప్పరిస్తూ

పగడ పూలేరుకుంటూ
సరిత్తటిపై
మంద్ర మరుత్తులో
తారలకు బరువు బాధ్యతల్ని అతికించి
వీలి మసాబులో
విహరిస్తాడు. . .!

పచ్చని గరికల
పరిష్వంగంలో
పరవశించే ప్రతి లత కూనల
నాజూకు
పగలు ఎంత గిలగిల్లాడినా కనిపించదు. .!

ఈ పూలు
పగలెల్లా వాసల్ని ఎక్కడెక్కడ దాచుకుంటాయో కానీ. .
రాత్రి కాగానే
దిక్కు మాలిన జనం ముక్కుల్లోకి విదలించి వేస్తాయి. .
ఎలాగూ నిద్ర పోయే
దరిద్రానికి దాసులని - వారసులని
వాటికీ తెలుసు. . !

నిముషం పాటు
అనిమిషంగా అర్కుడ్ని చూస్తే
కన్నీళ్ళు - కసీపు గుడ్డితనం
ప్రతి ఫలమని తెలిసినా
అయోమయంలో పడటం
అందరికి హక్కై పోయింది. .
వాడి తేజస్సు
వీడికి తమస్సు. . .!

అందుకనీ. . .

రాత్రి తారల్ని చూస్తూ
రాత్రి గాలుల్ని పీలుస్తూ
రాత్రిని
రాత్రి సమస్యలపై కప్పేస్తూ
ఆవేశంతో
ఈ పగటి ఇరుకులోంచి
ఎగిరిపోతా -
వెన్నెల వెన్నలోకి - వెల్లలోకి.

అప్పిచ్చువాడు, వైద్యుడు...!

వైద్యుడు లేని వూళ్లో వుండవద్దని సుమతీ శతకం చెప్తోంది. నాటు వైద్యులు గ్రామాల్లో కొల్లలుగా వున్నారు. కాని వారిమీద ఆధారపడి, జయాపజయాలకు దేవునిమీద బాధ్యత వేసి కూచునే రోజులు పోయాయి గదా !

ఇప్పుడు ప్రతి గ్రామంలో శాస్త్రీయ పద్ధతుల్లో వైద్య సౌకర్యాలు కావాలి. అదీ మన లక్ష్యం. మన రాష్ట్రప్రభుత్వం గ్రామీణ ప్రజలకు వైద్య సౌకర్యాల్ని కల్పించేందుకు ఈ యేడు రూ. 105 లక్షలు కేటాయించింది.

మామూలుగా ఆరోగ్య కార్యక్రమం క్రింద చేసే కేటాయింపును రూ. 25 లక్షల నుండి రూ. 100 లక్షలకు పెంచారు.

తాలూకాల్లో కొత్త ఆస్పత్రులు తెరుస్తారు. ఇప్పుడు పనిచేస్తున్న వాటిలో అదనంగా అవసరమయ్యే వైద్య పరికరాలు సమకూరుస్తారు.

ఏ వ్యాధి ముంచుకొచ్చినా గాభరాపడి పట్టణాలకు పరుగెత్తే అవసరం ఇక వుండదు. వైద్య సౌకర్యాలు లేని గ్రామాల్లో అల్లోపతి, ఆయుర్వేదం తదితర భారతీయ వైద్య విధానాలకు చెందిన గౌరవ వైద్యులను రిక్రూటు చేసేందుకు రూ. 8 లక్షలు కేటాయించారు.

ప్రభుత్వ పరంగా ఎంత వ్యయంచేసినా, అన్ని తరహాల వైద్యులు సహకరిస్తేనే ఈ "వైద్య విప్లవం" సంపూర్ణం అవుతుంది.

సమాచార, పౌర సంబంధ శాఖ, హైదరాబాదు.

2/76

చైనాలో నూతన పరిణామాలు :

సోషలిస్టు రాజకీయాల్లో గుణపాఠాలు

"హంసవివేక్"

ప్రపంచ రాజకీయాలపై చైనా ప్రభావాన్ని ఈనాడు ఎవరు కాదనలేకపోతున్నారు. అత్యధిక జనాభాగల ఆదేశపు అంతర్గత–విదేశీ వ్యవహారాలపట్ల సహజంగా ఇతరులకు ఆసక్తి వుండడంలో ఆశ్చర్యంలేదు. మరీ ముఖ్యంగా మూడో ప్రపంచదేశపు రాజకీయాల్లో చైనాపాత్ర విస్మరించరానిది. చౌఎన్‌లై మరణం, టెంగ్‌సియావో పింగ్ పదవీచ్యుతి, తీన్ ఆన్‌మెన్‌లో ఇటీవల జరిగిన అల్లరులు, మావో క్షీణిస్తున్న ఆరోగ్యం, క్రమంగా చైనాలో పోలీసు భద్రతా దళాలకు పెరుగుతున్న ప్రాముఖ్యత ఇవన్నీ చైనా పరిశీలకులకు ఆసక్తి కలిగించేవి రాబోయే చైనా రాజకీయాల పరిణామాలపట్ల రకరకాల ఊహాగానాలు చేయడానికి అవకాశం కలిగించేవి. భవిష్యత్ ప్రపంచ రాజకీయ పరిణామాలను అంచనా వేయడానికి ఊతనిచ్చేవి.

హాంగ్‌కాంగ్ స్థావరంగా, చైనా రాజకీయ పరిశీలకులు పెకింగ్‌నుంచి వడబోతగా వచ్చే వార్తల ఆధారంగా తమ వ్యాఖ్యానాలు చేస్తున్నారు ముఖ్యంగా భారతదేశ పత్రికల్లో డెంజిల్ పెరిస్, ఎల్లి ధోర్ప్ పంపిస్తున్న రిపోర్టులు ఒక విధంగా చైనా రాజకీయ పరిణామాలను అవగతం చేసుకోడానికి ఉపయోగపడుతున్నాయి. అయితే 'పీపుల్స్ డెయిలీ' లేదా 'రెడ్‌ఫ్లాగ్' పత్రికలు మాత్రమే చైనాలోని వాస్తవ పరిస్థితులను బయటికి ప్రపంచానికి చెప్పగలవేమో! కొన్ని–అనవసరపు విషయాలు – చైనాలోని సోషలిస్టు వ్యవస్థకు నష్టం కలిగించే అంశాలు అందులో రావడంలేదంటే ఆశ్చర్యపడనక్కరలేదు. ఏ వ్యవస్థనైనా తన భద్రతకు ముప్పుకలిగించుకునే విధంగా ప్రవర్తించదు!

అతివాద–మితవాద వైఖరుల మధ్య 'బ్యాలెన్సింగ్ ఫోర్సు' గా పనిచేసి, తన అంతిమదశ వరకు చైనాకు చాకచక్యంగా సారథ్యం వహించిన చౌయన్‌లై ఈనాడు లేడు అయినా మావో నాయకత్వం ఇంకా వర్ధిల్లుతూనేవుంది. ఒక మహత్తరమైన దేశానికి అక్షరాల పాశ్చాత్య వ్యాఖ్యాతల భాషలో "రాక్షసశక్తి" నిచ్చిన మావో విధానాలు ఈనాడు కొంత వ్యతిరేకతను కొనితెచ్చుకున్నాయి. 'ప్రజల రాజకీయాలను ప్రజలమధ్యకు తీసుకెళ్లి పరిష్కరించమనే' నిజమైన ప్రజాస్వామిక పద్ధతియొక్క సత్ఫలితమది. ఒకవేళ పైనుంచి పరిష్కార మార్గాలను రుద్దితే ప్రజలు ఏనాడో తిరస్కరించేవాళ్లు. సోషలిస్టు వ్యవస్థ శ్రామిక నియంతృత్వంపేర కొంతమంది "నూతనవర్గ అధినేతల" ఆధిపత్యంకింద అభివృద్ధి సాధించినా, అది శాశ్వతమైన నిజమైన అభివృద్ధి అనిపించుకోదు. ఏ ఇజమైనా ప్రజలకు మేలు కలిగించినపుడే చిరకాలం మనగలదనేది వాస్తవం.

నూతన పరిణామాలు :

టెంగ్ పెట్టుబడిదారి పంథాను అవలంబిస్తున్నాడనే విమర్శకులోనై తన ప్రధానమంత్రి పదవిని కోల్పోయాడు అతని స్థానే తటస్థంగా వ్యవహరించగలడని, మావో అనుకూలుడని హువాకో ఫెంగ్ ప్రధానమంత్రిగా నియమించబడ్డాడు: అతనికి సహాయంగా పన్నెండు మంది ఉపప్రధానులు వున్నారు. వీరిలో 63 సం.ల సర్వసైన్యాధికారి జనరల్ ఛెన్ సిలీన్ ఒకడు. ఇతను చౌకు సన్నిహితంగావుండేవాడు. అతోధిగా టెంగ్‌ను సమర్థించినవాడని ప్రతీతి. ఫలితంగా ఈనాడు ఈ జనరల్‌ను దుయ్యబడుతుకూడా పెకింగ్‌లో పోస్టర్లు వెలువడ్డాయి.

తీన్ ఆన్‌మెన్ దగ్గర టెంగ్ అనుకూలవర్గాలు చౌకు శ్రద్ధాంజలి అర్పించేరోజున పెద్దఎత్తున ప్రదర్శనలు చేసాయి. అవి చైనాలోని ఇతర పట్నాలకుకూడా వ్యాపించాయి. అల్లరులకు దారితీసిన ఆ ప్రదర్శనలను పోలీసు బలాలు అదుపులోకి తెచ్చాయి. గతంలో సాంస్కృతిక విప్లవపురోజుల్లో ఒంటెత్తు పోకడతో విపరీతంగా

ప్రవర్తించిన యువకులను సైన్యం అదుపులోకి తేవడం ఈ సంఘటన గుర్తుచేస్తుంది.

ప్రస్తుతం ప్రధాని హువాకో ఫెంగ్ తన అధికారాన్ని కట్టుదిట్టం చేసుకునే నిమిత్తం పోలీసు బలగాన్ని వినియోగిస్తున్నాడని తెలుస్తున్నది 12 లక్షల సంఖ్యలోవున్న భద్రతా పోలీసుబలగం చైనాలో శాంతిభద్రతలను కాపాడే అతిశక్తివంతమైన సాధనం. ఇది రహస్య విభాగాలతో దేశీయ వ్యవహారాలపై నిరంతరం నిఘావుంచుతూ పనిచేస్తుంది. ఈ పోలీసు విభాగం ఇంతశక్తివంతంగా పనిచేయడానికి కారకుడు మావో అంగరక్షకుడు వాంగ్‌తుంగ్‌సింగ్. ఈ పోలీసు నిఘాబలగానికి 20 డివిజన్ల పోలీసులున్నారు. దేశవ్యాప్తంగా ఏజంట్లు ఈవిభాగంలోని ముఖ్యమైన సీలలు. ఒకప్పుడు మావో టెలిఫోన్‌నుకూడా ఈ భద్రతాదళపు ఏజంట్లు 'ట్యాప్' చేసు రహస్యంగా వినేవాళ్ళని, ఆ రహస్యాన్ని పసిగట్టిన వాంగ్, జనరల్‌లో జూచింగ్ అనే సైనికాధికారి దానికి కారకుడని అరెస్టు చేయించాడనే కథ ప్రచారంలోవుంది.

మావో భార్య మేడమ్ చియాంగ్ చింగ్ చైనా రాజకీయాల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న వ్యక్తి. అతివాదవర్గానికి నాయకత్వం వహిస్తూ తరచుగా తన ప్రాబల్యాన్ని నిరూపించుకుంటున్న మహిళ ఆమె పట్టుదలతో చైనా కమ్యూనిస్టుపార్టీ అధికారవర్గంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న నాయకురాలు. మావో తర్వాత అధికారంలోకి వచ్చేనిమిత్తం ఆమె తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని వ్యాఖ్యాతల అంచనా. మరోవైపు లీషావ్‌చీ లిన్ పియావో – ఫెంగ్ అనుయాయులు అవసరమైనపుడు తలఎత్తడానికి సిద్ధపడుతున్నారు. ఒక విధంగా టీన్ అన్‌మిన్‌లో జరిగిన అల్లరులు భవిష్యత్తులో చైనాలో రాబోయే తీవ్రమైన పరిణామాలకు నాంది పలికాయని అనుకుంటున్నారు.

ఈ శతాబ్దపు మహోన్నత విప్లవానికి స్థావరమైన జన చైనా భవిష్యత్తు ఏమిటి? చైనా సోషలిస్టు రాజకీయాలు నేర్పుతున్న గుణపాఠాలు ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానంగా మొదలు చైనాలోని సైద్ధాంతిక పోరాటాన్ని అవగతంచేసుకోవాలి.

సైద్ధాంతిక పోరాటం :

మావో నిర్దేశించిన మూడు ఆదేశాలు : (1) సుస్థిరత్వం-

మీ బిడ్డ సంతోషంగా ఉండాలంటే



బిడ్డ ఆపకుండా
ఏడుస్తూఉంటే
జీర్ణశక్తి
బాగాలేదేమో!
పాపకి అమృతాంజన్
లిమిటెడ్ వారి
గ్రైప్‌మిక్స్చర్
ఇవ్వండి. నులినొప్పి,
వాయువు, అజీర్ణం
పళ్లువచ్చే కాలంలో
ఇబ్బందులు త్వరగా
తగ్గిపోతాయి. బిడ్డ
ఇంకా సంతోషంగా
ఉంటుంది.
అమృతాంజన్
లిమిటెడ్

అమృతాంజన్
గ్రైప్ మిక్స్చర్ ఇవ్వండి

OBM.2640 TG

ఏక్యత, (2) జాతీయ ఆర్థికాభివృద్ధి, (3) శ్రామిక నియంతృత్వ సిద్ధాంత అధ్యయనం రివిజనిజంకు వ్యతిరేకంగా పోరాటం. ఈమూడు ఆదేశిక సూత్రాలను ఆధారం చేసుకొని వాటిని అనుసంధానిస్తూ ఒక 'జనరల్ ప్రోగ్రాం' ను ప్రజలకు కార్యక్రమంగా ప్రతిపాదిస్తున్నానని టెంగ్ ప్రచారం చేసాడు. రాబోయే 25 సంవత్సరాలలో చైనా కమ్యూనిస్టుపార్టీ కార్యకలాపాలకు తన కార్యక్రమం ఆధారం కావాలని పదవీచ్యుతుడైన టెంగ్ అన్నాడు అయితే పరిశ్రమల్లో ఆధునీకీకరణ, సాంకేతికమైన అభివృద్ధికి మాత్రమే ప్రాముఖ్యత ఆ కార్య క్రమంలో కనపడిందని, పార్టీయొక్క మౌలికమైన విధానం వర్గపోరాటం, రివిజనిజాన్ని వ్యతిరేకించి అడ్డుకోడం వంటి ప్రాణ ప్రదమైన అంశాలను టెంగ్ కావాలని విస్మరించాడని మావో అనుయాయుల తీవ్రవిమర్శ. "రెడ్‌ఫ్లాగ్" (పార్టీ సిద్ధాంత పత్రిక) ఇటీవలి సంచిక ఈ అంశాన్ని స్పష్టం చేస్తూవుంది.

విప్లవ వ్యతిరేకమైన అంశాలను లేదా కార్యకలాపాలను శ్రామిక వర్గం సహించదు. బూర్జువా విధానాలను - వ్యవహారాలను కార్మికులు రైతులు నిరంతరం అదుపులో పెడుతూనేవుంటారు. అత్యధిక ప్రజలు మితవాద వైఖరులను వెనక్కి నెట్టివేస్తూనే వుంటారు. శ్రమకు విలువనిచ్చి నిజమైన మానవ విలువలను రక్షించే సాంస్కృతిక పోరాటపు ఫలితాలను కాపాడుకుంటారని ఇటీవల చెలరేగిన సైద్ధాంతిక పోరాటం ఒకవైపు వాదాన్ని ముందుకు తెస్తున్నది.

ఒకవిధంగా ఈనాడు కొనసాగుతున్న ఈ సైద్ధాంతిక పోరాటం వర్గపోరాటపు నైశిత్యాన్ని పరిక్షిస్తున్నది. ఇన్ని సంవత్సరాలు గడచినా దేశంలో ప్రతీపశక్తులు అణగి మణిగి వున్నాయని, ఈనాటికి చైనా మారుమూల గ్రామాల్లో ప్రజలు మూఢనమ్మకాలకు లోనై వున్నారనే అంశం చౌ యన్ లై హింటన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలలో స్పష్టమవుతుంది. అందువల్ల ఈనాడు తిరిగి రెండవ సాంస్కృతిక పోరాటం సాగుతున్నదని అనుకూలవర్గాల వ్యాఖ్య. ఇది అసలు అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు సాగుతున్న పోరాటమని కొంతమంది పాశ్చాత్య పరిశీలకుల అభిప్రాయం.

గత పదిసంవత్సరాల కాలంలో వచ్చిన పరిణామాలను కూడా మనం జాగ్రత్తగా పరిశీలించవలసి వుంటుంది. దేశవ్యాపితంగా ప్రజలందరిముఖ్య చర్చకుపెట్టి, ఐదేళ్ళ తర్వాత జాతీయ ప్రజాసదస్సుల్లో నూతన రాజ్యాంగాన్ని ఆమోదించారు. కార్మికులు-బీదరైతులు-విప్లవ మేధావులు ఈ రాజ్యాంగంద్వారా ప్రజాధికారాన్ని నిర్వహిస్తున్నారు. అత్యధిక సంఖ్యాకులు అల్పసంఖ్యలో వున్న అర్థిక వాదులను, మితవాద వైఖరిగల మేధావులను అదుపులో పెడుతున్నారు. రాజ్యాధికారం అనేది కేవలం ప్రజలను ఇష్టానుసారం ఆటబొమ్మలుగా ఉపయోగించుకొనే నిమిత్తంకాదని, ప్రజల చేతుల్లో విప్లవాన్ని కాపాడుకొనే ఆయుధమని మావో భావన. అందువల్లనే ప్రజలను అక్షరాల అధికారంలో భాగస్వాములను చేసే ప్రయత్నం నిరంతరం కొనసాగాలని ఆ విధానంయొక్క సారాంశం.

చైనా జాతీయ తత్వాన్ని, రాజకీయ అర్థిక సిద్ధాంతాలను, చరిత్ర-పాలనా వ్యవహారాలను మామూలు కార్మికులు-రైతులు-విద్యార్థులు అధ్యయనంచేస్తూ, ఆచరణలో వాటిని నిరూపించాలని పార్టీ నిర్దేశిస్తున్నది. ప్రజలకు నాయకులకు సంబంధించిన ప్రతి అంశాన్ని బహిరంగంగా విమర్శకులోను చేయాలని, సోషలిస్టు నిర్మాణాన్ని అత్యాధునాతమైన పరిశ్రమలతో-వ్యవసాయంతో-క్రమశిక్షణతో జోడించాలనే మహత్తర యత్నం సాగుతున్నది.

చైనా జాతీయ వ్యవహారాలు చైనీయులకు సంబంధించిన అంశాలు. ఆ దేశపు అంతర్గత పరిస్థితి అక్కడి ప్రజల ప్రవర్తనపై ఆధారపడి వుంది. మావో నాయకత్వం క్రమంగా 'మావో అనే వ్యక్తి' నుంచి ప్రజల భావాల్లో ఇంకిపోయింది. అవే మావో భావాలుగా వ్యాప్తిచెంది ఈనాడు ఆధిపత్యం వహిస్తున్నాయి. ప్రజలు వాటిని తిరస్కరించిన పక్షంలో సహజంగానే మావోవాదం వుండదు. కాని 1949 నుంచి ఈనాటివరకు వచ్చిన పరిణామాలు చైనా జన జీవితంలో మావో ఆలోచనా విధానమనేది ఎంతలోతుల్లోకి వేళ్ళూని ప్రజలను నడిపిస్తున్నాయో స్పష్టంగా నిరూపిస్తున్నాయి.

మనిషి శ్రమకు ఉన్నతమైన విలువ, పొరుగువాడిని ప్రేమించి సహాయపడమని, దేశభక్తి అంటే దేశంలో అట్టడుగునవున్న మామూలు వ్యక్తికూడా తన దేశాన్ని ప్రాణప్రదంగా చూసుకోడమని, దానికోసం వ్యవస్థ ఆ వ్యక్తికి అన్నిరక్షణలు కల్పించడమేనని, వ్యక్తి స్వార్థాన్ని సామాజిక సంక్షేమానికి-మౌలికమైన మార్పుకోసం త్యాగం చేయడమేననే గుణపాఠాలు చైనాలోని సోషలిస్టు రాజకీయ పరిణామాలనుంచి స్వీకరించవలసి వుంటుంది.

పేషంట్

శ్రీ వసంతరావు దేశపాండే 'నాగరంజని'

వాడు
నా పేషంట్
నిరాశ
వాడి శ్వాస
నిస్పృహ
వాడి నాడి
వాడి నుదిటిపై
విధి వెక్కిరింపు తాలూకు గీతలు
కోడి గట్టి ఆరిపోతున్న కళ్ళు
ఆ కళ్ళ క్రింద
అనుభవాల గీతలు
ఒంటి నిండా
నిరాశల మడతలు.

ఏమి బరువో తెలియదు
వంగి పోయింది వాడి నడుము
స్టెతస్కోపుకే అందలేదు
వాడి గుండె స్పందన
ఇంకా ....

వాడి
వేడి
ఏం చూడను.
'ఆకలి' — వాడి రోగం
ఆకలి రోగానికి
అన్నం మందు   అని
వ్రాయనా ? ?

అయినా నేను డాక్టర్ని
ప్రిస్క్రిప్షన్ వ్రాయడమే నా పని.

ఊఁ ... చూడు. ఏం పేరు
భావి లేని భారత పౌరుణ్ణి
యువకుణ్ణి
ఊఁ... సరే
'ఆనంద'మనే యీ టానిక్
ఆశ అనే చంచాతో
రోజూ మూడు పూటలు త్రాగు
ఇంకేం అక్కర్లేదు
నీ రోగానికి మందు
ఈ చీటీపై వ్రాసా
పత్యాన్ని కూడా ప్రక్కనే వ్రాసా
నిరాశ
నిస్పృహ } ఇవి పత్యం వీటిని పీల్చకు
నిట్టూర్పు

వీలయితే రేపు
మళ్ళీ కనిపించు
మరో మందు వ్రాస్తా.

మరి మీ ఫీజు
నీ చిరునవ్వే నా ఫీజు
వెళ్ళి రా
వీలయితే రేపు మళ్ళీ ఓ మారు కనిపించు.

(మిత్రుడు దేవరాజు మహారాజు ప్రిస్క్రిప్షన్ చదివాక .... కృతజ్ఞతతో

— రచయిత

గువ్వ

కే ఎస్వీ

కడలేని గాథలు వినిపిస్తోంది
కళ్ళు లేని రాత్రి
తారకాంగుళులతో ఏకతారమీటుతూ
ఏకధారగా కీచురాయి గొంతుతో ఏడుస్తోంది
యుగాల వేదన
చీకటిగా నేలకి కురుస్తోంది
నిశ్శబ్ద జీవఘోష
అంతటా జాలిజాలిగా పరుచుకుంది
ఎప్పటికీ తెల్లవారదేమోనని
బిక్కు బిక్కు మంటోంది గువ్వ—

ఇప్పుడు

కే ఎస్వీ

నీ గొంతులోనూ నా గొంతులోనూ
బిగుసుకొన్న మూగతనం వెనుక
మాటలు మ్రోగుతున్నాయి !
నిశ్శబ్ద ఘోషలు చెలరేగుతున్నాయి !

నీ చూపూ నా చూపూ కలిసిన చోట
నిదురకాని నిదుర మొక్కలా మొలిచింది !
రంగురంగుల కలలపూలు పూస్తోంది !
నీ గుండే నా గుండే
ఒకే ఒక్క శ్రుతికి
ఆరోహణగానూ అవరోహణగానూ కొట్టుకుంటున్నాయి !
నువ్వెవ్వరని నిన్నూ
నేనెవ్వరని నన్నూ
అడుగుతున్నాయి ! !

బాలవ్యాకరణము – త్రిలింగలక్షణశేషము

శ్రీ పాతకోట రాధాకృష్ణమూర్తి

"బాలవ్యాకరణము– త్రిలింగ లక్షణశేషము" అను శీర్షికతో ఏప్రియల్ నెలలో నాగళ్ళవారి వ్యాసము "భారతి"లో పడినది. దానిపై నేను జూన్ నెల 'భారతి'లో కొంత చర్చచేసితిని. తిరిగి నాగళ్ళవారు సెప్టెంబరు నెల 'భారతి'లో చర్చానేదిక వహించిరి. పిమ్మట నేను "నవంబరు" నెలలో "భారతి"లో సమూలచ్ఛేదము చేసితిని. తదుపరి "మార్చి" నెల భారతిలో నాగళ్ళవారు నను గూర్చి గానము చేసిరి.

వారు నాకుఁ దిరిగి పని కల్పింపరని భావించితిని. కాని వారూరకుండరైరి. నావి కసితోఁ గూడిన వ్రాతలట. వారి వ్రాతలు గమనించుడు. "జల్పాకులయిన పాతకోటవారు వ్రాయు వ్రాతలకు సప్రతిరోధమగు క్రోధముగాక హేతువు మఱియొండుగలదా? కావుననే శ్రీకృష్ణుఁడు భగవద్గీతలో" అని శ్లోక మొక్కదానిని పేర్కొనిరి. మాఘుడు తన శిశుపాల వధ కావ్యమున వ్రాసిన యీ క్రింది శ్లోకము తగురీతి వారికి తగియున్నది.

> శ్లో. సహజాంధ దశః స్వదుర్నయే
> పరదోషేక్షణ దివ్యచక్షుషః
> స్వగుణోచ్చగిరో మునివ్రతాః
> పరవర్ణ గ్రహణేష్వ సాధవః

"చర్చ సక్రమముగాఁ జాగింపలేక, గతిగానక తుదకు శాబ్దిక చర్చకు దిగిరి. అది వారికి వ్యాకరణ పాండిత్యమేకాక శబ్ద పరిజ్ఞానము నైతమంతంతమాత్రమేయని రుజువు చేయుచున్నది." నాకు శబ్ద పరిజ్ఞానములేదని వాపోవుచున్నారు. నాగళ్ళవారి శబ్దపరిజ్ఞానము చూతము. వారు వాడిన "రుజువు"నే తీసికొందము. దీనికి శబ్దరత్నాకరమును మూదలగాఁ దీసికొనుచున్నారు. ఆచార్యులవారి వ్యాకరణము పనికి రాకపోయినను సమయమునకు వారి నిఘంటువును వాడుకొన్నారు. వీరా శబ్దమును గూర్చి వ్రాయుచు "శబ్దరత్నాకరములో రుజువు అని కలదు. ది విశేష్యము. హిందూస్థానీ భాషా పదము. సాక్ష్యము, దృష్టాంతమని దాని యర్థములు. ఇవి నా మాటలు గావు సుమా! సీతారామాచార్యులవారు చెప్పినటివే" అని యుటంకించిరి. అన్యదేశ్యమని వీరంగీకరించిరిగదా? ఇది సూరికి సమ్మతమా? సూరి తెలుగు క్రియలయిన "చేతురు కోతురు అసాధువు"లనగా నిక నన్యదేశ్యపదముల నాయన గ్రహించునా? ఇది సూరి మతమా? సుశబ్దాపశబ్దముల గూర్చి చర్చించు నాగళ్ళ వారికి "రుజువు" హిందీస్థాని పదమును పేర్కొనుట వారి సుశబ్ద జ్ఞానమునకుఁ దారకాణ కాబోలు. "మాట్లాడు" సుశబ్దమా? "పయోగించారా" సాధువా? "నిజానిజము" నిర్దోషమా? అని వ్రాసినారు. అట్లయిన "రుజువు" సుశబ్దమా? సాధువా? ఏ వ్యాకరణముచే నది సాధువగును?

భవతిస్మమోహా : ఇది వీరి వ్రాత. "భవతిస్మమోహాః" అను రూపమెటనైననుండునా? భూధాతువునకు లట్ ప్రథమ పురుషైక వచనరూపము "భవతి". అంతేకాని "భవతిః" అని విసర్గ లేదు. విసర్గమున్ననే "భవతస్స" అని యగును.

"రాధాకృష్ణమూర్తిగారికి బాలవ్యాకరణ ప్రణాళిక యర్థముగా లేదని మొదట నేననుకొని పొరపడితిని వారికి బాల ప్రౌఢ వ్యాకరణ సూత్రములు గూడ సర్థము గాలేదని యిప్పుడు నాకుఁ దెలిసెను వారికి వ్యాకరణము రాదు. ఈ మాటయొకసారికాదు వందసారులందును" అశ్వమేధమున గుర్రములలాటమునగట్టు పట్టీవలె "నాకు వ్యాకరణము వచ్చును–నేను వ్యాకరణ నిష్ణాతుడను" అని ఫలక మొకటి తగిలించుకొన్న బాగుండును. బాలవ్యాకరణము వీరికి కరతలామలకమను కొందము. వారి వ్యాకరణ పాండిత్యమును పరిశీలింతము –

"అగునని సూత్రమునను్నంత మాత్రమున నిత్యావిధియని భావింపరాద"ని పాతకోటవారు జూన్ "భారతి"లో భాషించిరి. అగునన్నచో నిత్యమనియర్థమా? దీనివలన నాగళ్ళవారి శాస్త్ర

జ్ఞానము తేట తెల్లమగుచున్నది. అత్వనకు సంధిబహుళముగానగు సూరి సూత్రము. ఎందు బహుళమన్నచాలదా? మరియగునని ప్రయోగింపనేల ? ఆ దళప్రయోజనమేమి ? "యనియు" నాయుద్దేశ్యము అగుననియున్నంత మాత్రమున విధి సూత్రము కానక్కరలేదనియే. అది నియమ "మని నవంబరు భారతిలో వక్కాణించిరి."–పాతకోట వారి మాటల ప్రమాణికము, అవిచార మూలకములు. వారు ఇంటి నాలుగుగోడలనడుమఁగూలువై "అగు" నన్నపుడు తమ కిష్టమయిన యర్థము చెప్పుకొనవచ్చును. బహుళమని యర్థము చెప్పుకొన్నను దాని నెవ్వరు పట్టించుకొనవలసిన పనిలేదు. ఇది శాస్త్రచర్చ. బాల వ్యాకరణమునగాని, త్రిలింగలక్షణ శేషమునగాని "అగు" నని యున్న పుడర్థమేమి ? ఆ రెండింట సూత్రరచనా విధాన మెట్లున్నది ? అని పరిశీలింపవలయును."

అగును నిత్యమనుట వారి వాదమున పసలేదని తేటతెల్లము. బాల ప్రౌఢ వ్యాకరణ సర్వస్వము ప్రథమసంపుటములో సంధిపరిచ్ఛేదమున మొదటిసూత్రమునకు వ్యాఖ్య వ్రాసి శ్రీ టి.భాస్కరరావుగారు చివరనిట్లు వ్రాసిరి. "సూత్రమున "అగును" అని యుండుటచేత నిత్యముగనగు" నని కొందరు భ్రమపడుచున్నారు. ఈ రెండింటికిని భేదముగలదు. ఈ సూత్రమునందలి విధికి భిన్నముగా మఱొక విధి యుండనంతవరకు ఈ నియమము ననుసరింపవలయునని యర్థము. భిన్నముగా విధించినప్పుడు ఈ సూత్రము పనిచేయదు. ఉదాహరణము లందు పరపదములకు మొదటి అచ్చుల నన్నింటినిచ్చి "ఋ ౠ" అను అచ్చుల నీయలేదు. దానికి కారణము ప్రకీర్ణక పరిచ్ఛేదము మొదటి సూత్రమున ఋ ౠ వర్ణములను రల తుల్యములుగా నిర్ణయించుట. అతడు + ఋషి = అతడుఋషి అనియే యుండును. ఋవర్ణము రవర్ణముతో తుల్యమగుటవలన సంధి కవకాశము లేకపోయినది. ఇట్టి వాని కవకాశము కల్పించుటకే సూరి సూత్రమున "నిత్యము" అని యనక "అగును" అని సూత్రమే యనెను. అందువలననే తరువాతి సూత్రమునకును అవకాశము కలిగినది." (పుట. 97). నాగళ్లవారు దువ్వూరి వారి నాశ్రయించినారు. ఆశ్రయించి యిట్లు పల్కినారు మధురముగా.

"అగుననియున్నపుడు బాలవ్యాకరణమున నిత్యమనియేయర్థము. దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు పలికిన పలుకులు పాతకోటవారికిఁ [illegible]లియవు" నిజముగా నాగళ్ళవారి కంత మాత్రమే తెలియును. [illegible]డ పదార్థములకెట్లు దెలియును ? వీరుచేసిన తప్పును దువ్వూరి వారిపై రుద్దుచున్నారు. బాలవ్యాకరణమును కూలంకషముగా మథించిన దువ్వూరి వారి మాటలు నాగళ్ళవారు చూడనేలేదు. దువ్వూరి వారు 'కలన్వాదుల నువర్ణంబునకు ఐ గు; బహువచనము పరంబగు నపుడు నిత్యముగానగు" (బాల. వ్యా అచ్ఛిక. 18) సూత్రమునకు వ్యాఖ్య వ్రాయుచు "కుజ్ ఏకవచనములందు వైకల్పికమని స్ఫురించుటకయి సూత్రము నుత్తరభాగమున నిత్యశబ్దము ప్రయుక్తమైనది." (రమణీయము – పుట – 294). ఇవి దువ్వూరి వారి మాటలు.

ప్రకృతమనుసరామః సూరి విచ్చటచ్చట "అగును" ప్రయోగించెను–విచ్చటచ్చట "నిత్యము" ప్రయోగించెను – వాని సార్థకత పరిశీలింతము—

1. "ఆమ్రేడితంబు పరంబగునపుడు కడాదులం దొలియచ్చు మీది వర్ణంబులకెల్ల నదంతంబగు ద్విరుక్తటకారంబగు."

బాలవ్యా–సంధి. 40.

కడ + కడ = కట్టకడ.

ఇట ద్విరుక్త టకారము నిత్యమని భావింతుమా ? ఇది నాగళ్ళవారి ముద్ర. అట్టియిన మహాపచారము చేసినవారమగుదుము. ఏవరికి ? సోమయాజి–ఉభయకవిమిత్రుడునైన తిక్కన మనీషికి–నాగళ్ళవారికి ప్రయోగము చూపిననే నమ్మెదురు. వారిట్లు వ్రాసినారు. "వారు [illegible]ాము చేయు నిర్ణయములకు నిఘంటువునుగాని, కవిప్రయోగమును గాని తార్కాణింపరు. ఇతరులకుఁ గవిప్రయోగములు కావలయును, చూపుడని హెచ్చరిక చేయుదురు. కవి ప్రయోగములు చూపిన గాలహరణమని గోలచేయుదురు. వారిది వస్తునిష్ఠమయిన విమర్శ కాదు. మఱి వ్యక్తి విమర్శ." ప్రయోగములుచూపిన నెవరైనను నెబానందురు. అంతేకాని అందిక పొందిక లేనివి చూపుటయేల. "తగ" అను పదమునకు నక్కరలేని దానికి విన్ని ప్రయోగములు చూపిన నేమిలాభము. ఇది చిల్లికుండతో నీరు తెచ్చుటవంటిది. తథాస్తు. పైన నాగళ్ళవారు గోలచేసినారు. కావున ప్రయోగము చూపుచున్నాను:

"ఎవ్వరు వినినను దీనికి
నవ్వుదురని యెఱుఁగఁడకటవా యెదురెదురన్
వివ్వచ్చుఁ జూపిసెనలు
గ్రొవ్వఱఁ బలుపలుకులిట్లు ద్రోణుఁడు పలికెన్.

విరాట. చతు. 189 వ పద్యము,

ఇట నెట్టయెదురని యగుచో గణభంగమగును. తిక్కన ఈ ప్రయోగమును కాదందుమా ? నాగళ్ళవారి వ్యాకరణ పరిజ్ఞానమును శ్లాఘింతునా ?

2. "అనుకరణంబునందు దిహాల్లునకు ద్విర్వచనంబగు".

బాల. సంధి. 52

కింతత్ + అనియె = కింతత్తనియె.

కాని ద్విత్వ రహితరూపములుగూడఁ గన్పట్టుచున్నవి. ఎవరివి కావు. లాక్షణిక వరేణ్యుఁడగు వినుకోట పెద్దనది. కావ్యాలంకారచూడామణిలో నతడిట్లు ద్విత్వరహితముగా ప్రయోగించినాడు.

సాతేక్యదనుడుఁదగణము
కింవద భనదది భగణంబు
సహసనని పలుక సగణంబు

వీని విభాగమిట్లు
సాతేక్యత్ + అనుడు
కింవదబ్ + అనుడు
సహసన్ + అని

సూరి సూత్రమునందలి "అగును" అను దానికి నిత్యమని యర్థము గ్రహించినచో పై రూపము లెట్లు సాధువులగును ? పెద్దనను లక్షణము తెలియనివాఁడందుమా ? లేక నాగళ్ళవారి మాటనే పరమ ప్రమాణముగా స్వీకరింతుమా ?

3. "అదంతంబగు దీర్ఘపూర్వ లోపధంబయిన మహత్తు మీఁది విభక్తి లకారంబునకు రేఫంబగు".

బాలవ్యా. తత్స. 38 వ సూత్రము.

బాల–అదంతము–దీర్ఘపూర్వము - లకారము పధగాగలది - మహత్తు – కావున బహువచనమున రేఫమురాగా బాలురు అని యగును.

దయాళు అదంతముకాదు. ఉదంతము. అయినను "దయాళురు" అను ప్రయోగము గోచరించుచున్నది. అది తెలిసిన సూరి "దయాళు శబ్దంబున కిట్లు రేఫంబును గానంబడియెడి దయాళురు" అని వివరణమున పేర్కొన్నాడు. "దయాళురు" అను రూపమునకు "కవి ప్రయోగములేదు" అని యొక టీకాకారులు వక్కాణించిరి. (చు. ఉద్యోతము. పుట-112) దానిపై రమణీయము లాక్షణికులు ప్రత్యేకముగా పని బూని నిర్దేశించిన ఒక విశేషరూపము, అనంతర కాలికులగు విమర్శకులకు కవి ప్రయోగము లందు గోచరింపనిచో 'అట్టి రూపము కానరాదనుట తగిన మాట గాని "లేనేలేదను"ట నిదానపు మాటకాదు.

దీనితోపాటు "మల్లురు" అను మాట కన్పట్టుచున్నది. సూరి సూత్రము ప్రకార మసాధువు.

"అరరేయయ్యలు రామరాజా పెదతిమ్మాదీశు బాహాభయం
కరకౌక్షేయ కధారభో రనఁగడంకం ద్రెవ్వ వీరారిమ
ల్లురకున్ మట్టియగుం దధీయ పదధూళుల్ సంగడాలేవియ

ఆంధ్రుల అభిమాన దిన పత్రిక

ఆంధ్రపత్రిక

ఇప్పుడు ఎన్నో సరికొత్త శీర్షికలతో వెలువడుతోంది.

విడి ప్రతి వెల 25 పైసలు

.... చందా వివరాలు ....

సంవత్సరమునకు	ఏజెంటు ద్వారా	రు. 88-00	పోస్టుద్వారా	రు 95-20
ఆరు మాసములకు	,,	రు. 44-00	,,	రు 47-40
3 మాసములకు	,,	రు. 22-50	,,	రు 24 30
1 మాసమునకు	,,	రు. 7-50	,,	రు 8-10

చ్చరకాంతాస్య న పాలికి న్నరడి కాఠిన్యంబు సంధింపఁగన్
రామాభ్యుదయము. పీఠిక. 59.

దీనిని కాదందునా?

ఇక సూరి నిత్యములన్న తావుల గమనింతము. ఇది యాఱు

తావుల ప్రయోగింపబడినది.

1. "అనుదంతమగు తెనుగుడు మంతమునకు నిగాగమము నిత్యము గానగును." బాలవ్యా. తత్సమ. 24వసూ. దీనివలన మగనిని—మగనిచేత—మగనికి—అగును.

2. పు వర్ణ కేతర విభక్తి పరమగుచో నుకారాంతంబులకు బహుళంబుగా, గోశబ్దంబునకు నిత్యంబుగా పుగాగమంబగు. బాల. తత్స. 49వ సూ.

దీనివలన తరువులు అని పుగాగమము తోడిరూపము, పుగాగమము లేనిచో తరులు నగును. ఇట్లే ధేనువులు, ధేనులు. కాని గోశబ్దమునకు పుగాగమము నిత్యము. కావున గోవులు అనియేయగును గాని గోలు అని కాదు. అది సూచించుటకే సూరి సూత్రమున నిత్యమనెను.

3. "సుర శబ్దంబు నిత్యంబుగా నసుర శబ్దంబు వైకల్పికముగా స్త్రీ తుల్యంబులగు; సంస్కృత సమాసంబున గావు." బాల వ్యా. తత్స. 60వ సూ. కావుననే సురలు అని నిత్యముగా స్త్రీ తుల్యత.

4. "బహువచన శ్లిష్టంబులయి యద్విరుక్తంబులయిన డకార లకారంబుల కలఘు లకారంబు నిత్యంబుగానగు." బాల. ఆచ్ఛిక. 14వ సూ.

దీనివలన త్రాళ్ళు—గుమ్మళ్ళు.

5. "ఇఁట బిందువుమీఁది తదలకు నిత్యవైకల్పికంబులయి టడలగు" బాల వ్యా. క్రియ. 59వ సూ. అంటివి—అనితివి, అండురు, అందురు, అంద్రు. ఈ మ్మొదు సూత్రముల కేవలమొక్క నిత్యమునే వాడినాడు.

6. "కలన్వాదు లనువర్ణంబుకు జగు; బహువచనము పరంబగునపుడు నిత్యముగానగు" బాల. ఆచ్ఛిక. 18వ సూ: ఈ సూత్రమున "అగును—నిత్యము" అను రెంటిని వాడినాడు. ఇచట మొదటను ఒగు అన్న చాలదా? మఱి నిత్యముగా నగుననెనేల? ఏక వచనమున సువర్ణంబునకు వైకల్పికముగా కు జగును. బహువచనమునకు జ్ నిత్యము. ఇదియే సూరి యభిప్రాయము. ఈ యాశయమునే దువ్వూరివారు స్పష్టము చేసిరి. కాని నాగళ్ళవారీ విషయమును పరికింపరైరి. దీనినిబట్టి అగును—నిత్యము సమానార్థకములుగావని తెలియుచుండగా "బాలవ్యాకరణమున అగును. నిత్యము అనునవి భిన్నములుగావు" అని నాగళ్ళవారు వ్రాసిరి.

నేను వ్యక్తి విమర్శచేసినానని యతిగా వ్రాసినారు. "సారళ్యం సరళే కుర్యాత్ శఠేశార్యం సమాచరేత్" అను పెద్దల సూక్తి ననుసరించితిని.

ఇంతేకాదు సూరి సూత్రము ప్రకారము పేదరాలు మున్నగునవి సాధువులగును. ఇల్లాలు మున్నగునవి కావు. ఇట రుగాగమము రాకపోగా టుగాగమము వచ్చుచున్నది.

"పుట్టి కంసుఁ డనెడు నట్టి రాకాసుల
చేనివలన నూడుతోనె పూని
వందు వింటఁ జేరినందుని యిల్లుటా
ల గు యశోద పావఁడనుచుఁ బెనుప."

నీలాసుందరి ప్రథ. 71వ పద్యము.

ఈ తిమ్మన ప్రయోగమును కాదందుమా?

ఇట్లే చదురు + అలు, రుగాగమము రాగా చదురురాలు కావలెను. కాని యట్లు కాని రూపముగలదు. నన్నెచోడుడు యతిస్థానమున ప్రయోగించినాడు. ఇది మార్పరానిది.

"తన ముఖమంబు జాతమని తంటడి మూపునవిభ్రజంబుతోఁ
బెనఁగు విదగ్ధ మోలనొక బేలుసతింగని యోలఁ బెట్టపి
ల్చిననదిఁ దన్నుఁబట్టనని చేరినఁ దేటుల దాని మూవి కొం
డనుచును గ్రుంకి పోయి చదురాలయి నవ్వుచు లేచెనొక్కెడన్"

కుమారసంభవము. నవమ. 88వ పద్యము.

చేయు + అతడు అనుచో నుదంత తద్ధర్మార్థ విశేషణమున కమ్ము పరంబగునపుడు నుగాగమము రాగా చేయునతడు అని యగును. ఇది నిత్యమైనచో నుగాగమము రాని రూపము గోచరమగుచున్నది.

"నాలా వెఱుఁగపు బాలుఁడ
వాలము నీకేల తొలగు మనఁగుశుఁడలుకన్
వాలిక తూపునఁ ద్రెబెడు
నాలికఁ ద్రుంచు గ్రశరమునందల ద్రుంచెన్."

జైమిని భార. షష్ఠ. 186వ పద్యము,

ఇది నాగళ్ళ వారన్నట్లు శాబ్దిక శిల్ప శిరోమణియగు పినవీరభద్రునిది.

ఇంతియేగాదు నుగాగమము రాని ప్రయోగము లింకను గొన్ని చూపెద.

రగడ. లలిత హృదయము తివిరి లంఘించు నరదములు
గులగిరులనైనదిగొనుమ దద్విరదములుఁ
దెరలి యురువడి గాలిఁ దిగఁ బాఱు వాజులును
సురరాజు సరివచ్చు చుట్టంపు రాజులును
దివిజగురు తోడనుద్దికి వచ్చుమాత్యులును

శృంగార శాకుం. 3వ ఆశ్వా. 226వ పద్యము.

ఇదియును శాబ్దిక శిరోమణియగు పినవీరభద్రుని దే?

"కప్పిన యంపవాన నలకుఁ గంపము నొందక, మానవాశనుల్
ముప్పిరిగొన్న రోషమున మోమునఁ గంఠమునన్ భుజమ్ములన్
జిప్పిలి వేడినెత్తురులు జేగురు సేరులు కొండనుండి జా
ఱొప్పెనఁ గాఱి, వీర రసమొల్కెడు పంటము దోపను(గుడై"

అకాడమీ ప్రచురణ. కాళహస్తి—ద్వితీ—57.

"గరుడానీత సుధాఘటంబుఁ గొనిపోగా నిర్జర శ్రేణి వెం
ట రయంబారగఁ బాఱునాగముల చూడారత్నసందోహ పం
బర వీథిం బరగింపఁ జంద్రుఁ డుదయింపం దోచెఁ దోడ్తోనుడూ
త్కరముం జిం దమృతంబు బిందువుల శంకం గ్రమ్మగం జేయుచున్'

అకాడమీ ప్రచురణ. కాళహస్తి. ద్వితీ. 135వ పద్యము'

ఇంకొక్కటి చాలింది యీ విషయము చాలించెద. సూరి "కర్మధారయంబులం దుత్తునకచ్చువరంబగునపుడు టుగాగమంబగు" ననగానుకారేతరముల దచ్చు పరమైనను టుగాగమము కలుగుచున్నది. ప్రయోగములు చూపలేదని నాగళ్ళవా రాక్రోశించుటచే చూపుచున్నాడ.

అడిగినఁ గ్రొదుకకపుడమి వేల్పులకు ని
చ్చలుఁ బాడి మొదవులఁజాల నొసఁగు
వేదగేస్తులఁజేరఁ బిల్చికోరినయన్ని
దుక్కిటెద్దుల బల్మితోడనిచ్చి

నీలాసుందరీ. ప్రథ. 49 పద్యము

ఇంకొక విచిత్రమేమన నుత్తున కచ్చు పరంబగునపుడును టుగాగమము రానిరూపము కానవచ్చుచున్నది. అది యెవరిదోకాదు తిక్కన కవి బ్రహ్మది.

"ముదుకడనైన నాదు బలముంజలమున్ వివిధాస్త్ర శస్త్రసం
పదయును బోయిసిగురుడు భార్గవుచే విసుమాబిభూమినా
కెదిరినవారు పెక్కండల సేమ... యెఱుగన్ జగంబునా
ముదిమియు నీ కుమారు తనమున్ వరుసన్ విజయుండెఱింగెడిన్."

భారత. ఉద్యో. 4 246.

"అగును—నిత్యము" సమానార్థకములని నిరూపించుటకు వారు పడిన సేగి నాకు మిక్కిలి జాలిగొల్పుచున్నది. దీనికి నాగళ్ళ వారు పలువురు వ్యాఖ్యాతల రంగమునకు గొనివచ్చిరి. వాని నన్నింటిని ఖండింపగలను. కాని స్థలాభావముచే నొక్కటి ఖండించి పాఠకులకు వ్యాకరణ జిజ్ఞాసువులకు వదలెద.

"కావుననే దూసి రామకృష్ణశాస్త్రిగారు" మధ్యమ పురుష క్రియలయం దిత్తునకు సంధియగు"నను సూత్రమునకు "మధ్యమ పురుషైకవచన బహువచనముల తుది యికారములకు నిత్యముగా సంధియగునని యర్థము చెప్పిరి" అని నాగళ్ళవారు నిత్యము అన్న దానినధోరేఖాంకితము గావించిచూపినారు. దూసివారి వ్రాతలు నమ్మి నాగళ్ళ వారు పాపము పేరువడ్డవారు పేరువడ్డవారయినారు ఇట నిత్యసంధియని యిర్వురును భ్రమపడిరి. ఇట్టి వట్టిలసంధికాని రూపములు చూపెద.

"ఏట్లుగనేగు దెంచితిరి యిందుకిలా ధర భృత్యులార —

బి. రామరాజుగారి సంస్కరణ. శివరాత్రి చతుర్థ. 60 వ పద్యము.

తే. "శిలమఖిలంబు నిది పిలి శిలమనుచుఁ
జదువు లివియెల్లఁ జిల్కల చదువులనుచుఁ
దోడినారలు నవ్వనాతోడ! యేల
బేల నైతివి యీ గుణంబేల? నీకు

పాండురంగ. తృతి 36 వ పద్యము.

"చూచితినేకదా నిను విశుద్ధచరిత్రుడయో! పులస్త్యుడే
లా చెడుఁ ద్రోవ పట్టితివి యాయన వంశమునంజనించియున్."

అకాడెమీ ప్రచురణ. రామాభ్యుదయము. షష్ఠ. 235.

"ఏలరా నాయన్న! యేకాపరాధంబు
సైరింపవైతి యీ శాపమునకు"

నావిళ్ళ ప్రచురణ. కాశీఖం. షష్ఠ 23 వ పద్యము.

"చేసితివి యింతట"

విష్ణుపురాణము 5. 83 వ పద్యము.

"తత్వదర్శితలేని రాధాకృష్ణమూర్తిగారు నేనాచార్యుల వారిని కించపఱచుచున్నాడనని చర్చను బక్కదారులఁ పట్టించిరి నిరాధార ప్రసంగములు చేయుట నేర్చిరి సూటిగా వారినొకేయొక్క ప్రశ్న

మడుగుచున్నాను. ఆచార్యులవారు చెప్పిన లక్షణములు సూరికిఁ దెలియునని సిద్ధాంతముచేసితిని. సాక్ష్యములు చూపితిని. అవి సబల ప్రమాణము లగునా? కావా? ఈ ప్రశ్నమునకు సోపపత్తికముగా నవుననియో కాదనియో సూటిగా సమాధానము చెప్పఁగలిగినఁగాని వారు నాతో వాదము చేయుట కర్హులుగారు.''

ఇవి నాగళ్ళవారి యాత్మశ్లాఘాపరాయణతకు ప్రబల నిదర్శనములు. ఆచార్యులవారు చెప్పిన లక్షణములు సూరికిఁ దెలియునని వీరు సిద్ధాంతముచేసినారట! ఒకసారి వీరు రమణీయమును జక్కఁగా చదువుకొన్నచో నిట్లు వ్రాసెడివారుకారు. ఏమిచేయుదు. నాగళ్ళ వారి కోరిమి తక్కువ.

"వీరు (ఆచార్యులవారు) చూపిన (1) నా యొనర్పం బూనిన (2) హయోత్తము మొక్కెడఁగట్టి బంపుచున్. (3) ఇంద్రుదున్యలెన్ (4) అబ్జాసనాండముల్ పెంపు — మున్నగు కొన్ని పయోగములలోని విశేషములను పూర్వులు నిర్దేశించినట్లు కానరాదు ఇట్టి కొలదియంశములను ప్రౌఢవ్యాకరణమున నూతనముగా భావింపవచ్చును''.

రమణీయము. 506 వ పుట.

శ్రీ దువ్వూరి వారి మాటలను నాగళ్ళవారు కాదందురా? వీరు కేవలము చిన్నయసూరి వ్యాకరణమే సమగమను భ్రమప్రమాదములో మునిగినవారు వారి నుద్ధరించువారెవ్వరు?

"మఱియు నిందు వాక్య పరిచ్ఛేదము నొకదానిని సంఘటించి నారు వ్యాకరణములందు శబ్దప్రక్రియ మాత్రమే గాక వాక్యగతములగు నర్థ సమన్వయాది విశేషములను గూడ నిరూపించుటకు ఇట్టి ప్రకరణ మొకటి యావశ్యకమను సంకల్పము మిక్కిలి సమంజసము. ఈ వ్యాకరణమున మఱియొక విశేషము కవిప్రయోగ ప్రదర్శనము. విశేష రూపములకు ప్రమాణములయిన కవి ప్రయోగములు చాల పలుకుఁ జూపఁబడినవి. అవి పాఠకుల పలువిధముల పరిశీలనమునకు సౌకర్యము నొదవింపఁగలవు. సూత్రకర్త నిర్దేశించు లక్షణమునెడ నిబ్బరమయిన విశ్వాసము గూర్పఁగలవు. సూత్రముల ప్రామాణ్యము బలపఱుపఁగలవు."

రమణీయము. 512 పుట.

ఇవి వ్యాకరణ నిష్ణాతులయిన శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారి మాటలు. మఱి నాగళ్ళ వారికీమాటలు తెలియునా? ఒకవేళ తెలిసినను నాగళ్ళవారాచార్యులవారిని మెచ్చుకొందురా?

వీరు చేసిన సిద్ధాంతమిది. "ఆచార్యులవారు చెప్పిన లక్షణములు సూరికిఁ దెలియును." వీరి సిద్ధాంతము మెచ్చదగినదే. ఎప్పుడ? సమత యున్నప్పుడు,

పోని సూరి చెప్పినవన్నియు వాని స్వంతములా? వారే గంధమునుండి వానిని గ్రహింపలేదా? ఒకసారి పరామర్శనము చేసిన తెల్లము కాగలదు. నేను చెప్పఁగలను సూరి చెప్పిన వన్నియు పూర్వ లాక్షణికులు తెల్పినవే? సాక్ష్యములు గావలెనని నాగళ్ళవారు రాద్ధాంతము సేయుచున్నారు. కావున సూరి యేయే గ్రంథముల ననుసరించి తాను వ్యాకరణము వ్రాసినాడో నిరూపించెద.

సూరి వ్యాకరణము చదువుటకుముందు సంస్కృత వ్యాకరణ జ్ఞానముగూడ నవసరము. సిద్ధాంతకౌముది కాశికావృత్తి మున్నగు సంస్కృత వ్యాకరణములనుండి యనేక విషయములను సూరి యథాతథముగా తన వ్యాకరణమున ననువదించికొని వ్రాసియున్నాడు. అది సూరికి తెలియును. కేవలము సంస్కృత గ్రంథములనుండియే కాదు తెలుగు లాక్షణికుల గ్రంథములనుండియు ననేక విషయములు గ్రహించి సూరి వ్యాకరణము వ్రాసినాడు. అది సహజము. పూర్వులు చెప్పిన దానికి కొంత మెరుగుపెట్టుట—కొంత సూత్రబద్ధము చేయుట సూరి చేసిన పనులు.

ఇక సూరి లక్షణ గ్రంథములనుండి గ్రహించిన విషయములలో కొన్ని చూపెద.

1. దూతాదులకు స్త్రీత్వంబు బహుళంబుగానగు
   దూత—దూతుడు. బాల. తత్సమ. 61 సూ.

   దూతపదము స్త్రీ లింగము
   రీతిం బుంలింగమట్లు గృతుల దనర్చున్
   దూతయన దూతుడనగా
   భూతేశ! మహేశ! నిఖిల భువనాధీశా!
   అకాడెమీ ప్రచురణ. లక్షణసార సంగ్రహము. ప్రథ.24

2. విధాతృ ధాతృ దాతృ సవితృ నేతృ శబ్దంబులకు మహత్తులకత్వ స్త్రీవద్భావంబులు విభాషనగు.
   తత్స 53. సూ

   సవిత సవిత్రుఁడనగఁ జను విధాతవిధాత్రుఁ
   డనఁగఁ జను లక్షణసార సంగ్రహము ప్రథ. 15

3. పృథ్వీ వాచి భూశబ్దంబునకు భువియగు.
   తత్స. 62 సూ

   ద్యువాచ్యుశబ్దంబులకు దివిద్యుదియగు.
   తత్స. 84 సూ.

   భువి—భువులు; దివి—దివులు.
   అలరఁగ భూదివ్ శబ్దం
   బులుభు విదివి యనఁగఁ బడగు—
   లక్షణసార సంగ్రహము. 19

4. పద్యాదులు పరంబులగునపుడు మువర్ణకంబునకు లోప
పూర్ణబిందువులు విభాషనగు. సంధి. 46 సూ

పడియెనన్ పదంబు పరమునగల ప్రథ
మాంత శబ్దములకు నగు ముకార
మదఁగుఁ బూర్ణబిందువగు భయపడి భయం'
పడి యనంగఁ గృతుల ఫాలనేత్ర.

లక్ష్మణసార సంగ్రహము ప్రథ 163.

5. కర్మధారయంబుఁ ందుత్తున కచ్చుపరంబగునపుడు
టుగాగమంబగు. సంధి. 28.

తగ నుకారాంతముల కర్మధారయమున
షష్ఠి యగుచోటఁ జైనన్ను సంఘటిల్లె
నేని సంధులయెడఁ డనల్లిలుచు గొన్ని
యెడలఁ గుఱఁగకయుండు మహీశతాంగ.

లక్షణసార సంగ్రహము. ప్రథ. 169.

6. ద్రుత ప్రకృతికముమీది పరుషములకు సరళములగు
సంధి. 16 సూ.

నాంతములపై సక్తమగు పదముల
కచట తపలైదు నగుచుండు గజడదబలు.

లక్షణసార సంగ్రహము ప్రథ. 199.

నాంతంబైన పదంబుల
పొంతంబైయున్న శబ్దముల కచట తపల్
దొంతి గజడ దబలగున
య్యంత నకారమగు పున్నయభినవ దండీ.

ఆంధ్రభాషాభూషణము. 54

7. ప్రథమమీది పరుషములకు గసడ దవలగు. సంధి—13.

అమరఁ గృతులందుఁ బ్రథమాం
తము పయిన్ నిలుమన్ కచటతపలకు నాదే
శముగ గసడ దవలగున్

సర్వలక్షణసార సంగ్రహము. ప్రథ. 215.

8. ఆచ్ఛికంబు లంబద మధ్యంబులనలడరల యుత్వంబు
నకు లోపంబు బహుళంబుగానగు.

ప్రకీర్ణకము. 17 సూ.

కినుక—కిన్క. చిలుక—చిల్క.
మలుడు లనడు మంగలపద
ములయుత్వములు డుగుఁగావ్యములఁ జిల్కయనం
జిలు లుకయనఁ గిన్కఁ గినుకన
నలి గాడ్పనగాడుపనగినం దితురంగా!

లక్షణసార ప్రథ. 265.

తెలుగులలో నప్పంబులు
డులురులనులు పదము తుది నడుమ గల్గినవి
మ్ములు దానిమీది యుత్వము
పొలుపుగ హల్లుండెనేని పోవున్ నిలుచున్

ఆంధ్రభాషాభూషణము 64.

సూరి లక్షణమును గ్రహించుటయేగాక చిలుక—చిల్క, కినుక—కిన్క అను లక్ష్యములనుగూడ గ్రహించినాడు.

9. దక్కులోపగువాని దా కుడకారంబు విభాషనగు.

ప్రకీర్ణక. 14.

దక్కె డక్కెనగ దబ్బరడబ్బర
దాసి డాసి యనగ దప్పిడప్పి
దాగి డాగి యనగ దావలడావల
దొప్ప డొప్పయనగ నొప్పునభవ

సర్వలక్షణ. ద్వితీ. 384.

10. స్త్రీ సమంబులగు విశేషణంబులయు మువర్ణకాంత
విశేషణంబులయు బహువచనంబున కేకవచనంబు బహు
ళంబుగానగు. కారక. 20 సూ.

ఉదా. కులిశ ధారల్కుంఠితంబయ్యె,
కులిశ ధారల్కుంఠితంబులయ్యె,

బడపద బహువచనములకు
నిడదగును విశేషణములనేక వచనముల్.

కవిసంశయ విచ్ఛేదము ప్రథమత. 107.

తెలుగున ప్రాణిపదంబులు
వెలిగా బహువచనమునకు విస్పష్టముగా
నిలుచు నువిశేషణంబై
పొలు పొందగనే కవచనము మభద్రాంసీ

లక్షణసార. ద్వితీ. 48.

౦దుదహరించిన పద్యము.

> "సురపతిసభ జూడంజూడనంగా రవ్యష్ఫ్లో
> గురిసెఁగువిశదధారల్కుంఠితంబయ్యె.
>
> ఆదిపర్వము. 2-82

ఈ లక్ష్యమునే సూరి గ్రహించినాడు.

11. కలన్వాదులను వర్ణంబుకుజగు; బహువచనము పరంబగు నపుడు నిత్యముగానగు. ఆచ్చికము. 18 సూ.

> కొలను నెలను నాగఁ గొలను నా మానవఁ
> గలను గవకు కెలను వలనునాగఁ
> బరఁగు శబ్దములకు బహువచనంబులు
> నలకుఁ కులు విధించెనూత్నదండి.
>
> ఆంధ్ర భాషా భూషణము. 73.

12 ద్విరుక్తంబగు హల్లుపరంబగునపు డాచ్చికంబగు దీర్ఘంబు నకు హ్రస్వంబగు. సమాస. 13.

> త్రికంబుమీది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు. బాహుళకముచే నూష్మరేఫంబులకు ద్విత్వంబు గలుగదు. సమాస. 14.

> ముదమున నాయూ యేలను
> పదముల తుదనూష్మలుడుగఁ బైవర్ణముతో
> నదుకునెడఁ గుదియు సాగును
> గుదియు నెడన్ జడ్డ్రా లగున్ బైహల్లుల్
>
> ఆంధ్రభాషాభూషణము. 136.

13. తిర్యగ్జడంబులు వాచ్యంబులగునపుడు లిఙ్గాట్ముల ప్రథమ బహువచనంబున నేకవచనంబగు. క్రియ. 25 సూ.

> స్థావర తిర్యక్ ప్రతతుల
> కేవెరవు న్నగియులుపొందు నేకవచనముల్.
>
> ఆంధ్రభాషాభూష. 147.

14. పేదాది శబ్దంబుల కాలుశబ్దము పరంబగునపుడు కర్మధారయంబునందు రుగాగమంబగు. సంధి. 30 సూ.

> అలికిరాలగు దిగువగు
> బా లినిలిపి పలకుచోట ననువగునెడ గొ
> డ్రాలు జవరాలు పాతకు
> రాలు గెడపు రాలు ముద్దరాలనఁ జనుటన్.
>
> ఆంధ్రభాషాభూష. 168

15. అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాషనగు. ఆచ్చిక. 27 సూ.

> అచ్చ తెలుగుమాట ననువైనచో వకా
> రము గకార రూపమమరదోచుఁ
> దీవె తీగెయనఁగఁ జేవచేగయనంగఁ
> బవలు పగలు నాఁగఁబరఁగుఁగాన
>
> ఆంధ్రభాషా భూష. 169.

ఇట్లు సూరి యాంధ్ర లక్షణ గ్రంథముల ననుసరించిన పట్టములు కొన్నియె చూపితి. అటనట సూరి లక్షణముతోపాటు లక్ష్యములుగూడ గ్రహించుట విశేషము. వైయాకరణుల కీరతారములు లేమి మంచినెట యున్నను గ్రహింతురు. గ్రహించుట యాచారము.

సూరి కేవలము నాంధ్రలక్షణ గ్రంథముల ననుసరించుటయే కాదు సంస్కృత వ్యాకరణముల స్సైతము ననుకరించిన పట్టులు కోకొల్లలు.

1. పృథగ్భూతంబులగు నర్థంబుల కేకార్థీభావంబు సామర్థ్యము, ప్రథక్ ప్రసిద్ధార్థంబులగు పదంబుల కేకార్థంబునందు వృత్తి సామర్థ్యము. సమాసము. 1

పృథగర్థానాం ఏకార్థీభావః సమర్థ వచనమ్. వార్తికమ్.
పృథగర్థానాం పదానాం ఏకార్థీభావః సమర్థమిత్యుచ్యతే భాష్యము.

2. కర్మంబున ద్వితీయయగు. కారకము. 2
కర్మణి ద్వితీయా 2-3-2. సి. కే.

3. గతి బుద్ధి ప్రత్యవసానార్థ శబ్ద కర్మాకర్మకంబులన్ ప్రేరణంబునం గర్తయగునది ప్రేరణంబునంగర్మంబగు క్రియ. 123 సూ.

> గతి బుద్ధి ప్రత్యవసానార్థ శబ్దకర్మకాకర్మ కాణామణి కర్తాసణీ. 1-4-52. సి. కే.

4. క్రియాసిద్ధిం బ్రకృష్టోప కారకంబు కరణంబు
కారకము - 4 సూ - క్రియాసిద్ధే ప్రకృష్టోప కారకం కారకం కరణ సంజ్ఞంస్యాత్ సి. కే. 560 సూ.

5. ఉపయోగంబునందాఖ్యాతకుండోడ వర్ణకంబగు
నియమ పూర్వక విద్యాస్వీకారంబుపయోగంబనంబడు
కారకము 7 సూ.

ఆఖ్యాతోపయోగే – 1–4–29
నియమపూర్వక విద్యా స్వీకారే వక్తా ప్రాక్ సంజ్ఞః స్యాత్
సి. కే. 592 సూ.

6. సంప్రదానంబునకుంజతుర్థియగు. కారకము. 8

చతుర్థీ సంప్రదానే, సి. కే. 2-3-13.

7. అపాయభయ జుగుప్సాపరాజయ ప్రమాద గ్రహణ భవన త్రాణ విరామాంతర్ధి వారణంబు లెద్దాన నగు దానికి పలన వర్ణకంబగు. కారకము. 9 సూ.

యతోఽపాయ భీజుగుప్సాపరా జయ ప్రమాదాదాన
భూత్రాణ విరామాన్తర్ధి వారణమ్. ముగ్ధ.కార.299

8. ఎచ్చట నిర్ధార్యమాణంబు జాత్యాదులచే భేదంబె కలిగి యుండు నచటంబంచమియగు. కారకము. 12
నిర్ధార్యమాణస్యయత్ర భేద ఏవత త్ర పఞ్చమీస్యాత్.
సి. కే. 639 సూ.

9. జాతిగుణ క్రియా సంజ్ఞలచేత సముదాయంబునుండి యేకదేశంబునకుఁ బృథక్కరణంబు నిర్ధారణమనందగు.
కారక–16.

జాతిగుణ క్రియా సంజ్ఞాభిః సముదాయాదేకదేశస్య
పృథక్కరణం నిర్ధారణమ్. సిద్ధా. 638 సూ.

10. అధికరణంబునకు సప్తమియగు
అధికరణంబునా నాధారంబు. కారకము. 17 సూ.
మోక్షమందిచ్ఛగలదు.
సప్తమ్యధి కరణేచ. 2-3-36
మోక్షే ఇచ్ఛా అస్తి.
ఆధారోఽధి కరణమ్. 1-4-45.

11. మనుష్యుల లోపల క్షత్రియుండు శూరుండు.
అధ్వగులలోపలం బాఱువాడు శీఘ్రగామి. కారక 16.
ఈరెండు నుదాహరణములు
మనుష్యాణాంక్షత్రియః శూరతమః
అధ్వగానాం ధావన్తః శీఘ్రతమాః కాశికావృత్తి

12. ధాతువునకు. ఇదియధికార సూత్రంబు. ఇంక నెయ్యది

ఆంధ్రగ్రంథమాల ప్రచురణలు

పండితారాధ్య చరిత్ర

డాక్టరు తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారువ్రాసిన పీఠికతో అమ్మకానికి సిద్ధంగాఉంది. వెల రు. 15-00
(పోస్టేజి అదనం)

బసవ పురాణము

బైండుచేసిన రంగుల అట్టతో, కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావుగారి 'ప్రస్తావన'తో కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావుగారి విపుల పీఠికతో అమ్మకానికి సిద్ధంగా ఉంది. వెల : రు. 7-50
(పోస్టేజి అదనం)

భగవద్గీత

కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు వ్రాసిన వ్యాఖ్యానముతో బైండు చేసి అమ్మకమునకు సిద్ధముగా నున్నది. వెల : రు 7-50

ఆంధ్రపత్రిక ఏజెంట్లద్వారా కూడా తెప్పించుకోవచ్చు. (పోస్టేజి అదనం)

ప్రతులకు

మేనేజరు

ఆంధ్రపత్రిక, గాంధీనగర్, విజయవాడ-3

యుష్మత్కమింపంబడు నయ్యాది ధాతువున కగుననియె అుంగునది. క్రియా. 1 సూ.

ధాతోః అధికారోఽయమ్ ఇత ఊర్ధ్వంయత్ అనుక్రమిష్యామః తత్ ధాతోరితి వేది తవ్యమ్. కాశికావృత్తి.

ఇంతియేగాదు పారిభాషిక పద నిర్వచన సందర్భమున సూరి సంస్కృత పారిభాషిక పదముల యథాతథ మనుసరించెను. ఇది వైయాకరణులందరెఱింగినదే. సూరికివి తెలియవనియా వానిని గ్రహించుట ? ఇది వ్యాకరణ వేత్తల లక్షణము.

1. ఉపధ యనగాఁ దుదివర్ణముసకు మూందువర్ణము. సంజ్ఞా 10. అలోన్త్యాత్ పూర్వ ఉపధా.
2. ధాత్వర్థ వ్యాపారాశయంబు కర్తనాబడు. కారక. 3 ధాత్వర్థ వ్యాపారాశ్రయత్వం కర్తృత్వమ్.
3. నియతో పస్థితికము ప్రాతిపదికార్థము. కార. 1. నియతో పస్థితికః ప్రాతిపదికార్థః
4. వర్తమానంబునాఁ బ్రారబ్ధా పరిసమాప్తంబు. క్రియ. 2. ప్రారబ్ధా పరిసమాప్తం త్వవర్తమానత్వమ్.
5. భూతంబు నావిద్య మానధ్వంస ప్రతియోగి. క్రియ. 3. భూతత్వంచ విద్యమానధ్వంస ప్రతియోగిత్వమ్—
6. భావినా విద్య మాన ప్రాగ భావప్రతియోగి. క్రియ.4. భావితత్వంతు విద్యమాన ప్రాగభావ ప్రతియోగిత్వమ్.

వ్యాకరణ రచన మసిధారా వ్రతము వంటిది. దానికనేక కావ్యావలోడన మవసరము. అనేక వ్యాకర్తలు చెప్పిన విషయముల నామూలము గ్రహింపవలెను. తొలి వ్యాకర్తకే యీ శ్రమ మిక్కుటము. తక్కినవారి కతడు దారిమాపును గాన కొంచెము వ్యాకరణ రచనము లఘువనిపించును. ఇట్టిదే సూరి విషయము గూడ. తెలుగు బాసకు వ్యాకరణము వ్రాయుటయేయైనను సంస్కృతాంధ్రముల తనకు పూర్వమునగల వ్యాకరణ గ్రంథముల పర్యాలోకనముచేసి బాలవ్యాకరణము వ్రాసినాడు. సూరి తన వ్యాకరణమున చెప్పినవన్నియు పూర్వ వ్యాకరణములగల విషయములే. సూరికి ముందుగల ఆంధ్రశబ్ద చింతామణి—ఆథర్వణకారికావళి మున్నగు గ్రంథముల వించుమించు పూర్తిగా ననుకరించినవాడన మచ్చునకుఁ గొన్ని చూపెద.

1. లఘునోఽ లఘువశ్చేతి ద్విధాం తస్మాన్ పఠన్తి శాస్త్రే రః చింతామణి.

యరలవలు లఘువుల నిలఘువులని ద్వివిధంబులగు. సంజ్ఞా. 18 సూ.

2. నవికృతి శబ్దాత్ పరతః సాంస్కృతికానాం భవన్తి గసడదవాః చింతా.

తెనుగులమీది సాంస్కృతిక పరుషములకు గసడదవలు రావు. సంధి—14.

3. పరుషాణాం గసడదవాః స్యుః పదాత్ ద్వన్ద్వే. చింతా. ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవలగు సంధి. 15.
4. సామానాధికరణ్యేషూ దన్తానాం టుగాగమో ఽచిస్యాత్. చింతా. కర్మధారయంబులం దుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమంబగు. సంధి. 28.
5. క్త్వార్థే తోనభవేత్ సదా. అథర్వణకారిక. క్త్వార్థంబైన యిత్తునకు సంధిలేదు. సంధి. 8.
6. మానార్థాన్నిత్యమేకత్వ మెదుస్యాత్ పరిమాణనే. అథర్వణ మానార్థంబును కేకత్వంబు నందెడు వర్ణకంబగు. తద్ధి. 25.
7. సమశ్శబ్ద విసర్గస్యలోప ఓత్వమపీష్యతే. అథర్వణము. అను కృతిని సమశ్శబ్దము తుది యత్తున కోత్వము విభాషనగు. సంధి 51.

ఇంకను నెన్నియో చూపవచ్చును. కాని వ్యాకరణము చదివిన ప్రతివారికిబాలవ్యాకరణములోని విషయములన్నియు పూర్వవ్యాకరణముల లోనివేయని తెలియక మానదు.

ఆచార్యులవారు చెప్పినవన్నియు సూరికి తెలియును. సూరి చెప్పినవన్నియు ప్రాచీన లాక్షణికులు చెప్పినవే. అకటా! నాగళ్ళవారి వలన సూరి యెంత యప్రతిష్ఠపాలగుచున్నాడో విద్వల్లోకము గ్రహింపగాత.

సూరి—ఆచార్యులు ఇరువురును వ్యాకరణవేత్తలే—మహానుభావులే. అనేక వత్సరములు శిష్యులకు పాఠములు ప్రవచించినవారు. వారు నమస్కారార్హులు. అట్టివారిని బయటికి లాగుచున్నారు నాగళ్ళవారు. అది మంచిదికాదు. వ్యాకరణ మొక్కరి వలననే సమగ్రము గాదు.

ఇప్పట్టున భర్తృహరి శ్లోకము పేర్కొందును:

"అజ్ఞః సుఖమారాధ్యః
సుఖతరమారాధ్యతే విశేషజ్ఞః
జ్ఞాన లవ దుర్విదగ్ధం
బ్రహ్మాఽపినరం న రంజయతి."

(ఇంతటితో "భారతి"లో ఈ చర్చను నిలిపివేస్తున్నాము — సంపాదకుడు.)

ఎంతెంత దూరం...
చాలా చాలా దూరం

ఎంతెంత దూరం...చాలా చాలా దూరం. తప్పు ... యిప్పుడు మన లక్ష్యాలన్నీ చాలాదగ్గరకు వస్తున్నాయి. దూరాన్నిచూసి అమ్మో అని గుండె బాదుకొనే రోజులు పోయాయి. దూరాన్ని కాలంతో నిక్కచ్చిగా కొలిచి లక్ష్యాలను సాధించుకొనే రోజులు వచ్చాయి.

వ్యాపారం చెయ్యాలన్నా, వ్యవహారాలు చక్కబెట్టుకోవాలన్నా సృజనాత్మకశక్తి ఉత్పత్తి పెరిగితే చాలదు.

రవాణా, వార్తా సౌకర్యాలు అడుగడుగునా అవసరమౌతాయి. ఈ రంగానికి ప్రస్తుత సంవత్సరంలో రూ. 19.98 కోట్లు కేటాయించారు. గత యేడాది కేటాయించిన మొత్తం కంటే యిది సుమారు రెట్టింపు.

అల్లాగే రోడ్డు-రవాణా సంస్థను మరింత పటిష్టం చేసేందుకు యీ యేడాది రూ. 12.21 కోట్లు ఖర్చుచేస్తున్నారు. క్రిందటేడు కన్నా యీ సంస్థకు రూ. 5.56 కోట్లు అధికంగా కేటాయించారు.

కేవలం అంకెల్లో ఖర్చు మొత్తాలను అధికం చేయడంతో సరిపెట్టకుండా మారుమూల ప్రాంతాలకు కూడా రవాణా సౌకర్యాలను విస్తరిస్తున్నారు.

''రోడ్ల నిర్మాణం, మెరుగుదల'' కోసం కేటాయించిన రూ. 4 కోట్ల నుండి రూ. 50 లక్షలు ఏ రహదారి సౌలభ్యానికి నోచుకోని గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకించారు.

అదే విధంగా మత్స్య పారిశ్రామికుల వాడలను కలిపే రోడ్లు వేయడానికి రూ. 15 లక్షలు ప్రత్యేకించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రవాణా సౌకర్యాల అభివృద్ధికి శాయశక్తులా ప్రయత్నిస్తోంది.

సమాచార, పౌర సంబంధశాఖ, హైదరాబాదు.

3/76

తెలుగు కావ్యమాల*

[శ్రీ బులుసు వేంకటరమణయ్య

'కావ్యమాల' అనే పేరు చెవిని పడగానే నాకు ఈ శతాబ్ది పారంభంలో బొంబాయిలోని సుప్రసిద్ధ సంస్కృత గ్రంధ ప్రకాశకులు నిర్ణయసాగర ముద్రాక్షరశాలవారు ప్రచురించిన కావ్యమాలా సంపుటాలు స్ఫురణకు వచ్చాయి. ఆ సంపుటాలు ప్రాచీన కవులు రచించిన అముద్రితాలైన పెక్కు లఘుకృతులను ప్రకటించి, సంస్కృత భాషా వాఙ్మయాభిమానులకు ఎంతో ఉపకారం చేశాయి. అట్టి సంపుటాలు ఇంతవరకూ తెలుగులో వచ్చినట్లు తెలియదు ఇప్పుడు ఈ 'తెలుగు కావ్యమాల' ఆ లోపాన్ని తీరుస్తున్నది.

వివిధ కవుల కవితా వైవిధ్యాన్ని వైశిష్ట్యాన్ని గ్రహించి. వారి కవితామాధుర్యాన్ని ఆస్వాదించడానికి సంక్షేపరూపములైన కావ్యాలు ఎంతో ఉపకరిస్తున్నవి. సంస్కృత కావ్యమాలల్లో కాలాన్ని బట్టి కాక ఉపలబ్ధాలైన లఘుకృతుల పరిమాణాన్నిబట్టి సంపుటాలు వెలువడినవి. ఈ 'తెలుగు కావ్యమాల'లో కాలానుసారంగా కవుల యెన్నిక జరిగింది. అందులోనూ ఆయా కవుల గ్రంధాలలోని రసవద్ఘట్టాలు కొన్ని స్వీకరించబడినవి. 356 పుటల్లో అష్టోత్తర శత కవుల కవితలు నూట ఎనభైకి పైగా ఇందులో చేర్చబడ్డాయి. ఇందరు కవుల రచనలను సంపాదించడం, అందులోని రసవంతమైన ఘట్టాలను ఎన్నుకొని చదవడం ప్రత్యేక వ్యక్తికి సాధ్యంకాదు. అట్టి సౌకర్యాన్ని సులభ పద్ధతిలో కలిగించి నన్నయ నాటినుండి నేటికాలం వరకూ వున్న కవితా రీతులను ప్రదర్శించే యీ సంకలనాన్ని వెలువరించిన సాహిత్య అకాడెమీవారిని అభినందించవలసి ఉన్నది.

ఏ గ్రంధాన్నయినా సంపాదించి, పరిష్కరించడం కొంత సులభం కావచ్చు. సంకలనం చెయ్యడం కష్టం. దానికి విచక్షణ జ్ఞానం. నిష్పక్షపాతబుద్ధి, పరిశీలన సామర్థ్యం, అవసరం. శ్రీ వేంకటేశ్వరరావుగారు ఇట్టి కార్యం నిర్వహించడానికి సర్వవిధాలా సమర్థులు. ఆయన సంస్కృతాంధ్రాంగ్ల భాషల్లో గట్టి విద్వాంసులు. ఈ శతాబ్దిలో మహాకవి బిరుదం లేకుండానే మహాకవులయి, కవులలో అగ్రశ్రేణికి చెందినవారు. తనవంటివారినేకాక, ఎంతో తక్కువ శ్రేణిలో ఉన్నవారిని కూడా ఎంతో గౌరవంతో చూచే విశాల హృదయులు. ప్రాచ్య, నవ్య కవిత్వాల తత్త్వాన్ని బాగుగా అవగాహన చేసుకుని, అన్నిరకాల కవితలనూ ఆదరించే రసజ్ఞులు. అట్టివారు కూర్చిన ఈ సంకలనం ఉత్తమంగా ఉండుటలో ఆశ్చర్యం లేదు.

శ్రీ వేంకటేశ్వరరావుగారు బాగుగా పర్యాలోచనచేసి, ఈ కావ్యమాలను మూడు పేటలుగా గ్రుచ్చారు. మొదటి పేట క్రీ. శ. 11వ శతాబ్దం మొదలుకొని 15వ పతాబ్ది చివరిదాకా ఉండే కాలంలో వెలువడిన కవిత్వ వాఙ్మయానికి చెందినది. రెండవపేట 150 మొదలుకొని 850 వరకూ వుండే మూడువందల ఏభయి యేళ్ల కవిత్వానికి చెందినది. చివరిది ఆ తర్వాత నూరేండ్లకు పైగా 1955 వరకూ వెలువడిన కవిత్వ కళకు చెందినది.

తొలివిభాగంలోని కవిత ప్రధానంగా పురాణేతిహాసాలకు సంబంధించినది. నన్నయ మొదలుకొని వేమన వరకూ వున్న కవు లిందులో స్వీకరించబడి ఉన్నారు. తిక్కన సోమయాజి నిర్వచనోత్తర రామాయణం తప్ప తక్కినవన్నీ చంపూపద్ధతిలో గద్య, పద్యాత్మకంగా రచింపబడినట్లు ఇందులోని 'నివేదనం'లో చెప్పబడింది. నన్నెచోడుని కుమారసంభవం తప్ప తక్కినవి సంస్కృత మూలానికి అనుసరణాలనీ, పాల్కురికి సోమనాథుడు ఇతివృత్తంలోనూ, ఛందస్సులోనూ దేశీయతనే స్వీకరించాడనీ, పాల్కురికి సోమన కావ్యాలూ, పోతన భాగవతం భక్త్యావేశంతో రచించబడినవనీ, నాచన సోమన, శ్రీనాథుల కవితల్లో కథావస్తువుకంటె కవితా శిల్పమే ప్రధానంగా కానవస్తుందనీ సంకలనకర్త సముచితంగానే తెలియజేశారు. తాళ్లపాకవారి సంకీర్తనాలూ, వేంకటేశ్వర విన్నపములు (వవవం) ఇందులో చేర్చబడినవి. వేమన 15వ శతాబ్దివాడని కొందరు, 16వ శతాబ్దివాడని కొందరు, 17వ శతాబ్దివాడని కొందరును అభిప్రాయపడుతున్నారు. శ్రీ వేంక

---

* తెలుగు కావ్యమాల : సంకలనము : శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు, డెమ్మీ ఆక్టావో 382 పుటలు. ప్రథమ ముద్రణము. 1959. ద్వితీయ ముద్రణము 1976. వెల. రు 12-50. సాహిత్య అకాడెమి ప్రచురణ-ప్రతులు దొరకుచోటు-(1) సాహిత్య అకాడెమి, రవీంద్రభవన్, న్యూఢిల్లీ-1. (2) మదరాసు-6, (3) కలకత్తా-29, బొంబాయి-14.

శేశ్వరరావుగారితనిని తొలిపేటలోనే చేర్చినారు. తొలిభాగంలో శ్రీనాథ మహాకవి రచనలే ఎక్కువ స్థలాన్ని ఆక్రమించుకున్నవి.

పదహారవ శతాబ్దంలో సర్వలక్షణ సంపన్నమైన స్వతంత్ర కావ్య రచన ప్రబంధనామంతో ప్రారంభమయినదనీ, కథాకథనం కంటె రసపుష్టియే ముఖ్యంగా గ్రహించబడినదనీ, తొలుత సాహితీ సమరాంగణ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలూ, తర్వాత తంజావూరు పాలకులూ ఇట్టి రచనకు ప్రోత్సాహ మిచ్చారనీ, నాయకరాజుల కాలంలో యక్షగానాలు, శృంగారకావ్యాలు, శృంగారపదాలు వాఙ్మయంలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించాయనీ చెప్పబడింది. ప్రభువుల ఆస్థానంలోని నాట్యకత్తెలయిన కవయిత్రుల ప్రబంధాలనుంచి కూడా చక్కని పద్యాలు ఉదాహరించబడినవి. క్షేత్రయ్య, త్యాగయ్యల గేయ కవితలున్నూ ఈయబడినవి. సంకలకర్త శతక వాఙ్మయాన్ని విస్మరించలేదు. శతక కర్తలలో ప్రఖ్యాతి వహించిన కాసుల—పురుషోత్తమ కవి ఆంధ్రనాయక శతకంనుంచీ, గోగులపాటి కూర్మనాథకవి సింహాద్రి నారసింహ శతకంనుంచీ, అడిదం సూరకవి రామలింగేశ శతకంనుంచీ చక్కని పద్యాలు ఏరి కూర్చడం సముచితంగా ఉన్నది.

పూర్వకవుల గ్రంథాలనుండి ఉదాహరణములను గ్రహించేటప్పుడు కొత్తపద్ధతి అవలంబింపబడింది. సాధారణంగా ఆ యా గ్రంథాలనుండి భాగాలను ఎన్నుకోవేటప్పుడు నన్నయ భారత భాగంలోని శకుంతలోపాఖ్యాన, నలోపాఖ్యానాలను, తిక్కన ఉద్యోగపర్వ భాగాలను, శ్రీనాథుని నైషధంలోని హంసదూత్యాన్నీ—ఈ విధంగా ఉదహరించడం పరిపాటి. ఇంచుమించుగా అందరి ఎన్నికలలోనూ ఇవే కనబడతవి. శ్రీ కాటూరివారు అట్టివానిని పరిహరించి, రసవంతాలైన ఇతర ఘట్టాలను స్వీకరించారు. అందువల్ల ఈ సంకలనానికొక క్రొత్తదనం ఏర్పడింది. కాలక్రమ పద్ధతి ననుసరించి ఈ కావ్య భాగాలను గ్రహించుటవల్ల కాలానుసారంగా కవితలో ఏట్టి పరిణామాలు వస్తున్నదీ పాఠకులకు స్పష్టంగా తెలుస్తుంది.

మూడవ భాగంలో కవులను ఎన్నుకోడం చాలా కష్టం. వెనుకటి భాగాలలో మహాకవులను విడిచిపెట్టినా చిక్కులేదు. కాని, యీ భాగంలో అప్రసిద్ధులను విడిచిపెట్టినా వారు సంకలనకర్తపై ధ్వజం ఎత్తవచ్చు. శ్రీ కాటూరివారు బాగుగా నిదానించి పేరున్న వారినే కాకుండా అప్రసిద్ధులనుకూడా ఇందులో చేర్చారు. ప్రబంధ కవులు, భావకవులు, గేయకవులు, అభ్యుదయ కవులు—అందరూ ఇందులో చేరారు.

'వేయేండ్లనుండి ఇప్పటికప్పుడు నవనవంగా వర్ధిల్లుతున్న ఆంధ్ర సాహిత్యమందలి కావ్యభేదాలను, రీతులను ఇందు ప్రదర్శించుటకు యత్నించితిని. ఆంధ్రసాహిత్యంలో కేవలం మేలేర్చి కూర్చే యత్నం కాకపోవడంవల్ల ఆంధ్రరసజ్ఞ లోకానికి పరమాదర పాత్రములైన కొన్ని కొన్ని రచనల నిందు చేర్చకపోతిని. రుచిభేదంవల్ల పరిశీలనా లోపంవల్ల, స్థలసంకోచంవల్ల కూడా ఈ కూర్పు కొంత అసమగ్రతకు పాల్పడి ఉంటుంది'' అని సంకలనకర్త తమ నివేదనంలో సహజ వినయధోరణిలో వ్రాసుకున్నారు. ఇట్టి సంకలన గ్రంథాలకు సమగ్రత ఉండడం సాధ్యం కాకపోవచ్చు. కాని ప్రాచీనులలో రంగనాథ రామాయణకర్తనూ, ఈ శతాబ్దికి చెందినవారిలో శ్రీ వేటూరి—ప్రభాకరశాస్త్రి, మంగిపూడి వెంకటశర్మ, చిలకమర్తి—లక్ష్మీనరసింహం, భోగరాజు — నారాయణమూర్తి, పెమ్మరాజు — లక్ష్మీపతి మున్నగు వారిని చేర్చకపోవడం లోటుగానే కానవస్తున్నది.

ఇంకా మరికొన్ని లోపాలు తగిన శ్రద్ధ చూపనందుననో ఏమో కొన్ని కానవస్తున్నవి.

144వ పుటలో గార్హస్థ్య వైభవాన్ని వర్ణించే పద్యం ప్రారంభంలో

''పరిణత యగునింతి ప్రతికూల కాదేని
తనయుండు తన యాజ్ఞ దాటఁడేని,''

అని ఉన్నది. ఇక్కడ

''పరిణీత యగునింతి ప్రతికూల కాదేని''

అని ఉండవలసి ఉన్నది. 'పరిణీతయగు నింతి' అంటే భార్య. ఆమెయే ఇక్కడ ఉద్దేశింపబడినది. 'పరిణత' అంటే ఆ అర్థంరాదు.

146వ పుటలో మొదటిపద్యం

'పూవుఁదేనియఁ దడిసిన మావి చిగురు
మీఁదనంటి చరించు తుమ్మెద దలిర్చు
సమయమౌటయు మసి నెయ్యి సమరి మరుఁడు
త్రుప్పుతోఁదోము నీలంపుఁ దునుక యనఁగ'

ఇక్కడ 'సమయమౌటయు' పిదప ఉండవలసినది 'అసి' కాని మసి కాదు. మసికి ఇక్కడ ప్రసక్తేలేదు.

176—వ పుటలోని ఎత్తు గీతిలో

'నిబిడ పాశ్చాత్య భీతులై నిఖిల జనులు
కలసి మొఱవెట్ట నీ కెట్లు నిదురపట్టె?'

అని ఉన్నది. ఈ రెండవ చరణంలో యతి తప్పింది. ఇక్కడ 'కదిసి మొలవెట్టి' అని ఉండవలెను.

ఇవి ముద్రణ స్ఖాలిత్యాలని చెప్పడం సముచితం కాదని తోస్తుంది. తొలి ముద్రణలో ఎలా ఉన్నదో తెలియదు కాని మలి ముద్రణలో ఇట్టివానిని ఉపేక్షించడం సరికాదు.

పదిహేనేళ్ల క్రిందట తొలిముద్రణ జరిగింది. ఆ తర్వాత ఈ పదిహేనేళ్లలోనూ కొందరు మంచి కవులు సాహిత్యరంగంమీదికి వచ్చారు. కాట్రూరివారే జీవించి ఉంటే మూడవ భాగంలో మరి కొందరిని చేర్చి ఉందురు. ఈ రెండవ ముద్రణకు బాధ్యత వహించిన వారు అనుబంధంలోనైనా కొందరిని చేర్చి ఉండవలసింది.

ఈ కావ్యమాల చివర కవులను గురించిన వివరాలు సంగ్రహించబడినవి. కావ్యసూచిక కూడా ఇవ్వబడింది.

ఇది సాహిత్యాభిమానుల ఆదరాభిమానాలు సంపాదించగలిగింది. పునర్ముద్రణ భాగ్యాన్ని పొందడమే దీని విలువను వ్యక్తం చేస్తున్నది.

కాంతి రేఖ

శ్రీ కె. శివారెడ్డి

శబ్ద సముద్రం మధ్య మునిగిన నాకు
ఏకాంత పునరావాసం కావాలి
నన్ను నేను దర్శించుకుంటానికి
నన్ను నేను ఆవిష్కరించుకుంటానికి —

కాంతి పాదాల సవ్వడులు నిండిన శబ్దమే
నాలోనూ కదులుతోంది
గాలినిండా జీవన శ్రుతుల్ని నింపిన
కాంతి కరాంగుళుల అలవోక కదలికలే
నాలోనూ చిత్రాలు గీస్తాయి
నా నేత్రాల్నిండా రోడ్లు వేస్తాయి .
నా రక్తం నిండా జనాన్ని ప్రవహింపచేస్తాయి.

ఒక ఏకాంత లిప్త
ఒక ఏకాంత నిశ్శబ్దం కంటి వెలుగు కావాలి

ఆకాశంతో చెట్లు చేసే భాషణ
మట్టితో మనిషి చేసే సంభాషణ వింటానికి —

అవును
నేను నా గుండె లయ వింటాను
గుండెనిండా ఒదిగిన ప్రపంచ జన ఘోష నింటాను
రోడ్డవతల చేయెత్తి పిలిచేవాడి కంఠస్వరం
ఇక్కడ నా నది ఒడ్డున కూర్చుని వింటాను.

శబ్ద సముద్రం మధ్య
ఏకాంత ధ్యాన ముద్ర.

నివిమాలితాక్షుల కొసలమీంచి జారే
శబ్దాల కాంతి రేఖలు - వల్లెల్లో
మేలుకొలుపుల పొద్దుపొడుపులు.

అతడు చచ్చిపోయాడు

శ్రీ చివుకుల సీతారామ్ బాబు

తల తిప్పి చూశాడు అతడు.

దూరంగా ఉన్న మాసిన గోడమీద తను ఎప్పుడో ఇంటర్వ్యూలకు వెళ్ళినప్పటి రోజులు పెన్సిల్‌తో రాశాడు, అవి కనిపించాయి. ఆ గోడకే ఓ చిరిగిన తాజ్‌మహల్ కాలిండరు వ్రేలాడుతుంది. దాని ప్రక్కనేఉన్న మరో మేకుకు చిరిగి బాగా మాసిపోయిఉన్న ఫాంటు తగిలించి ఉంది.

గదికి మూలగా ఓ మట్టి కుండ, దానిమీద అంచులు పగిలిన గాజు గ్లాసు ఉన్నాయి. మరోమూల తుప్పుపట్టిన ట్రంకుపెట్టె ఉంది. అందులో ఏం ఉంటాయో అతనికి తెలుసు. తన డిగ్రీలు, కాండక్ట్ సర్టిఫికెట్లు, ఇంటర్వ్యూలకి రమ్మంటూ వచ్చిన ఉత్తరాలు, ఇంకా కొన్ని కవర్లు, తెల్లకాగితాలు తప్ప మరేం ఉండవు.

అతడు కూర్చున్న చోటునుంచి లేచాడు.

గోడ దగ్గరకు వెళ్ళి చూశాడు. పెన్సిలుతో రాసిన అంకెలు కనబడ్డాయి దగ్గరగా. చివరిసారిగా ఇంటర్వ్యూకి వెళ్ళి ఎన్నిరోజులు అయిందో లెక్కవేశాడు. మూడునెలల పదిరోజులు.

నిట్టూర్చాడు ఒక్కసారి.

ఆ పెన్సిలు గీతల్ని చెరుపుదామని చేత్తో బలంగా రుద్దాడు. కానీ అవి చెరిగిపోలేదు. అతికినట్టుగా ప్రక్కలకు కూడా వ్యాపించాయి. ఆ ప్రయత్నం మానుకుని ట్రంకుపెట్టె ముందుకువెళ్ళి కూర్చున్నాడు అతను. పెట్టె తెరిచి చూశాడు. ప్లూతకి అంటించి ఉంది ఓ దేవుడి బొమ్మ.

దాన్నిచూసి అతనికి నవ్వొచ్చింది, నవ్వాడు కూడా పెద్దగా.

ఉన్నట్టుండి ఏదో గుర్తొచ్చినట్టు కాగితాలన్నీ క్రిందపడేసి పెట్టె అడుగున అంతా వెదికాడు, పాత బ్లేడుముక్క కన్పించింది. దాన్ని చేతులోకి తీసుకుని చూశాడు. బాగా తుప్పుపట్టిపోయిఉంది. అది తాను ఎప్పుడు కొన్నాడా అని ఆలోచించాడు కాసేపు, గుర్తు రాలేదు 'చాలా రోజులు అయి ఉంటుంది!' అనుకున్నాడు చివరికి.

బ్లేడుతో జాగ్రత్తగా చించుతూ ఆ బొమ్మను రేకుమీద నుంచి తొలగించాడు. బొమ్మ ఊడి చేతుల్లోకి వచ్చింది. దాన్ని చేతుల్లోకి పట్టుకుని పెట్టెమూసివచ్చి మళ్ళీ ఇందాకటి స్థలంలోనే కూర్చున్నాడు.

బొమ్మని నేలమీద ఉంచి బ్లేడుతోనే బొమ్మ రెండు కళ్ళ దగ్గిరా చిన్నకంతలు పెట్టాడు. ఇప్పుడు దాన్ని చూసేసరికి ఒక వింత అనిపించింది అతనికి. తర్వాత పొట్టమీద సున్నాలాగా కత్తిరించాడు. అంతమేరా కాగితం ఊడి చేతుల్లోకి వచ్చింది. ఆ కంతలోనుంచి అడుగున ఉన్న గచ్చు కన్పిస్తుంది. గచ్చుమీద ఉన్న పగులుచార కూడా కన్పించింది. ఆ తర్వాత అతను ఆ దేవుడి బొమ్మని మోకాళ్ళదాకా కోశేశాడు.

ఇప్పుడా బొమ్మని చూస్తుంటే మరీ మరీ నవ్వొచ్చింది అతనికి.

తర్వాత తల, చేతులు...ఇలా బొమ్మ మొత్తం ముక్కలు ముక్కలుగా కోశేశాడు. అలా చేసినందుకు అతనికి సంతోషం కలిగింది. ముక్కలు అన్నీకలిపి ఉండలాగా చుట్టి కిటికీలోనుంచి బయటికి విసిరి వెయ్యబోయాడు. కానీ అవి కిటికీ చువ్వకి తగిలి మళ్ళీ లోపలపడ్డాయి చెల్లాచెదరుగా. లేచి వెళ్ళి ముక్కలు అన్నీ ఏరి కిటికీలోనుంచి బయటకు విశిరాడు.

ఆ సమయంలో అతనొక దృశ్యం చూశాడు.

పెరట్లోఉన్న బాత్ రూమ్‌లోనుంచి అప్పుడే స్నానం ముగించుకుని ఇంటివారి రెండో అమ్మాయి ఇంట్లోకి వస్తుంది. ఒంటికి చీర అస్తవ్యస్తంగా చుట్టుకుని ఉండటంవల్ల మోకాళ్ళ క్రిందిభాగం అంతా కనిపిస్తూంది పచ్చగా.

అతను అలానే చూస్తున్నాడు.

పచ్చటి పిక్కలు! వాటిమీద నల్లటి వెంట్రుకలు! కాలివేళ్ళకి ఉన్న మట్టెలు గచ్చుకి తగులుతూ శబ్దం చేసు [illegible] ఆమె తల పైకెత్తి చూసింది. తనకేసే చూస్తున్న అతను కన్పించాడు.

గాభరాగా అడుగులు త్వరగా వెయ్యబోయింది. కానీ చేతిలోఉన్న సబ్బు బిళ్ళ జారి క్రిందపడటంతో సిగ్గుతో తల మునకలు అయిపోతూ వంగి సబ్బుబిళ్ళ అందుకుని లోపలికి పరిగెత్తింది,

అతను వెనక్కితిరిగివచ్చి కూర్చున్నాడు.

ఆ అమ్మాయి వంగినప్పుడు నీటిబిందువులతో ముత్యాలు పొదిగినట్టుగాఉన్న పచ్చటి వీపు అతనికళ్ళముందు మెదిలింది. ఆ తర్వాత ఆమె మొగుడు ఎలాఉంటాడాఅని ఆలోచించాడు. ఆఅమ్మాయి మొగుడిని అతనుచూడలేదు అసలు ఇంతవరకు. ఎవరితోనో ఉంటూ ఈమెని వదిలేశాడు. అందుకనే ఆ అమ్మాయినిచూస్తే అతనికిజాలి.

జేబులు తడుముకున్నాడు అతను ఓసారి.

పదిపైసల నాణెం తగిలింది ఎత్తుగా. దాన్ని చేతులోకి తీసుకున్నాడు. బాగా పాతబడిఉంది. అక్కడక్కడా నల్లగా మకిలి పట్టి ఉంది నాణేనికి. అదితన జేబులోకి ఎప్పుడు వచ్చిచేరిందా? అని ఆలోచించాడు కాసేపు. రెండురోజుల క్రితం చివరిగా తన దగ్గర మిగిలిన అర్ధరూపాయిలో ఒకరొట్టె కొనుక్కుని సింగిల్ టీ తాగాడు ఎక్కడో కాకా హోటల్‌లో. అప్పుడు మిగిలి ఉండాలి.

దాన్ని మళ్ళీ జేబులో వేసుకున్నాడు.

అంతలో కిటికీలోనుంచి ఓ పిచ్చుకవచ్చి కిచకిచమంటూ విసురుతూ గదంతా తిరగసాగింది. ఆ పిచ్చుక వైపేచూశాడు అతను కాసేపు. అది ఆగదిలోనే ఎక్కడున్నా ఆగితే బాగుండు! అనుకున్నాడు, కానీ అది ఆగలేదు. కొంతసేపు ఎగిరి కిటికీలోనుంచి ఎటో వెళ్ళి పోయింది.

అతను నిట్టూర్చి తలదించుకున్నాడు.

తను వేసుకున్న చొక్కా బాగా మాసిపోయి కనిపించింది. దాని మీద ఓ గ్రీసు మరకకూడా కనిపించింది అతనికి. చేత్తో తుడిచి చూశాడు పోతుందేమోనని, పోలేదు. చొక్కాని క్రిందికి వదిలేస్తూ మళ్ళీ ఆలోచించాడు ఆగ్రీసు మరక ఎప్పుడు అంటిందాఅని, గుర్తుకు రాలేదు. మరికొంతసేపు ఆలోచించి చూశాడు గుర్తువస్తుందేమో నన్ని, లాభంలేకపోయింది. అది గుర్తుకురాలేదు.

కానీ, చిన్నప్పుడు జరిగిన ఓ సంఘటనమాత్రం గుర్తుకు వచ్చింది.

ఏదో చెరువుగట్టు, సాయంత్రంపూట, వొడ్డునే కూర్చుని నీళ్ళల్లోకి రాళ్ళు విసురుతున్నాడతను. రాయి నీటిలోపడి పడినప్పు డల్లా అలలు బయలుదేరి చుట్టూ పోతున్నాయి. కొంతసేపు అలా రాళ్ళు విసిరేసరికి విసుగు అనిపించి మానేశాడు. కొంతసేపటికి ఓ కప్పపిల్ల కన్పించింది నీటిమీద. తనకేసే చూస్తుంది. అది అసలు కళ్ళు ఆర్పుతుందో లేదోకూడా తెలియలేదు. కాసేపుచూసి ఓరాయి విసిరాడు దానికేసి గురిచూసి. కానీ రాయి దానికి తగలకముందే నీళ్ళ ల్లోకి మునిగిపోయింది ఆ కప్పపిల్ల. ఆ కప్ప ఇంకా బ్రతికి ఉందో లేదో? అనిపించింది అతనికి. కాని అది ఇంకా బ్రతికి ఉండదని మాత్రం సమాధానం చెప్పుకున్నాడు తనకు తానే.

చుట్టూ చూశాడు.

ఇందాకటి వస్తువులే మళ్ళీ కన్పించాయి కళ్ళకి. వాటి స్థానంలో ఏ మార్పూ రాలేదు. కానీ ఓ విషయంమాత్రం గమనించాడు అతను. కిటికీలోనుంచి ఎండ గదిలోకి పడుతుంది కొంతమేర. ఆ ఎండని ముక్కలుగా కోసినట్టు మధ్యలో కిటికీచువ్వల నీడలు కనబడు తున్నాయి. మొత్తం ఎన్నిచువ్వలు ఉన్నాయో లెక్కపెట్టాడు, ఆరు!

తల వంచుకుని కూర్చున్నాడు

కాళ్ళు కనబడ్డాయి. అరికాళ్ళకేసి చూశాడు. నల్లగా మట్టి పట్టి ఉన్నాయి. ఎడమ అరికాలిలో కన్పించింది లోతుగాఉన్న చిన్న గుంట.

అది ఎలా ఏర్పడిందో అతనికి గుర్తుంది. ఓరోజు రాత్రి పూట నడిచివస్తున్నాడు చీకట్లో. కసుక్కున ఏదో దిగబడింది కాలిలో. వొంగిదాన్ని లాగి వెలుతురులోకి వచ్చినతర్వాత చూశాడు. పెద్ద గాజుముక్క! వజ్రంలా తళతళా మెరిసింది. ప్రక్కనఉన్న కాలవలోకి విసిరి వేశాడు తర్వాత. ఆగాజుపెంకు ఇంకా అక్కడే ఉండి ఉంటుందా? అనిపించింది. ఉంటుందో లేదోమాత్రం అతను ఊహించలేకపోయాడు.

అరికాళ్ళని చేత్తో ఓసారి రాశాడు.

గరుకుగా ఉన్నది చర్మం. మొద్దుబారిఉంది అరికాలంతా. ఎందుకనో వాటిని చూస్తూంటే అతనికి చెప్పలేని ప్రేమకలిగింది అరి కాళ్ళమీద. కష్టంమీద ముందుకువంగి వాటిని ముద్దుపెట్టుకున్నాడు. చల్లగా తగిలింది చర్మం పెదవులకి. తర్వాత మళ్ళీ మామూలుగా కూర్చుని ఆలోచించసాగాడు.

తను అడుగులు వెయ్యటం నేర్చుకున్న దగ్గరనుంచీ ఇప్పటి

వరకు అవి తన శరీరాన్నిఎన్నో వేల మైళ్ళు తీసుకువెళ్ళి ఉంటాయి. కానీ ఏనాడూ వాటినిగురించి ఇలా ఆలోచించటం జరగలేదు, ఎందు కని ?

నవ్వొచ్చింది అతనికి.

తనెవరు ? అవి ఎవరివి ? కాళ్ళు, చేతులు, ముఖం, తల అన్నీ కలిపితేనేగా తను తయారు అయింది !

చేతులకేసి చూసుకున్నాడు ఓసారి.

రెండు మూడు వొంపులు తిరిగిన పెద్ద రేఖలు కనిపించాయి అరచేతిలో. తను ఎన్నోసార్లు అనుకున్నాడు ఎవరికి అయినా చెయ్యి చూపించుకోవాలని. ఆరేఖలు దేన్ని తెలుపుతాయో అడగాలనుకున్నాడు, కానీ ఇంత వరకు అలా చెయ్యటం జరగలేదు.

అరచేతుల్లో ముఖం ఉంచుకుని కళ్ళుమూసుకున్నాడు, కళ్ళ ముందు చీకటి ప్రత్యక్షం అయింది గాఢంగా. తను అన్నం తిన్నది ఆచేతులతోనే, చిన్నప్పుడు పేము బెత్తం దెబ్బలు తిన్నది ఆచేతులే, పరిక్షలు రాసిందీ ఆచేతులతోనే, స్కాలర్‌షిప్పులు తీసుకున్నదీ ఆ చేతులతోనే, చదువుల్లో స్కూల్ ఫస్టు వచ్చినప్పుడు కలెక్టరుగారు షేక్ హాండు ఇచ్చిందీ, కాలేజీలో డిబేట్స్‌లో పాల్గొంటే వచ్చిన మెడల్ ల్ని అందుకున్నదీ ఆచేతులే. ఆఖరికి తన డిగ్రీ సర్టిఫికెట్టుకూడా తీసుకున్నది ఆచేతులమీదుగానే.

మనసంతా అదోలా అయిపోయింది అతనికి.

ఏడుపు వచ్చింది. ఆ బాధలో కొంతసేపు ఏదీ ఆలోచించ లేకపోయాడు. కొంత సేపటి తర్వాత తల్లి గుర్తొచ్చింది. బొట్టు లేని ఆమె నుదురు గుర్తొచ్చింది. కళ్ళక్రింద ఉండే నల్లటి చారికలు గుర్తొచ్చాయి. అప్పుడప్పుడు ఆమె కళ్ళల్లోంచి గిరున తిరిగి క్రిందకు రాలే కన్నీటిబిందువులుకూడా గుర్తొచ్చాయి. తనతల్లి ఇప్పుడు ఈలోకంలో లేదు. మరోలోకానికి పోయిందా ? ఒకవేళ తనుకూడా చనిపోతే ఆలోకానికే పోవాలికదా ! అప్పుడు అమ్మ తనని గుర్తుపడుతుందా ? అసలు అమ్మరూపం ఇంకా అలానే ఉంటుందా?

గట్టిగా నిట్టూర్చాడు అతను ఓసారి.

తనకి బాగా గుర్తు ! రాత్రిళ్ళు వంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తుండేది అమ్మ. మధ్యలో తనకు మెలకువవచ్చి చూసేవాడు. అమ్మకళ్ళవెంట నీళ్ళు వస్తుండేవి. తను పిలిచేసరికి అమ్మ ఉలిక్కి పడి చూసేది. తనని దగ్గరకు తీసుకుని 'భయంలేదు పడుకోబాబూ! నీకు నేను ఉన్నాగా' అనేది. అప్పుడు తనకో అనుమానం వచ్చేది. 'మరి నీకు భయం వేస్తే ఎవరున్నారు' అని అడగాలనిపించేది. కానీ ఏనాడూ ఆ ప్రశ్న వెయ్యి లేదు. మౌనంగా ఆమె గుండెలమీద తల ఆన్చి నిదురపోయేవాడు. నిదురలోకి జారిపోయే వరకు ఆమె గుండెలు కొట్టుకోవటం స్పష్టంగా వినిపించేది. ఆ గుండె కొట్టుకున్న చప్పుడు తనకి ఇప్పటికీ గుర్తువుంది.

తల తిప్పి చుట్టూ చూశాడు అతడు.

కిటికీలోంచి ఎండ ఇంకా పడుతూనేఉంది. ఇందాకటి చోటునుంచి ఇప్పుడు మరికాస్త ముందుకు జరిగినట్టుగాఉంది.

మళ్ళీ ఆలోచనలోపడిపోయాడు.

చిన్నప్పుడు తన ఇంటిలో ఓ మూలగా పెరిగిన పెద్ద జిల్లేడు చెట్టు గుర్తొచ్చింది. చాలా పెద్దదిగానే పెరిగింది అది. తెల్లటి పూలతో ఉండేది. ఓసారి ఎక్కడినుంచో బుల్లి రంగురంగుల పిట్ట వచ్చివాలింది జిల్లేడు కొమ్మలమీద. ముక్కుతో కొమ్మమీద అటూ ఇటూ రాసింది. అది ఆ జిల్లేడు చెట్టుమీదనే గూడు కట్టుకుంటే బాగుండు అనుకున్నాడు తను ఆ సమయంలో. అది కొంతసేపు కొమ్మమధ్య నుంచిని తర్వాత ఎగిరిపోయింది అరుచుకుంటూ. ఆ తర్వాత వరు సగా రెండు మూడు రోజులపాటు ఎదురుచూశాడు మళ్ళీ ఆపిట్ట వస్తుందేమోనని. కాని అది రాలేదు. తర్వాత దానికోసం ఎదురు చూడటం మానేశాడు.

కిటికీ ప్రక్కనుంచి ఓకాకి పెద్దగా అరుచుకుంటూ పోవ టంతో అతని ఆలోచనకు అంతరాయం కల్గింది. కిటికీకేసి చూశాడు. కాని అప్పటికే కాకి కిటికీదాటి వెళ్ళిపోయింది. మరి కనపడలేదు తల తిప్పుకున్నాడు.

దాహం అని పించింది.

లేచి మూలనున్న కుండదగ్గరకి వెళ్ళాడు. అడుగున కాసిని మాత్రమే ఉన్నాయి నీళ్ళు. కుండవంచుకున్నాడు. గ్లాసులోకి మూడు వంతులదాకా వచ్చాయి నీళ్ళు. ఆ తృప్తి గొంతులో పోసుకుని గ్లాసు క్రింద పెట్టివచ్చాడు.

మళ్ళీ అక్కడే కూర్చోవాలనిపించలేదు.

కిటికీ దగ్గరకి వచ్చినిలబడ్డాడు.

క్రింద ఇంటివారి రెండో అమ్మాయి బటలు ఆరేస్తుంది తాడుమీద. చీర పైకి ఎగదోపింది. మళ్ళీ కన్పించాయి అతనికి —

పచ్చని పిక్కలు! దానిమీద నల్లటి వెంట్రుకలు! మట్టెలు ఎండపడి మెరుస్తున్నాయి.

తల ఎత్తి చూసింది ఆ అమ్మాయి. తనవైపే చూస్తున్న అతను కన్పించాడు. సిగ్గు వచ్చింది ఆ అమ్మాయికి. అక్కడినుంచి వెళ్ళిపోవాలనిపించింది. కానీ పని సగంలో ఉండటంలో ఆ పని చెయ్యలేక మళ్ళీ బట్టలు ఆరేయసాగింది.

అతను ఆమెనే పరీక్షగా చూస్తున్నాడు.

ఇందాక పచ్చగా విశాలంగా కన్పించిన వీపుని ఇప్పుడు ఎర్రటి జాకెట్టు కప్పి ఉంచింది. జాకెట్టు చెమటకు తడిసి వీపుకి అంటుకుపోయి ఉంది.

కిటికీ దగ్గరనుంచి వెనక్కి తిరిగాడు అతను.

పెట్టె దగ్గరకువచ్చి కూర్చున్నాడు. కాగితాలన్నీ తీసి బయట పెట్టాడు. వాటి అన్నిటినీ చూస్తుంటే విచారం అనిపించింది. కాని ఏదో నిశ్చయించుకున్నట్టుగా తల ఊపి ఒక్కొక్క కాగితమూ చింపి ముక్కలు చేయసాగాడు. తన డిగ్రీ కాగితాన్ని చింపుతుంటే దుఃఖం పొంగివచ్చింది అతనికి. అతి కష్టంమీద నిగ్రహించుకుని దాన్నికూడా చింపి ముక్కలు చేశాడు.

కొంతసేపటికి కాగితం ముక్కలన్నీ కుప్పగా పోగు అయ్యాయి.

వాటి అన్నిటినీ తగులపెట్టాలనిపించింది. చుట్టూ చూశాడు. గదిలో ఎక్కడా అగ్గిపెట్టె కన్పించలేదు. కానీ ఆ కాగితాలను అలానే వదలబుద్ధి కాలేదు. మేడదిగి క్రిందకు వచ్చాడు. ఇంటి వారింట్లోకి వెళ్ళాడు. వాళ్ళ రెండో అమ్మాయి వస్తుంది లోపలినుంచి. బట్టలు ఆరేయటం అప్పుడే పూర్తి అయినట్టు ఉంది. చీరపైకే కట్టిఉంది. మళ్ళీ కన్పించాయి అతనికి పచ్చటి పిక్కలు! దానిమీద నల్లటి వెంట్రుకలు!

“అగ్గిపెట్టె!”

“కావాలా?”

తల ఊపాడు అతను.

లోపలికి వెళ్ళి అగ్గిపెట్టె తెచ్చి ఇచ్చింది ఆ అమ్మాయి.

అగ్గిపెట్టె అందుకుంటున్నప్పుడు అతని వేళ్ళు ఆమె వేళ్ళకి తగిలాయి. ఒక్కసారిగా తన శరీరంలోనికి విద్యుత్ ప్రసారం జరిగినట్టుగా అనిపించింది ఆమెకి. సిగ్గుతో కళ్ళు మూతలు పడిపోయాయి. బలవంతాన రెప్పల్ని తెరచి అతనికేసి చూసింది. నుదుటిమీద నరాలు తేలి ఉన్నాయి అతనికి. కళ్ళు ఎర్రటి జీరలతో నిండి ఉన్నాయి. ఎటో చూస్తున్నట్టుగా ఉన్నాయి చూపులు. అతను ఎందుకు అలా ఉన్నాడో అడగాలనిపించింది ఆమెకి. కానీ అప్పటికే అతను అగ్గిపెట్టె తీసుకొని వెనక్కి తిరిగాడు. ఆమె కూడా లోపలికి నడిచింది.

“నడుస్తున్నవాడల్లా వెనక్కి తిరిగి చూశాడు అతను.

ఆమె వెళ్ళి పోతుంది లోపలికి. మట్టెలు చప్పుడు అవుతున్నాయి గచ్చుకు తగిలి. పచ్చటి పిక్కలు! దానిమీద నల్లటి వెంట్రుకలు! తల తిప్పుకుని గబగబా ముందుకు నడిచాడు.

గదిలోకి వెళ్ళేసరికి కాగితం ముక్కలు కొంత చెదిరి ఉన్నాయి గాలికి. మళ్ళీ అన్నిటినీ పోగుచేశాడు. అగ్గిపుల్ల వెలిగించి ఒక్కక్షణం పాటు చూశాడు ఆ జ్వాలవైపు. ఆ కాస్త జ్వాల ఇన్నేళ్ళ తన చదువుని రూపులేకుండా చేస్తుంది, కొద్దిసేపటిలో అతనిలో మళ్ళీ దుఃఖం కట్టలు త్రెంచుకోసాగింది.

కానీ ఎంతో కష్టంమీద దాన్ని నిగ్రహించుకుంటూ మంటని కాగితాలకి తాకించాడు. అడుగెత్తున లేచింది మంట. ఎర్రటి ఆ మంటలో తన బడి చదువు కన్పించింది. తన కాలేజీ జీవితం కన్పించింది. డిగ్రీ తీసుకుంటున్న దృశ్యం కన్పించింది. అరచేతులలో ముఖాన్ని కప్పుకుని నిశ్శబ్దంగా రోదించాడు అతను.

కొంతసమయం గడిచింది.

కన్నీళ్ళు తుడుచుకుంటూ చేతులు తొలగించాడు అతను ముఖానికి. అప్పటికి కాగితాలు అన్నీ కాలిపోయి ఉన్నాయి. మసి గాలికి చెదిరి గది అంతా పరచుకుంది.

లేచి నిలబడ్డాడు అతను.

గోడదగ్గరకు వెళ్ళాడు. కనుపాపలపై నీటిపొర కమ్ముకుని ఉండటంవల్ల దానిమీద గీసిన అంకెలు కన్పించలేదు సరిగ్గా. తాజ్ మహల్ కాలండర్‌కేసి చూశాడు ఓ రెండు నిముషాలపాటు. తర్వాత మూలనున్న కుండదగ్గరికి వెళ్ళాడు. అది ఎన్నేళ్ళగానో ఉంది తన గదిలో. మంచినీళ్ళు తాగుదామనిపించింది. అతనికి ఆ కుండలోనివి. కానీ నీళ్ళు ఇందాకనే అయిపోయాయన్న విషయం గుర్తొచ్చి ఆ ఆలోచన

విరమించుకున్నాడు. కుండని ఓసారి చేత్తో తాకి చూశాడు, చల్లగా తగిలింది.

అగ్గిపెట్టె చేత పట్టుకుని బయటకు వచ్చాడు గదికి తాళం వెయ్యాలనిపించలేదు. గోళ్ళెం పెట్టి క్రిందికిదిగి వచ్చాడు. ఇంటవారి రెండో అమ్మాయి వాకిలి ఊడుస్తుంది. చీర పైకే కట్టుకుని ఉంది.

పచ్చటి పిక్కలు! దానిమీద నల్లటి వెంట్రుకలు!

ముందుకు నడిచి అగ్గిపెట్టె చేతిలో ఉంచాడు. అగ్గిపెట్టె తీసుకుంటుంటే మళ్ళీ ఆమెవేళ్ళు అతని వేళ్ళకు తగిలాయి. మళ్ళీ విద్యుత్ ప్రసారం జరిగినట్టు అయింది వేళ్ళ చివరనుంచి. సిగ్గొచ్చింది. అయినా తలఎత్తి అతనికేసి చూసింది. అతని కళ్ళల్లో ఎర్ర జీరాలు ఇందాకటికన్నా అధికంగా కన్పిస్తున్నాయి.

'ఎందుకు అలా ఉన్నారు?' అని మళ్ళీ అడుగుదామనుకుంది. కానీ అప్పటికే అతను వెనక్కి తిరిగాడు. ఆమె లోపలికి నడిచింది.

గేటు దాటుతుండగా వెనక్కి తిరిగి చూడాలనిపించింది అతనికి. చూశాడు. చీర కప్పిలేని పచ్చటి పిక్కలు! దానిమీద నల్లని వెంట్రుకలు! మువ్వలశబ్దం వినిపిస్తుంది గచ్చుకు తగిలి.

తలతిప్పి గబగబా ముందుకు నడిచాడు అతను.

ఎండవేడికి కాళ్ళు బొబ్బలెక్కుతున్నాయి. అయినా ఆ బాధ అతనికి తెలియటంలేదు. వడివడిగా అడుగులు వేస్తున్నాడు. మనస్సు నిండా ఏవో ఆలోచనలు!

చిన్నప్పటి ఇంగ్లీషుపాఠం గుర్తొచ్చింది. అదంటే అతనికి ఎంతో ఇష్టం. పేరు గుర్తురాలేదు. ఒక విద్యార్థి తన గురువుగారి కూతుర్ని ప్రేమిస్తాడు. ఓరోజు తన ప్రేమని బయట పెడతాడు. ప్రేమకానుకగా ఓ ఎర్రగులాబిపువ్వు తెచ్చి ఇవ్వమని అడుగుతుంది ఆమె...అంతే! తర్వాత ఏమయిందో గుర్తుకు రాలేదు అతనికి. గుర్తుకు తెచ్చుకోవాలని చాలా ప్రయత్నించాడు. కానీ లాభం లేకపోయింది. ఎందుకని అలా అయిందో అర్థంకాలేదు అతనికి.

తల ఎత్తి చూశాడు.

దూరంగా రైలుగేటు కనబడింది.

ఇంక కథగురించి ఆలోచించకూడదనుకున్నాడు. మనసునిండా అస్తవ్యస్తమయిన ఆలోచనలు రగులుతున్నాయి. దేనికీ ఆరంభం ఉండటంలేదు, అంతం కూడా ఉండటం లేదు. అక్కడక్కడా... కొంచెం కొంచెంగా...ఇరవైఎనిమిదేళ్ళ జీవిత జ్ఞాపకాలు ఒకదాన్నొకటి నెట్టుకుని వెలుపలికి రావాలని ప్రయత్నిస్తున్నాయి.ఆ సంఘర్షణలో ఏ ఆలోచనా తుదివరకు నిలబడటంలేదు.

రైలుగేటు దగ్గరయింది!

అటూయిటూ చూశాడు అతను. గేటువేసిఉంది. కానీ కనుచూపుమేరలో ఎక్కడా రైలు వస్తున్నజాడ కనబడటంలేదు. జేబులోని పదిపైసలు గుర్తొచ్చాయి. ఏం చెయ్యాలాఅని ఆలోచించాడు. చెట్టునీడన అక్కడికి దగ్గరలోనే కూర్చునిఉన్న ఓ ముసలి బిచ్చగాడు కన్పించాడు అతని కళ్ళకి. గబగబా వెళ్ళి ఆ పదిపైసలు అతనికిచ్చి రైలుపట్టాల వెంట నడవటం మొదలుపెట్టాడు. రైలుగేటు క్రమంగా దూరం కాసాగింది.

తలఎత్తి చూశాడు అతను.

దూరంగా పొగను చిమ్ముతూ వస్తున్న రైలు కన్పించింది.

అదిచూచి అతనిలో ఏదో నూతనోత్సాహం బయటికి వచ్చింది. 'మరికొద్ది క్షణాల్లో తనీలోకంనుంచి శాశ్వతంగా శలవుతీసుకుంటాడు!' అనుకున్నాడు.

దూరంగా రోడ్డుమీదపోతున్న ఓ మూడేళ్ళపిల్ల ఏడుస్తూపోతుంది. అటుచూశాడు. ఆపిల్ల కాళ్ళకి చెప్పులులేవు. జాలేసింది అతనికి ఆపిల్లమీద. వెంటనే తన మనస్సుని దానినుండి మరల్చుకున్నాడు. ఇంక కొంతసేపటిలో తానీలోకంనుంచీ శాశ్వతంగా నిష్క్రమిస్తున్నప్పుడు, ఈ కాసేపట్లోనే ఒకళ్ళపై జాలి, మరొకళ్ళపై ప్రేమ–ఇవన్నీ అనవసరం అనిపించింది అతని హృదయానికి.

రైలు వంద గజాలదూరంలోకి వచ్చేసింది.

దూరంగా రైలుగేటుదగ్గరనుంచి కేకలు పెడుతున్నారు ఎవరో. వాళ్ళ కేకలకి జాలిపడ్డాడు అతను. తను వచ్చింది తప్పుకోటానికా?

ఉన్నపాటున రైలు పట్టాలకి అడ్డంగా పడుకున్నాడు.

అడుగున స్లీపర్ తాలూకు మేకు అతని వెన్నులో గుచ్చుకుంది. ఎర్రటి ఎండలో ఉదయంనుంచీ కాలుతున్న రైలుపట్టాలు, అప్పుడే కొలిమిలోనుంచి తీసిన ఉక్కుకడ్డీలలా కాలుస్తున్నాయి అతని శరీరాన్ని. కంటికి ఎదురుగా నీలంగా, విశాలంగాఉన్న ఆకాశం కన్పించింది. తెల్లగా దూది పింజల్లాఉన్న మేఘాలు కన్పించాయి. మేఘాల మధ్యగా ఎంతో ఎత్తులో ఎగురుతున్న గద్దలు కన్పించాయి.

తల్లి గుర్తొచ్చింది ... చచ్చిపోయినతర్వాత బిగుసుకుపోయిన ఆమె కాలివేళ్ళు! ... తన అరికాళ్ళు...నల్లటినుసి...పచ్చటి పిక్కలు ...నల్లటి వెంట్రుకలు...మువ్వలశబ్దం...పసిపాపఏడుపు...అరుపులు ...గోల...కేకలు...రైలుపట్టాల దడదడ...ఇంజనుకూత...

"అమ్మా!!!"

* * *

సరిగ్గా అదే సమయంలో అతనుఉండే ఇంటి వాకిట్లో పోస్ట్‌మేన్ కేక పెడుతున్నాడు —

"సత్యనారాయణరావుగారూ!"

అతని పేర ఓకవరు ఉంది.

విశ్వనాథ జగన్నాథులు - కావ్యప్రయోజనం

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

జూన్ 1976 "భారతి"లో "సాహిత్యవ్యాప్తి-ప్రమాణాల పరిరక్షణ" అనే శ్రీ తిరుమల రామచంద్రగారి వ్యాసం పురస్కరించుకొని ఇట్లా వ్రాస్తున్నాను.

శ్రీ తిరుమల రామచంద్రగారు ఒకచోట ఇట్లా వ్రాస్తారు:

"ఇక సర్వమూ రసదృష్టితో చూచిన జగన్నాథ పండితుడు వాక్యం రసాత్మకం కావ్యం-రసాత్మకమైన వాక్యమే కావ్యం అని నిర్వచించారు."

వాక్యం రసాత్మకం కావ్యం అన్నది "సాహిత్య దర్పణ" కర్త విశ్వనాధుడ కాని, "రసగంగాధర" కర్త జగన్నాథ పండితుడు కాదనుకొంటాను. ఇక జగన్నాథ పండితుడు చేసిన నిర్వచన మేమంటే "రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యం"-ఇద్దరూ "లోక"నాథులే. వారి వారి నిర్వచనాలు శిరోధార్యాలే. విశ్వనాధుని నిర్వచనంలో కేవల శబ్ద స్వరూపకమైన వాక్యం కావ్యంకాదు. అందు (అంటే వాక్యంలో) ఆత్మగఉండే రసంకావ్యం. జగన్నాథుని నిర్వచనంలో, శబ్దంకాదు కావ్యం శబ్దం ప్రతిపాదించు (రమణీయమైన) అర్థం కావ్యం. రసానికీ, అర్థానికీ మూలభూతమయింది భావం. ఉదాత్త భావమే కావ్యం అవుతుంది. ఉదాత్తభావం కేవలం ఆశీః ప్రధానంగా (**Benedictory**), సంకల్ప స్వరూపంగా (**Wish ful thinking**) ఉండరాదు. "మనిషిని స్వావలంబునిగా చేసేటటువంటియు, లోకశ్రేయః క్రియాపరునిగా ప్రేరేపించేటట్టియూ ఉదాత్తభావాన్నే కావ్యం" అనవచ్చును. రససిద్ధాంతాన్ని, శ్రీ తిరుమల రామచంద్రగారు, బండగా చెప్పినాడని నిష్కారంగా అనిన మమ్మటుని కావ్యప్రయోజనాల్లో ఒకటగు కాంతాసమ్మితత్వాన్ని, ఊతగా కొనుటవల్ల కావ్య నిర్వచనం పరిమితం అవుతున్నది. వేదములు ప్రభు సమ్మితాలన్నారు. పురాణేతిహాసములు సుహృత్సమ్మితాలన్నారు. నేనందుకే, వేదాలు ప్రభుసమ్మిత కావ్యాలు, పురాణేతిహాసాలు స్నేహసమ్మిత కావ్యాలు అంటాను. "సత్యం వద" అనిన వేదవాక్కు, "సత్యంబున వలననములు సూపుగౌరవంబున" అనిన ఇతిహాసవాణి, "ఆపద్ధం సెప్పమాకు మావా" అనిన మేనకోడలి పలుకు, మూడును కవిత్వాలే. ఆమాటకువస్తే వేదవాక్కే నిజమైన కవిత్వం. మంత్రద్రష్టను "కవి" అనిరి. అగ్నిదేవతను కవి ("కవిక్రతుః"-ఋగ్వేదం) అంటారు.

శ్రీ తిరుమల రామచంద్రగారు ఇటీవల తమ రచనలల్లో కొన్ని నిగమనములు ప్రతిపాదిస్తూ వస్తున్నారు. ఫిబ్రవరి 1976 భారతిలో వారి "కవులు ఎప్పుడూ అనుచరులే" చూడవచ్చును. వారికి కొన్ని ప్రియతమ సిద్ధాంతాలున్నవి పై వ్యాసమూ, జూను వ్యాసం చర్విత చర్వణంగా వున్నాయి. వీనిలో అయోమయత్వం, స్వవచో విఘాతం కనబడతాయి అవేవో మనవి చేస్తాను:

అవి ఏవంటే,

"నేడుగాని, నాడుగాని, ఏనాడుగాని కవులు సంఘాన్ని ఎప్పుడూ నడిపింపలేదు సరికదా సంఘనాయకులకు అనుచరులుగానే ఉన్నారు." (కవులు ఎప్పుడూ అనుచరులే"-ఫిబ్రవరి 1976 భారతి)

అటులనే ఉన్న ఇంకొక నిగమనం.

"ప్రపంచంలోగాని, మనదేశంలోగాని ప్రవర్తిల్లిన ఏ ఉద్యమాన్ని పరిశీలించి, తదనంతర కళారీతులను పరిశీలించినా నా సంఘం

మార్పులను సాహిత్యం అనుసరిస్తూ వచ్చిందనే స్పష్టం అవుతుంది" (సాహిత్యవ్యాప్తి...-జూన్ 1976 భారతి).

చర్విత చర్వణాలు :

అన్న చనిపోతే అతని భార్యను తమ్ముడు కట్టుకునే వ్యవస్థపై జుగుప్స ఏర్పడడమనే సిద్ధాంతము ఫిబ్రవరి వ్యాసంలోనూ జూను వ్యాసంలోను ఉన్నది. అట్టి భ్రమమూలక సిద్ధాంతమే కర్మకాండపై అశ్రద్ధ అనాదరంతో గౌతమబుద్ధుడు విప్లవజ్వాల రేపినాడన్నది రెండు వ్యాసాలలోనూ ఒకేవిధమైన పదజాలంతో ఉన్నది. గౌతమ బుద్ధునికి విరక్తి కల్గింది కర్మకాండపై కాదు. జర, రుజ, మృత్యువులను చూచి కలిగినది.

అయోమయత్వం :

ఫిబ్రవరి వ్యాసంలో ఒకచోట ఇలా ఉంది. "గాంధీజి కవి కాదు—అంటే నేడు అధికారంలోవున్న అంశపురుషులకు రచనలు అంకితమిచ్చే కవికాదు బుక్కులలో చెప్పిన నిజమైన కవి." దీని భావమేమి తిరుమలేశ? కవులు రెండు రకాలు. నిజమైనవారు. నిజము కానివారు. ఎవరు నిజమైనవారు? బుక్కులలో చెప్పబడ్డవారు. మరి బుక్కులు ప్రభుసమ్మితాలు కావ కవితలుకాదే? ఎవరు నిజమైనవారుకాదు? అధికారంలో వున్న పురుషులకు అంకితమిచ్చే వారు. నన్నయ, శ్రీనాథ, రామకృష్ణులు కవులు కాలేరు దీని ప్రకారం. నిజమైన కవులే కవులనదగి నప్పుడు, "కవులెవ్వడూ అనుచరులే" అనడంలో అయోమయత్వం, స్వవచో విఘాతత్వం ఉండ లేదా?

స్వవచో విఘాతత్వమునకు మచ్చు :

జూన్ వ్యాసంలో ఇట్లా ఉంది.

"అన్న మరణిస్తే అన్నభార్యను తమ్ముడు పెళ్లాడే వ్యవస్థ ప్రబలంగా ఉండేది. ఇది కాలానుగుణంగా జుగుప్సాకరమైంది దార్శనికులు దీనిని ఖండించారు. దానితో అన్న భార్యకు సంఘంలో తల్లి స్థానం ఏర్పడింది. దానితో నూతన నీతి ఏర్పడింది. దాని వైభవ వర్ణనమే వాల్మీకి రామాయణం. ఈ నూతనరీతి వాల్మీక్యుపజ్ఞం కాదు. వాల్మీకి అంతగా చెప్పిన రామాయణం ఉత్తర భారతంలో—ఎందుకు దేశమంతా ఎంత ప్రచారంలోఉన్నా, కొన్ని కులాల వారిలో అన్న మరణిస్తే, తమ్ముడు అన్న భార్యను పెండ్లాడే పద్ధతి ఇంకా పోలేదే?"

పై పేరాగ్రాఫులో కల ప్రమాదాలుట్టంకిస్తాను. అన్న భార్యను పెళ్లాడే వ్యవస్థ ఉండేది. అది జుగుప్సాకరమైందా? ఎందుకు, ఎప్పుడు? సంఘ పరిణామాలకు శ్రీ తిరుమల రామచంద్ర గారగ్ర తాంబూలం ఇచ్చిన దార్శనికులు ఖండించిన తర్వాతనా? లేక ఆ వ్యవస్థ జుగుప్సాకరమైన తర్వాత, దాని ఘనతను తమకే ఆపాదించుకొనేందుకు దార్శనికులు చేసిన ఖండన తంతు తర్వాతనా? అన్న భార్యకు సంఘంలో ఏర్పడ్డ తల్లిస్థానంయొక్క వైభవ వర్ణనగా కన్పడదు రామాయణం. ఎందుకంటే రామాయణంలో అన్న చనిపోలేదు. అతని భార్యను తమ్ముడు పెళ్లాడ నిశ్చయించుకొని మరలా "వ్యవస్థ మారిందిలే, వద్దు" అని పునః నిశ్చయించుకొనటమూ లేదు. అన్న అంటె వల్లమాలిన అభిమానం కల ఒక తమ్ముడు తన భార్యను కూడా వదలిపెట్టి అన్నవెంటబడగా, ఆ అమాయకుణ్ణి పోగొట్టుకొనిపోయిన తన పెండ్లాముమ వెదకుటకు ఉపయోగించుకొన్న ఒక అన్న కథే రామాయణం. అన్న చనిపోగా, వాని భార్యతో ఉండిన తమ్ముని ఉదంతం రామాయణంలోనే ఉంది. ఇంక వాల్మీకి రామాయణంలో శ్రీ తిరుమల రామచంద్రగారికి దొరికే వైభవ వర్ణన మేముందో? అన్న భార్య తల్లివంటిదను నూతనరీతి వాల్మీక్యుపజ్ఞం కానప్పుడు, క్రింది కులాలవారు అన్న భార్యను చేసికొనే పద్ధతికై వాల్మీకినని ఏం ప్రయోజనం? ఆ సంఘపు మార్పుతెచ్చిన దార్శనికుల ననవలెను. ఇది వాల్మీకి రామాయణ విమర్శకాదు. శ్రీ తిరుమల రామచంద్రగారి నిగమన పరీక్షయేకాని వేరుకాదని మనవి. వేదసారాన్ని, గాయత్రీమంత్రాన్ని కథగా చెప్పబడిందన్న వాల్మీకి రామాయణాన్ని నేటి చచ్చు సోషియాలజిగ పరిగణించడం సరికాదనియే నా మనవి.

శ్రీ తిరుమల రామచంద్రగారి పరస్పర విరుద్ధభావ సరణి కింకొక ఉదాహరణ :

జూన్ పత్రికలోని వ్యాసంలోని ఒకభావం ఇట్లా ఉంది: "...సంఘంలోని పరిణామాలనుబట్టే కళారీతులు ఆవిర్భవిస్తాయి. ఆ కళారీతులు తక్కినవారికి కొంత మార్గదర్శకాలు కావచ్చు, కాని మరొక మహోద్యమం వచ్చినప్పుడు పాతవేవీ నిలువవు."

చిత్రమేమంటే, పై మూడు వాక్యములొకదానితో ఒకటి వైరంకల్గి ఉన్నాయి.

ఇక శ్రీ తిరుమల రామచంద్రగారి ముఖ్య సిద్ధాంతము

కవులు ఎప్పుడూ అనుచరులే. సంఘాన్ని మార్చేది మరెవరో అని ఆ మరెవరినో కవులనుసరిస్తారు అని. దీన్ని పరీక్షిస్తాను.

పై సిద్ధాంతమునకు చేసిన వివిధ ప్రతిపాదనలు తీసికొందాం. ఫిబ్రవరి పత్రికలో ఇట్లా ఉంది:

"భారత చరిత్ర గతిని పరిశీలించినపుడు దార్శనికులు సంఘ సంస్కర్తలు, పరిపాలకులుకాని పరిపాలన వ్యవస్థలోగాని నూతన పరిణామాలకు నాయకత్వం వహించిరేగాని కవులెన్నడూ అగ్రేసరులు కాలేరని, పై వారికి అనుచరులుగావేవున్నారని స్పష్టమవుతున్నది".

దార్శనికులు, సంఘసంస్కర్తలు, పరిపాలకులు ఒక గ్రూపుగాను, కవిని ఎదిరిపార్టీగాను విభజించుట అతార్కికం. లావువారు, ఏడ్పుమొగంవారు, కర్రతిప్పువారు ఒక గ్రూపుగాను పాటపాడువారు ఎదిరి గ్రూపుగాను విభజించుట అట్టిదే. దార్శనికులలో కవులు (మహమ్మదు ప్రవక్త, ఆది శంకరులు, వేదాంతదేశికులు) ఉండవచ్చును. సంఘ సంస్కర్తలలో కవులుండవచ్చు. (టాల్స్టాయి, ఈశ్వర చంద్ర విద్యాసాగరు, వీరేశలింగం) పరిపాలకులలో (మహేంద్ర పల్లవుడు, కృష్ణదేవరాయలు, డిస్రాయలీ, మోసేటుంగ్, హోచిమిన్, నెహ్రూ) కవులయినవారు, అనదగినవారు వున్నారు. కవులకు నాయకులే అనుచరులైన ఉదాహరణలున్నాయి. బోల్షవిక్ నాయకులు పుష్కిన్ టాల్స్టాయులను గురువులుగ భావించిరి. ఫ్రెంచి విప్లవ వాదులకు వోల్టేరు కవిపూజనీయుడు. గాంధీజి రవీంద్రనాథ ఠాకూరును గురుదేవుడని వినమితుడాయెను.

"వారు (అనగా కవులు) తమంతట తాము ఎప్పుడూ ప్రవక్తలు కాలేదు" అన్న శ్రీ తిరుమల రామచంద్ర వాక్యమూ పూర్తిగా సరికాదు. ఎందుకంటే ప్రవక్తలందరూ కవులే. వేదర్షులు, బుద్ధుడు, క్రీస్తు, మహమ్మదు, ఆదిశంకరులు, నానకు మున్నగు ప్రవక్తలు కవులు. వాళ్ల ప్రవచనాలు కవితామయాలు కాబట్టే మిగిలినాయి. కవులు, సంఘాన్ని మార్చే నాయకులు, వీరిలో ఎవరు గొప్పయితే వారిని రెండవవారనుకరిస్తారు. కవి తుమ్మల సీతారామ మూర్తి గాంధీని అనుసరిస్తే, గాంధి నరసింహమెహతా (కవి) ను అనుసరిస్తాడు. కవి వేదాంతదేశికులు. దార్శనికుడు రామానుజాచార్యులను అనుసరిస్తే, రామానుజుడు వ్యాసుని (కవి) ని అనుసరిస్తాడు. నేటి "రెండుమేలు మూడుచాలు" ముందు "ప్రజయాహి మనుష్యః పూర్ణా" అనే వేదవాక్యంగతి ఏమయిందని శ్రీ తి. రా గారి ప్రశ్న. "ఒకూరి రెడ్డి ఇంకొకవూరికి పసులపోలిగాడు" అనే సామెత అనంతపురం జిల్లాలోవుంట శ్రీ తి. రా. గారికి తెలియంది కాదు. ఒక కాలపు ప్రభువాజ్ఞ ఇంకొక ప్రభుహయాంలో బుట్ట దాఖలు! పరిపాలకులుతెచ్చే సంఘపుమార్పు లిట్లే హాస్యాస్పదంగా ఉంటాయి. "దిలీపుడు సంతానంకోసం పడినపాట్లు నేడు మనం శత్రువుకుకూడా కోరం" అ నిఅంటారు, శ్రీ తి. రా. గారు. దిలీపునికి ఒకటికూడ సంతానం లేదుకాబట్టే ఆ త్రిప్పలు. ఏమీ సంతానం లేనివారు నేడుకూడ అట్టి పాట్లనే పడుతుంటారు. ఈ సార్వకాలిక సత్యాన్నే కాళిదాసు చిత్రిస్తాడు. ఫామిలీప్లానింగ్ అంటా మా అది వేదాల్లోనేవుంది. "చిన్నకుటుంబం చిన్మయానందకుటుంబం" అనే నేటి నినాదసారం మహాభారతంలో దీర్ఘ తమప్రద్వేషిణుల కథలోను అనంతుని "భోజరాజీయం" లోని చూడగలం. ఇవికవుల క్రాంతిదర్శిత్వాని తారకాణలుకావా ? దార్శనికులు శంకరరామానుజ మధ్వుల తత్వాలు నేడు గాలికి కొట్టుకొని పోయాయే ? దానికేమంటారు? ఈశ్వర చంద్ర విద్యాసాగరు, వీరేశలింగంల సంఘసంస్కరణా ప్రయత్నాలు చదివితే నేడు మనకు నవ్వు, జాలితప్ప నిజమైన గౌరవ భావం కలుగుతుందా ? ఎన్మిదవ శతాబ్దాన శంకరుని అద్వైతం, 11 వ శతాబ్దాన రామానుజుని విశిష్టాద్వైతం, 13 వ శతాబ్దాన మధ్వునిద్వైతం రావడానికా కాలపు సంఘపరిస్థితులేవి ? ఏవీలేవు ! ఒకటే పరిస్థితి !! ఆయాకాలాల్లో ఆవిధంగా భాసించిన దార్శనికులుండడమే అని నాభావం. గొప్ప గ్రంథమున్నందువలననే సాంఘిక పరిణామంరాదు. కోడికూసినంత మాత్రాన తెల్లవారదు. తెల్లవారుట ప్రకటించుకోడికూత. అటులనే ఒక ఉద్యమం మూలకంగా గొప్ప గ్రంథం రాదు. గ్రంథం, ఉద్యమం రెండూ ప్రజలనుండే వస్తాయి. ఉద్యమంకూడా ఒక్కనివల్లరాదు. చారిత్రావసరముల బలిమివలన, పరిస్థితీ పరిపక్వత మూలమున, ప్రజల సమిష్టి ప్రయత్నమువల్లనే వ్యవస్థ మారే ఉద్యమం వస్తుంది. అంతేకాని ఏదో ఒక "హీరో" త్రొక్కలాట లాడితే ఉద్యమం సాగదు. సంఘం ఎట్లు మారుతుంది? ఎవడో, ఒకడుకాని, కొంతమందికాని ముందు భావింపవలెను, మాట్లాడుకొనవలెను, తర్వాత ఆచరించవలెను. ఈ మూడు "రింగుల" గొలుసులో కవి ఒక "రింగు" అవుతాడు. కవి మంచిదే చెబుతాడు. ఎవరూ వినకపోతే ఏమిచేయగలడు ? మహాభారతం చివర వ్యాసుడు "ఇది ధర్మమురా, ఇది అధర్మమురా అని చేతులు పైకెత్తి ఎంతమొత్తుకొన్నా వినకపోతిరికద్రా" అని ఆక్రోశిస్తాడు. పైగా హితం, కర్తవ్యంచెప్పే రచయితను కార్యములపాల్జేసిన సంఘ సంస్కర్తలు పాలకులు ఉన్నారు. దోస్తవిస్కీ, సోల్జనిత్సిను, మెండెల్స్టాం, లీహంట్ వంటి కవులను పరిపాలకులిడుములపాల్జేసిరి. గయార్డనో బ్రూనో వంటి మానవతా వాదిని సంస్కర్త కెల్విన్ పెట్టిన కష్టములంత ఇంతా ? అసహనత, శౌర్యము, అజ్ఞానం, జులుంలు దార్శనికుల, సంఘసంస్కర్తల, పరిపాలకుల నైజాలైతే, సహనత, వినయం, జ్ఞానం, ఉదారత కవిగుణాలు. ప్లేటో, అది

స్టాటెలు, అక్వినాస్, గ్లాడ్‌స్టనులు లేరనుకొందాం. పాశ్చాత్య నాగరికత కేమీ లోటువుండదు. హోమరు, సాఫోక్లిస్, డాంటే, డికెన్సులు లేరనుకొందాం. పాశ్చాత్య నాగరికత ఏదీ? మాంధాత, అక్బరు, రాజారామమోహనరాయలు లేకుంటే ఫర్వాలేదు, వాల్మీకి, తులసీదాసు, రవీంద్రుడు లేకుంటే భారతీయ సంస్కృతిఏదీ? దార్శనికులు, సంస్కర్తలు, పాలకులు తెచ్చిన మార్పులు మరుగున పడిపోతాయి. చివరకు మిగిలేది కవివాక్కే. అందుకే వాల్మీకి తన కావ్యం సూర్యచంద్రులు, నదీపర్వతాలు ఉన్నంతవరకు ఉంటుంది అని ధీమాగా చెప్పినాడు. కవులలో కవియైన ఏసుక్రీస్తు ఇట్లంటాడు: Heaven and earth shall pass away; but my words shall not pass away. "స్వర్గలోకం, భూలోకం తుడిచి పెట్టుకొని పోవచ్చును నా వాక్కుమాత్రం ఉంటుంది." తుదిలోనుంచే ఈవాక్కు మొదటనుండీ ఉంది. In the beginning was the word, and the word was with God and the word was God. ఈ Word (శబ్దం) యే ఆదికవిత్వం. ఇది పార్వతీ పరమేశ్వరుల వంటిది. శివకేశవుల (పార్వతీప, రమేశ్వరా) వంటిది. సంఘంలో కొన్ని మార్పులు తెచ్చేదానికి తక్కలాటలాడే కొందరు Busibodies ను కవులు అనుసరిస్తారనుచు ప్రోదిచేసి పెంచుతున్న శ్రీ తిరుమల రామచంద్రగారి గాదిలి సిద్ధాంతముతో ఏకీభవింపను. "నాయకు"లని కొందరికగ్రతాంబూలంఇచ్చి, కవులను రెండవ శ్రేణి పౌరులను చేయుట, ఆకార వేష భాషల్లో ప్రోసాయిక్‌గా వుండే గాంధీజీని ("నాయకుడు") మళ్ళా నిజమైన కవి అనుట నా నిర్వచనం ప్రకారం, దృక్పథం ప్రకారం గాంధీజీకవే. చూడండి నా "మనిషిని స్వావలంబునిగ......భావమే కావ్యం." తత్కాలీన సాంఘీక పరిణామాన్ని (అన్నభార్య తల్లి సమానురాలగుట) వర్ణించిన రామాయణం ఇప్పటికీ ప్రచారంలో వుండేందుకందలి ఆదర్శాలేవో కారణాలనుట, ఇదంతాచూస్తే, శ్రీ తిరుమల రామచంద్రగారిని, నిశ్చిత అవగాహనతో, "కవిత్వతత్వం-కావ్యప్రయోజనం" అను విషయం పై వ్యాసం వ్రాయండని అర్థించబుద్ధి పుడుతూన్నది.

చుక్కలు మూడు!

విహారి & శాలివాహన

నిన్న మొన్న నిర్లక్ష్యంగా విసిరేసిన
చింత పిక్క — ఇవాళ,
పెళ్లను చీల్చుకొని, ఇంచక్క
నవనవంగా ఆకాశం కేసి చూస్తోంది —
అది నా ఆశ!!

* * *

ఎక్కడో బండరాళ్ల గుండెల్లో ఉబికిన
సెలయేరు — ఇక్కడ,
ఆకాశ నీలాన్ని బంగారు ఇసుకలో
తళుక్కుమనిపిస్తోంది —
అది నా ప్రవర్తన!!

* * *

కనిచీకటివేళ గుడిచుట్టూ తిరిగొచ్చిన తోచనితనానికీ,
అర్ధరాత్రి ముడుచుకు పడుకున్న ఒంటరితనానికీ,
'మనస్సు బావులేకపోతే ఉలికి ఆరేసుకో'మని
అలవోకగా సలహా యిస్తోంది,
ఆకాశంలోని ఆఖరి చుక్క —
అది నా ఆశయం!!

* * *

ఈ 'సీక్వెన్స్'ని తలచుకుని
మృత్యువుకు భయపడతాన్నేను!
లేకుంటే,
జీవితం శకటరేఫగా మారుతుంది, మరి!!!

కలగూరగంప

విప్రవర్యా! ఎవరు ?

ఆ. మొదలిరాజు సభయముగ నిట్లు సమరంబు
దొఱఁగి చనియె నట్టె ! పెఱబలంబు
దొరలు నిలిచి పోరు టరిది; యనంతర
వర్తనంబు విప్రవర్య చెపుము.

తిక్కన భారతమున కర్ణపర్వము ద్వితీయాశ్వాసమునందు 397వ పద్యమిది కర్ణుని బారిబడిన ధర్మజుడు చావుదెబ్బలు తిని భయపడి యుద్ధభూమిని విడిచి ఇంటికి వెళ్ళాడు అని ధృతరాష్ట్రునకు సంజయు డెఱింగించినాడు. ఆపై పుటి న దీపద్యం.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు అచ్చు వేయించుటకై శ్రీ మరుపూరు కోదండరామరెడ్డిగారు ఉస్మానియా యూనివర్సిటీ వారి సంశోధిత ప్రతినిబడి పరిష్కరించిరి.

విప్రవర్య అను పదమునకు అధో సూచికలో —"ఇచట సంజయుని ధృతరాష్ట్రుఁడు విప్రవర్య" అని సంబోధించుచున్నాఁడు. సంజయుఁడు సూతుఁడని భారతమున అన్నిచోట్ల చెప్పఁబడినది. విప్రవర్య అనుటకు కారణము ఊహించవలసి యున్నది. భగవద్గీతలో 1అ-7శ్లోకములో "ద్విజోత్తమ" అని పిలువబడి యున్నాడు. గీతా రహస్యములో లోకమాన్య తిలకు సంజయుని సూతుఁడనియే జెప్పిరి.

"సూతులు బ్రాహ్మణ స్త్రీకిని, క్షత్రియునికి బుట్టినవారు. రధకారక వృత్తిలోనుండి కథలు పురాణములు చెప్పి శౌనకాది మహా మునులే ఇంపునం కరగునట్లు ధర్మోపదేశము చేసినవారు" అని దీర్ఘ వివరణమునే యిచ్చియున్నారు. ఇది ప్రమాదవశమున జరిగినది కాదను నమ్మికచే ఈ చిన్నవ్యాసమును వ్రాయుటకు సాహసించుచున్నాను.

సంజయుడు "విప్రవర్య" సంబోధనకు అర్హుడా? అను అపూర్వ విషయము ఈ పద్యమునొద్ద అనవసర మనుకుంటాను. "విప్రవర్య" అనుటకు కారణ మూహించవలసియులేదు. ఎందుకన ఈ పద్యం జెప్పుచున్నది ధృతరాష్ట్రుడుకాదు. "విప్రవర్య" అని సంబోధింపబడుచున్నవాడు సంజయుఁడంతకంటె కాడు.

ఈ ఆశ్వాసము దాదాపు అంతమైనది. ఈ పద్యము తరువాత 'అని అడుగుటయు' అను వచనముతో ఆశ్వాసాంత పద్యములు ప్రారంభమగును. అంతేగాక పై పద్యమునకు పై నగల 396వ వచనమందు అని యిట్లు సంజయుండు ధృతరాష్ట్రునకు ధర్మ నందను పలాయనం బెఱింగించెననుటయు' అని ఉన్నది. ఇచ్చట 'అనుటయు' అన్నదానిలో నున్నదెవరు? భారత కథను మొదటినుండి చెప్పుకొని వస్తున్న వైశంపాయనుడేయని సులభముగనే తెలియును గదా! అతడు అన్నది జనమేజయునితో ననియు జెప్పనక్కరలేదు గదా! ఆ పరిస్థితులలో ఈ పద్యము పుట్టినది. గనుక ఇది జనమేజయుని నోటినుండి వెలువడినదియే గాని శ్రీ కోదండరామిరెడ్డిగారు భావించుచున్నట్లు ధృతరాష్ట్రునినుండి వచ్చినదిగాదు. జనమేజయుడు విప్రవర్య అని సంబోధించినది వైశంపాయనునే. ప్రతి ఆశ్వాసాంతమందును జనమేజయుడు 'అటమీది వృత్తాంతం బెఱింగింపు' మనును. ప్రథమ 319, తృతీయ-396.

తృతీయాశ్వాసము 4వ. వచనమున, యుధిష్ఠిరుండు సనిన పిదప నెత్తెఱంగున సంగరంబు సెల్లె?నని యడిగిన సంజయుండతని (ధృతరాష్ట్రుని) కిట్లనియెనని విపులముగా తరువాతి కథాప్రారంభమునకు వారిరువురి సంభాషణను దిక్కనగారు తెచ్చుచునే యున్నాడు.

'అనంతర వర్తనంబు విప్రవర్య చెపుము' అని అపుడు ధృతరాష్ట్రుడే అడిగియున్నట్లయితే ఈ యింతలోనే తిరిగి అతనిచేత 'యుధిష్ఠిరులతో సనిన పిదప...' మొదలుగాగల వచనమును చెప్పించి పునరుక్తి కల్పించవలసిన అవసరం తిక్కనగారికిలేదు.

మఱియు పద్యమునందు 'మొదలిరాజు సభయముగనిట్లు సమరంబు దొఱఁగి చనియెనట్టె!' నని ఇచ్చట నొక (ఆశ్చర్య) విచార సూచక గుర్తుగలదు. ధృతరాష్ట్రుడే ఈ పద్యము బల్కువాడైన విచారమును జూపించునా? ఒకవేళ అభిమన్యుడు పద్మవ్యూహమున జొఱబడి వధింపబడునాడు

మనమున భేదము మోదము
బెనఁగొనియెడు మద్బలంబుఁ బీడించెడు నా
సునుపుడని వినికి...'

ద్రోణ—ద్వితీ. 40

అన్నట్లు ధర్మజాని పలాయనము నెడ నిజముగా ధృతరాష్ట్రునకు బాధ కలిగినది అనుకొందమన్నను కుదరదది. ఏలనన కర్ణ-తృతీ-3వ పద్యములో

అనిలజునకు జాలడె నా
తనయుడు? మోసంబుగాక ధర్మజుడట్లు
చ్చినంచో నిచ్చుట రాధా
తనయునకున్ బుద్ధియగునె? తప్పెందప్పెన్ !

అని విచారపుగుర్తు ఇక్కడపెట్టి వగచుచున్నట్లు తెలియుచున్నది.

ధర్మరాజును తుదముట్టించు సమయంలో శల్యుడు భీముని చేత బొదువబడిన దుర్యోధనుని జూపి—ఈతనితో నేమి? ముందు ఆతని రక్షించుకోమన్నాడు. అందుచేత ధర్మరాజును విడిచి రారాజును రక్షించుకొనుటకు కర్ణుడరిగెను. ఈ విషయమును ప్రస్తావించి మోసపోయి రాధా తనయుడు ధర్మజుని విడిచిపెట్టాడని 'తప్పెం దప్పెన్' అని ఎంతో తహ తహ వెలిబుచ్చుచున్న మహానుభావుడు 'మొదలిరాజు సభయముగనిట్లు సమరంబు దొఱఁగి చనియెనట్టె! అని విచారమెఱిగించునా? వీలులేదు.

కాన దీని బలుకువారు జనమేజయ మహారాజు. తన వంశస్థుడయిన మొదలిరాజు సమరము దొఱఁగెనా?యని, యుధిష్ఠిరునకు యుద్ధభయమాయని, ఆశ్చర్యమును జూపుచున్నాడు,

'పెఱబలంబు దొరలు నిలిచి పోరుటరిది;' అనుటలో బహుశా ధర్మరాజు పోరు దొఱఁగవలసిన స్థితిని గని, భీమార్జును లక్కడనే యుండగా, సాత్యకి ధృష్టద్యుమ్నులు తోడుండగా 'కో'యని వారిచే వించి చెండాడబడన్ పెఱబలంబు దొరలు యింకను నిలిచి పోరుటన్నది అరిది అని జనమేజయుడు ఆశ్చర్యపడుచున్నాడు కావచ్చును.

ఏమైనా 'అనంతవర్తనంబు విప్రవర్య (వైశంపాయన మహాముని) చెపుమ' అని అడుగుటయు ద్వి—398—; 'దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె.' తృతీయ: 2. అనియు, విపులముగనే యున్నది. గనుక ఈ పద్యమును బలికినవారు జనమేజయుడు; విప్రవర్యులు వైశంపాయన మహామునుడే; కాని శ్రీకోదండ రామ రెడ్డిగారు భావించునట్లు ధృతరాష్ట్రుడు విప్రుడుకాని విప్రుని సంజయుని అడుగుటలేదని స్పష్టమని సవినయముగ మనవి చేసికొన సాహసించుచున్నాను.

—శ్రీ శిరివెల్ల యూసోబు

కలువకొలను

"అలంపురము నంది అందమైన నంది, కలువకొలను నంది ఘనమైన నంది, వడ్డెమాను నంది వడుపైన నంది" — అని ఈ ప్రాంతమున నందులపై నొక సామెత యున్నది. ఈ సామెత యందలి సత్యమును కలువకొలనులో నందిగుడి సమీపమున భూమిలో దొరికిన నందిని జూచిన పిమ్మట కాదనువారుండరు. నిజమునకా నంది ఘనతనమున అలంపురము వడ్డెమాను నందుల కంటె ఎన్నియోరెట్లు ఘనమైనది, మరియు పరిమాణమునగూడ ఏమి తీసిపోదు. వేయి స్తంభాల మంటపమందలి నందిగూడ ఇంత సుందరముగా జీవరేఖలతో నుండదన్న అతిశయోక్తి కాదు. త్యాగరాజుగారు వాతాపి గణపతిని, బాపిరాజుగారు లేపాక్షి బసవని మా తమే జూచిరి గాని. వానివలె స్తుతి పాత్రమైన గణపతి మూర్తులు నందీశ్వర మూర్తులు ఈ ప్రాంతమున పెక్కులున్నవి.

ఈ గ్రామమొకప్పుడు నాగర కందనవోలు తాలూకాలో నుండెను. నేడు కొల్లాపురమునకు మారినది. కొల్లాపురమునకు మొదటిపేరు కొలనుపురము. ప్రస్తుతము కలువకొలను నందికోట వెలుపల పూర్వమొక పెద్దకొలను మఱియు అందు కలువలుండెనట. ఆ కొలనున దినమొక కలువ వికసించెడిదని ఆ కలువతో కోటయందలి నందీశ్వరాలయమందలి దేవుని పూజించుచుండిరి.

ఆంధ్ర సచిత్ర వార పత్రిక

— చందా వివరాలు —

విడి ప్రతి వెల ... 0 - 60 పైసలు

	న్యూస్ ఏజంటుద్వారా	పోస్టుద్వారా
	రు. పై.	రు. పై.
సంవత్సర చందా	31–20	33–80
అర్ధ సంవత్సరం	15–60	16–90
మూడు మాసములకు	7–80	8–45

మేనేజరు
ఆంధ్రపత్రిక

ప్రాచీనులు చెప్పుచుండిరి ఈ కొలనునుబట్టియే గ్రామమునకు కలువకొలను అని వ్యవహారమేర్పడెను. ఆ కొలనునకు సమీపమున నున్న పల్లెను కొలనుపురమని పిలిచిరి. అదియే కాలాంతరమున కొల్లాపురమై సురభివంశీయులకు జటప్రోలు పిమ్మట రాజధానియయ్యెను.

కలువకొలను పూర్వము గొప్ప పట్టణము మరియు రాజధాని. ఆ నాడిది మిక్కిలి ప్రశస్తిగాంచిన పట్టణము. స్థానిక జానపదులలో ఒక పుష్పసుందరి (గులేబాకావళి) కథకిది నిలయమని చెప్పిన ఆనాడిది ఎంత గొప్పగా మరియు వైభవముగా నుండెనో ఇక వేరుగా జెప్ప నవసరముండదు.

ఈ గ్రామమున ప్రస్తుతము గనిపించు కోట జాడకు నంది గుడికోట యనిపేరు. ఆ కోటలో పూర్వము రాజభవనములు మంత్రుల నిలయములు మరియు పెక్కాలయములుండెను. అందన్నిటికి తలమానిక మైనది నందీశ్వరాలయము.

ఈ ఆలయమున శివప్రతిష్ఠ దొంతరలు దొంతరలుగా నున్నది. ఒకదానిపై నొకటిగా నైదు శివప్రతిష్ఠలున్నవట. పూజా సమయమున పై శివునకు గావించెడు నభిషేక జలము క్రిందుగా నుండెడు అన్ని శివలింగముల నభిషేకించునట. మహమ్మదీయుల కాలమున వారిది దొంతర ప్రతిష్ఠయని తెలియక పైపానవట్టమును మాత్రము పగులగొట్టి వెళ్ళిరి. అది గిన్నె బోరలించినటు లుండెను. నేడు భక్తులు వారు పగులగొట్టిన పాన వట్టమును తొలగించినారు దానిక్రిందనున్న శివప్రతిష్ఠ సురక్షితముగా నున్నది. ఇది ఈ ప్రాంతమున శివ ప్రతిష్ఠయం దెచటను లేని విశేషము.

ఈ ఆలయము నేడు గ్రామమునకు కోశమాత్ర దూరమున నుండును. ఇందలి నంది శ్రీశైలమునందలి నందీశ్వరునకు తమ్ముని వలె నుండును.

ఈ గుడిముందు మరియొక నంది యున్నది. దానిని దుండగులు నడిమికి రెండు తునకలుచేసి వేయ ప్రజలా తునకలను జోడించి గుడిముందుంచిరి. ఆతునకల నడుమ వేలుదూరునంత సందుండెను గాని క్రమముగా నేడది పూడిపోయి నంది ఏకశిలయైనది. అది రెండు తునకలవలె గనిపింపదు. ఇదియొక విచిత్రము.

ఈ గుడి చెంత ప్రస్తుతము పెక్కు శాసనములున్నవి.

అందొక శాసనము సామాన్యమైన నల్లజాతిపై చెక్కబడినది. అది ఒకానొక వ్యక్తి ఆ యాలయమున కొనర్చిన భూదాన శాసనము. అందుశకము పేర్కొనబడలేదుగాని దాని లిపి రేనాటి చోళుల శాసన లిపింబోలి ఈ ప్రాంతమున కంతటికిని ప్రాచీన మనదగియున్నది.

ఆ ఆలయము ముందే మరియొక శాసనకంబమున్నది. అందు చెఱుకురెడ్డి వంశావళి యున్నది. శిథిలమైపోయిన జలాలు పూర శాసన విషయముల నీ శాసనము పూరించును. ఇది చెక్కు చెదర కుండ నున్నది. కాని ఏకారణముననో గుండాచార్యుడు దాని నసంపూర్ణముగనే వదలినాడు.

ఆలయము ప్రక్కన నొక వీరగల్లుపై వీరుడొకడు అశ్వారోహకుడై కత్తి ధరించియున్నాడు. దానిపై అతని వివరమునకు సంబంధించిన శాసనమున్నది.

నేటి నల్లగొండ పాలమూరు మండలములు పూర్వము గడి మండలములుగా నుండెనని ఆచార్య ఖండవల్లి వారు, బాణరాజుల కాలమునుండి వీరగల్లులు వెలసినవని శ్రీ తిరుమల రామచంద్రగారు, తెలంగాణమున వీరగల్లు లెక్కువయని శ్రీ లక్కిరాజుగారు నుడివియుండిరి కనుక తెలంగాణమున వీరగల్లు అధికమైన యందీ ప్రాంతమున ఏవం విధమైన రేవంతులు ఎక్కువ.

ఆలయమున నీ యశ్వారోహకుడేగాక ఇంకను కొందరి వీరగల్లు లున్నవి. అందు మెడలో రుద్రాక్షమాలలు. చేతులందు శివలింగములు ధరించిన యిద్దరు వీరులున్నారు. వారిని జూచి పురాతత్వ శాఖ అసిస్టెంటు డైరెక్టరు శ్రీ పి. పరబ్రహ్మశాస్త్రిగారు ఆ వీరులు చెఱుకురెడ్లగుదురని వారు మారారెడ్డి కాటారెడ్డి కావచ్చునని అభిప్రాయపడిరి ఆ వీరగల్లుల తీరునుబట్టి చూడ వారి యూహ సమంజసమనియే తోచును.

అచట నా యిద్దరివేగాక మరియొక వీరగల్లున్నది. అందలి వీరుడు వడి మీసముతో చేత పొడుగాటి కత్తిని ధరించి నిలుచున్నాడు. బహుశా అతడు చెఱుకు ప్రోలయరెడ్డిగావచ్చునని మా విశ్వాసము. ఈ వంశమున నతడు ప్రసిద్ధ పురుషుడుగ గనిపించును. అతడు కలువ కొలని ప్రసన్న వల్లభదేవరకు గావించిన దానశాసన మొకటి ప్రస్తుత గ్రామమునందలి ఆలయము ముందున్నది. ఈ ప్రాంతమున ఇతనిపేర పోలేపల్లి (ప్రోలపల్లె) అను గ్రామముగూడ వెలసినది. ఇతని శాసన మొకటి హంపియందు స్వసింహస్వామి చెంతనున్నది.

ఈ వంశమున మరియొక ప్రసిద్ధ పురుషుడు బొల్లయరెడ్డి. అతని శాసనముల మరాబాద ప్రాంతమున నున్నవి.

ఈ గ్రామముయొక్క ప్రాచీన చిహ్నములు నేడు అంకిరావు పల్లె వరకు నున్నవి.

కలువకొలను సమీపమందలి కోనరావుపల్లె, చెన్నపురావుపల్లె,

అంకిరావుపల్లె ఒకనాడు అందలి పేటలవలె దోచును. అవి క్రమముగా కోనారావు, అంకిరావు అను దొరలపేరున స్వతంత్రమైన గ్రామములై నేడు కలువకొలను నుండి వేరైనవి.

కోనారావు ఆ ప్రాంతమును రాజుల చేతిక్రింద పాలించిన దొర. అతనిపేరున వెలసినది నేటి కోనరావుపల్లె. ఇతని కుమారుడు వేంకటరావు. ఇతనిపేరున వెలసినది వేంకటరావుపల్లె. అది ఏ కారణముననో నడుమ పేరు మారి చెన్నపురావు పల్లెయైనది. ఇక అంకిరావు కోనారావు సోదరుడు గావచ్చును.

కరుణరసమునకు మారురూపమైన బాలనాగమ్మకథకు నేటి వనపర్తి సమీపమందలి పాగనుల్లే నిలయమని శ్రీ సురవరమువారు తలచిరి. ఆ కథయందలి రాజులు వద్ది వంశీయులు. వీరు వోఢ్రులని, వోఢ్రశబ్ద భవమే వద్దియని వారి యభిప్రాయము. ఈ పానుగల్లు వోఢ్రులైన గజపతులు ఆధీనమందుండెను.

నేడు కలువకొలను సమీపమందలి కోనరావు పల్లె మున్నగు గ్రామములందు వద్దివంశములున్నవి కనుక ఈ గ్రామమొకప్పుడు వారికి కేంద్రముగా విలసిల్లిదనవచ్చును.

పూర్వమీ గ్రామము పట్టణ సదృశమైన జాగీరు కనుక ఈ పేటలు ఎప్పుడెపుడు స్వతంత్రములుగా రూపొందిన, ఆనాటి మహమ్మదీయ ప్రభుత్వము వాటి నప్పుడపుడు ఖాల్సాలుగా ప్రకటించుచు బోయెను.

అందువలన నేడీ గ్రామము తరతరముల రాజుల చరిత్రలను కడుపున జీర్ణించుకొని యొక సామాన్య గ్రామముగా మిగిలిపోయినది.

— శ్రీ కే. కిశోరుబాబు,

శ్రీ కే. అశోకుబాబు.

లేఖ

'అండీ...'

1976 ఏప్రిల్ నెల 'భారతి' సంచిక 'కలగూరగంప'లో శ్రీ తిరుమల రామచంద్రగారు 'అండీ! పుంటికూర! కొండెంగ!' అనే వ్యవహారంలో ఉన్న మూడు పదాల పుట్టుపూర్వాల గవేషణకు పూనుకొన్నందుకు వారిని అభినందిస్తున్నాను.

"సహృదయ భాషాతత్త్వ విచారకులు పై మూడు పదాల మూల గవేషణకు నేను సరికొత్తగా ప్రతిపాదించిన వాదాన్ని పరిశీలిస్తారని ఆశిస్తున్నాను" అన్నారు శ్రీ రామచంద్రగారు.

పై మూడు పదాలలో, మొదటిదైన 'అండీ' కి శ్రీరామచంద్రగారు సరికొత్తగా వాదాన్ని ప్రతిపాదించినవారుమాత్రం కాదని మనవి చేస్తున్నాను. 'స్ఫూర్తిశ్రీ' (టి. భాస్కరరావు) గారి 'తెలుగు భాషా చరిత్ర' అనే గ్రంథంలోని (మూడవ ముద్రణ) క్రియా ప్రకరణం—పుట 354—పరిశీలించినవారికి పై విషయం స్పష్టమవుతుంది. పాఠకుల సౌకర్యార్థం 'స్ఫూర్తిశ్రీ' గారి 'తెలుగుభాషా చరిత్ర' లోని ఆభాగం ఇక్కడ ఇస్తున్నాను —

"అండి" యను గౌరవ వాచకము వ్యావహారికమున విరివిగా గలదు. 'వినుండీ, తెలియుండీ' మున్నగుచోట్ల ఉచ్చారణత్వరనుబట్టి 'వినండీ, తెలియండీ' అను రూపము లేర్పడును. అందలి ధాతువును వేరుచేయగా మిగిలిన 'అండి' అనుదానిని గౌరవ వాచకముగాభావించి 'ఏమండీ' మున్నగు విధముగా సంబోధనాది రూపములందు చేర్చుట కనిపించుచున్నది, అట్లే ఏకవచనమున 'రా' అనునది క్రియలపై చేరి "వినుమురా; వినరా"—మున్నగు విధముగానుండి 'ఏమిరా' యనునట్లు అన్యోపయోగమునుకూడ అలవరచుకొన్నది. —

—'కనక ప్రవాసి'

గ్రంథ విమర్శలు

రాగలహరి (నవల)

[రచన : విజయమూర్తి. పుటలు : 134. వెల: రు. 5 ప్రచురణ : స్పందన సాహితీ సమాఖ్య మున్సిపల్ క్వార్టర్సు, మచిలీపట్నం]

ఈనాటి సాహితీ లోకంలో పండిత పామరుల కందరికీ ఆనంద దాయకమైన పట్టం కట్టుకున్న మహారాజ్ఞి నవల. అందులోను మధ్య తరగతి కుటుంబాల గాథలను అద్దంపట్టినట్లు చూపే నవలలు పుంఖానుపుంఖంగా వస్తున్నాయి. అట్టివాటిలో రాగధార ఒకటి. స్నేహమాధుర్యాన్ని బాంధవ్యంగా మార్చుకొని, తమ ఆశలను, ఆశయాలను తమ పిల్లలకు వంటబట్టించటానికి యత్నించేసి విఫలురై చివరకు ఆ పిల్లలతోనే రాజీపడి సరిపెట్టుకున్న రాఘవరావు, రమణ మూర్తుల కథయిది. సుపుత్రుడైన చలపతి రాఘవరావు చెప్పుచేతల నుండి తెలిసే దాటిపోగా, రమణమూర్తి పెద్దకూతురైన సరోజ ఆయనకు తెలియకుండానే తండ్రి అదుపాజ్ఞలు దాటిపోతుంది. విశృంఖల ప్రవృత్తి కలవడిన చలపతి పెళ్ళి పెద్దపోజులో సరోజకు ఆమె ప్రేమికుడు మాధవరావుల వివాహం చేయించి, తిరిగి తలిదండ్రులను చేరతాడు తప్పుచేశాననే భావన వుంటంవల్లకాబోలు, అనాకారియయిన రమణమూర్తి రెండవ కూతురు నిర్మలను చేసుకుని, తనవారి కూరట గల్పించాలని చూస్తాడు. అప్పుడే నాడూ పదుగురిలో మాటాడి యెరుగని నిర్మలచేత మాటలాడించి, నవలకు ముగింపు నిచ్చారు రచయిత.

పిల్లల పెంపకం, తల్లిదండ్రుల బాధ్యతలు అన్న ప్రధానాంశం యీ నవలకు ప్రాతిపదిక. యువతరంలోని నేటి వైక్లబ్యాలకు హేతువైన సమస్య ఆధారంగా సాగిన కథ అయినా తీర్పు హృదయాలకు పట్టేటట్లు చెప్పబడలేదు. ఇతివృత్తం బాగున్నా కథనంలో పటిమలేదు. కొన్ని సన్నివేశాలు పేలవంగా వున్నయి. వినాయకరావు మనస్తత్వ చిత్రీకరణ అసమగ్రంగా వుంది. ఇందులో ఏ పాత్రగూడ పాఠకుని మనసులో మాయని ముద్రవేసుకోదు. ఏదో చెప్పాలనే తపన వున్నది గాని, కథన కౌశలం రచయిత కింకా పూర్తిగా పట్టువడనట్లు తోస్తుంది. ప్రాసంగికంగా /అక్కడక్కడ అందించబడ్డ సూక్తులు సందర్భ సుందరంగా వున్నాయి. "కరెంటు పోయినప్పుడు వెలిగే దీపాలారినట్లు "వంటెపోలికలు" తొందరపడుతున్నాడనికాదు తొందర పెడుతున్నాడని" వంటి భాషా ప్రయోగాలు రమణీయంగా వున్నాయి

నవలా వస్తువు సామాన్యమైనది. కాని సన్నివేశాలు బలంగాలేవు. ఉదాహరణకు చలపతి తల్లిదండ్రులను ధిక్కరించే నైజం కలవాడని చెప్పటానికి మరికొన్ని పటిష్టమైన సంఘటనల కూర్పు వుండాల్సింది. చలపతి తల్లిపాత్ర సుపుత్రుని గారాబు చేసిందనటానికి బలమైన ఆధారాలు కావాలి. సరోజ మాధవరావుల పెళ్ళి హటాత్పతితంగా పాఠకునికి తోస్తుంది. అందుకు సరియైన పూర్వరంగం కాన రాదు. భావుకత, భాషాపటిమగల యీ రచయితనుండి మున్ముందు మరింత పటిష్టమైన నవలలు వెలువడతయని, అందుకు యిప్పటి లాగే స్పందన సాహితీ సమాఖ్యవారు చేయందిస్తారని ఆశించటం అత్యుక్తిగాదు.

జీవనఘోష (నవల)

[రచన : శిష్ట్లా కృష్ణమూర్తి. పుటలు : 172. వెల : రు 6—50. ప్రచురణ: ఉజ్జ్వల పబ్లికేషన్సు, కర్నూలు.]

జీవనఘోష నవల వాస్తవానికి ఒక మనిషి అంతరంగిక క్షోభ. అడుగడుగునా ఆత్మాశ్రయత వెల్లివిరిసిన నవల. తనకేం కావాలో తెలిసినా, దాన్ని సాధించుకోలేని, పలాయన వాదాన్ని ప్రదర్శించే ఒక అమాయకుని ఆరాట పోరాటాలు కథావస్తువు ఆద్యంతం వచన కవితా ధోరణిలో పాఠకుల గుండెను పిండేశైలితో, మరో 'రావిశాస్త్రీ' ఫక్కీలో చదివినవారికి ఆలోచనను, ఆవేదనను సమపాళ్ళలో సమర్పించిన గ్రంథం. ఆధునిక నవలా నిర్మాణంలో అంతరంగ విశ్లేషణం **(Psycho analysis)** సరికొత్త ప్రయోగం. అంచేత అది ధీమాన్యులకు నచ్చుతుంది కాని సామాన్యులకు దూరంగా వుంటుంది. రాతి బొమ్మలాంటి నాతితో మనుగడసాగించలేని నిర్లిప్త వైఖరి. అలా సరిపుచ్చుకోలేని ఇంద్రియ లోలమైన మనస్సు చిత్రహింస పెడుతుండగా, విధి వశాన ఆ భార్య మరణించగా, నిండు మనసుతో తన జీవితంలోకి మరోవనితను కోరి, తిరస్కృతుడై విధివంచితుడైన మరో 'అల్పజీవి' యీ కథానాయకుడు రామకృష్ణ. ఆశయాలు ఆకాశ విహంగాలు కాగా వాటి నందుకోలేక పరిస్థితులకు బానిసయిన ఈ సగటు మనిషి జీవితాన్ని రసస్పందన నొసగే రీతిలో ఆవిష్కరించారు రచయిత. 'ఆరార్' పాత్రద్వారా నేటి సాహితిమూర్తుల దర్శన ప్రసంగాలు చేయించడమే కాకుండ, వర్ధమాన రచయితల వేదనలను, శోధనలను వినిపించారు. కవితలో వ్యక్తి నీతికన్న సామా

జిక శేయస్సు ప్రధానమని సందేశాన్నివ్వడం నేటి రోజుల కనుగుణంగా వుంది.

ఆవేదనలోంచి అక్షరం ఆవిర్భవిస్తుంది. నాటి వాల్మీకంనుంచి నేటి విప్లవ కవితవరకూ అదేస్థితి సాహిత్యంలో ఈ సత్యాన్ని రామకృష్ణ జీవితానికి సాహితీ సృజనకు ముడివేయబడింది. ఇంతటి సరస హృదయుడైన రామకృష్ణ శైలజపట్ల తన వర్తన పరివర్తన గావించుకొని, ఎందుకు మనలేడో అనూహ్యం. పైగా శైలజ భర్త పట్ల చేసిన పెద్ద అపచారం కూడ పాఠకుడికి గోచరించదు ఆమె మరణించినప్పుడు 'దాని పాత్ర అది నిర్వహించి దాటుకుంది' అని వేదాంతిలా ప్రవచించడం సబబేనా? బతికివుండగా శైలనుసంస్కరించలేని అతని మనసు తదుపరి ఆశాలతను వాంఛించడం, తిరస్కృతుడై బాధపడటం 'చేతులు కాలాక' సామెత స్ఫురణకు తెస్తుంది. పిరికివాడైన రామకృష్ణపట్ల మనకు సానుభూతి కలగదు. ఒకవేళ కొద్దిగా కలిగినా శైలపట్ల అతని వర్తనలోని గడుసుతనం గోడ లాగ నిలుస్తుంది. ఈ ద్వైవిదీభావానికాస్కారమిచ్చేది రామకృష్ణ శీలం. పిరికివాడైన ఈ కథానాయకుని పాత్రను రసవంతంగా మలిచారు రచయిత.

ఈ రచనలో ఆంగ్లపదాలుండటం (అవీ యెక్కువ మోతాదులో) కథాగమనాని కవరోధంగావుంది అనిపిస్తుంది మామూలు పఠితకు. బరువైన భావుకత, బలమైనభాష, పదునైన శైలితోగూడిన యీ రచయిత తానే చెప్పినట్లుగా, అనుకరణను తగ్గించుకొని, స్వీయవ్యక్తిని ప్రదర్శించే మరికొన్ని నవలను సృజిస్తే, జీవితాన్ని సక్రమంగా దిద్దుకోలేని పిరికివాడైన రామకృష్ణవలె కాకుండా, నవలా రచనా జీవితాన్ని సందనభరితం చేసుకుంటారు. ఆ లక్షణానికీ నవల లక్ష్యం.

కథలు

[(21స్ట్ సెంచరీ రైటర్సు సంకలనం) పేజీలు : 130. వెల : రు. 4.00. ప్రచురణ : 21స్ట్ సెంచరీ రైటర్సు, 26-3-22. దాసన్నపేట, విజయనగరం.]

సమాజంలోని ఎగుడు దిగుడులు పోవటానికి సకల జన సమావత్వమే దారి అనే సిద్ధాంతంతో, తమ రచనలు సూటిగా ప్రతిమనిషిని పలకరించేట్లు వుండాలని సిలపం, టెకినిక్కులు తమకు సధానం కావని, కొందరు యువభావుకులు తమ గుండెలోని గొడవలు గోచరింపజేసిన కథా సంకలనంయిది. ఇందులోవున్న పదిహేను కథలు సంఘంలోని అక్రమాలను, అవినీతి అన్యాయాలను చిత్రికపట్టి చిత్రవధ చేసిన రచనలే. సహజత్వం కొట్టొచ్చినట్లున్న యీ రచనల చివర వెనుక మాటలో కళలనుగురించి, కవిత్వాన్నిగురించి, ఆడవాళ్ళ అభ్యున్నతినిగూర్చి, కృత్రిమ వ్యత్యాసాలను గూర్చి వీరి విసుర్లు, 'పాత' ను పట్టుకుని పాకులాడేవాళ్ళకు నచ్చకపోవచ్చుకాని వీరి చిత్తశుద్ధికి, లోకాను శీలనకు నిదర్శనాలుగ వున్నాయి. సమాజంలో మార్పు, సమత రావాలంటే స్పీచులవల్ల రావాలని, రచనలవలన కాదని వీరంటారు. భారతదేశంలో స్పీచులవారే ఎక్కువైనారనే ఆరోపణవుంది. మరి వీరేమంటారో దానికి ?

ఈ సంకలనంలోవున్న కథలలో ఎక్కువ భాగం దొంగస్వాముల వార్లమీద, అసలు స్వాముల పూజలో, అభాగ్యజనుల ననాదరించే ప్రవృత్తులమీద, రాజకీయాలమీద, ఆఫీసుల్లో జరిగే అవినీతిపనుల మీద ఆయుధం సారించబడ్డది. కొన్ని అసలు కథలేకాదు. రచయిత తొంగిచూస్తున్న స్వగతాలు. ఆరార్ట్ తిరిగిరాని గాడిద అలాంటి మనుషులకు చక్కని సెటైరు. దరిద్రనారాయణులసేవ స్వాముల సేవ కన్న మిన్నయని ఘోషించినది రెండవకథ. కోతిబుద్ధిన్ కథ రామాయణంలోని రాముడిమీద విసురు. 'తనదాకావస్తేనేగాని' అన్నమాటకు రూపకల్పన. 'గర్భగుళ్ళో గాంధీ' కథ భవిష్యత్తుకు ఊహాకల్పన. కాని అసలు జనానికి భవిష్యత్తులో గాంధీ గుర్తుంటాడా ? అని నా సందేహం. 'రాంబందులు' బడుగుబడి పంతుర్ని పీక్కుతినే లంచాల వంచకులకథ. 'జూలో నిజాలు' రచయిత స్వగతం. కథావస్తువులేదు.

కాకాకథకూడ కొత్తదనంలేని వింతకల్పన. డాక్టరు భూకంపం జనాన్ని హరీమనిపించే వైద్యనారాయణుని విశిష్టత. దీనిలో కథా శిల్పం పుష్కలం. రెండోభాగంలోని కథలు సారాకథతప్ప మిగిలినవన్నీ మరీ మినీకథలు. 'ముష్టివెధవలు' భిక్షుకవృత్తిని మరో విధంగా నిర్మూలించే ప్రభువులకు చురక. 'బాబాగారి బాల్చి' కూడ అందరికీ దేవుడైన బాబా రక్తం దొరక్క దిక్కులేని చావు పొందటం చూపిస్తుంది. మతిలేని మృత్యువుకు అందరూ నొకటేననే సంగతి మనుషులకు తెలియదుగదా! గణేష్ స్మృతి వ్యంగ్యకవిత. ఇది కథల్లో ఎందుకు చేర్చబడ్డదో తెలియదు. కథాకవిత అనుకోవాలి ఆస్తికత, నాస్తికతల సంఘర్షణలో నేటి రోజుల కనుగుణంగా నాస్తికత నెగ్గడం కళ్ళకు చూపినడివినిటే కథ, దేవుడి అడ్డుగోడ కథలు మధురంగా వున్నవి. ముళ్ళచిక్కులు ముళ్ళవంటి డాక్టర్లను చూపించిన కథ. ఒకే సారాసారో కథ శీర్షికలో 'రావిశాస్త్రి' గారి ఛాయలువున్నా, భావనా బలంకల మంచికథ. పాటక జనాలవృత్తి ప్రవృత్తులను విశ్లేషించి చూపిన చక్కని కథనం.

ఈ రచయిత అందరిలోను సమాజాన్ని సంస్కరించాలని తపనా, అందు కేదో చెప్పాలని ఆవేదనా, పదునైన భాష, పసందైన కథాశిల్పం వున్నాయి. రచయితల్లోని ఆ నిజాయితీ చాలు, లక్ష్యసిద్ధి కోసం యిలాంటి మరికొన్ని పుస్తకాలు ప్రచురించి సమాజంలో సమతను తెచ్చేందుకు యత్నించటానికి. సామాజిక రుగ్మతలకీ టానిక్ రైటర్సు మంచి మేతలనిచ్చి మెదళ్ళను మార్చుతారని ఆశించవచ్చు.

బాకీ బాకా

[(కథా కవితల సంపుటి) పేజీలు : 60. వెల : రు 3-00 రచన : నిష్ఠల వెంకటరావు]

21స్ట్ సెంచరీ రైటర్సు సంఘానికి చెందిన యువ భావుక కవి నిష్ఠల వెంకటరావుగారి కవితల కూర్పు యీ పుస్తకం. "అద్భుద్భుద రోజులో వాటికి లేని నడుము విరగ్గొడ్తం శిల్పమ్" అని శ్రీశ్రీగారి ఫక్కీలో అంటూ, "కోతల్ కోసేవాడు శిల్పమే వాడి తిరుతాడు" అని తీర్పుచెబుతూ తన కవిత్వాన్ని పాస కీడలతో వినిపిస్తూ సమాజంలోని అపహాస్యాల్ని హాస్యంతో రంగరించి అందించారు యీ గ్రంథంలో. ఇందులో 20 ఖండికలున్నాయి. శీర్షిక భావం అగమ్యంగా వుంది. సమాజానికీయన యివ్వవలసిన బాకీని బాకాలాగా విని పిస్తున్నాడని సరిపుచ్చుకోవాలి.

మొదటి ఖండిక 'కవ్వల తక్కెడ' తెలుగు దేశంలో వ్యాప్తమైన వాడుకకు కమనీయ వ్యాఖ్య 'కోర్కుల్లో ఒప్పందాలు చూచి కంటగింపు అయి బియిడి చద్యి నేను బరిమేష్టరు నయ్యేదన్' అంటారు వీరు. బడిమేష్టరు కంటికింపుగా వుండొచ్చుగాని అందులో మాత్రం ఒప్పందాలు లేవూ? "పాత పక్షప తికలు. పక్షపాత పత్రికలు" అని పత్రికలవారిమీద పదునైన ఛలోక్తి విసిరారు. కొన్ని పదాలు కేవలం ప్రాసకోసం కూర్చబడ్డట్లున్నయి గాని అర్థవంతంగా సందర్భ శుద్ధిగా లేవు. ఉదాహరణకు, "ఈ కేసులో ఎవరయ్యా అగ్రీవుడు, అతనేసార్ వాలి తమ్ముడు సుగ్రీవుడు, " లాంటివి. 'సంగీతం సంగతి' ఖండిక హాస్యానికి తారస్థాయి. అయితే "ఏమాశ్చర్యంపాడితే రాగానంద, అతని పెళ్ళాం తంతానంద"లాంటివి సంగీతకళను తెగడుతున్నట్లున్నాయి. రైటరు, ప్రొప్రైటరులో మహాకవులు మొదట మామూలు కవులేనని వాళ్ళకు తోపుడు గాళ్ళున్నారని ఆరోపణ. ఇది నేటి కాలపు ఎక్కువమంది రచయితలకు బాగా వర్తిస్తుంది. ఒరిజినాలిటీ వున్నవ్యక్తి ఎప్పటికయినా రాణిస్తాడు.

"దేశదిమ్మరీయం"లోని వింతలు నవ్వుకోడానికి పనికొస్తాయి తప్ప, లక్ష్యశుద్ధి అంతగాలేనివి 'సూదిమ క్కావళి' సుమతీ శతకంలోని పద్యాలకు సూదుల్లాంటి పేరిభాష్యాలు. "ఉద్యోగములేని నరుడు పద్యములను రాసి బతుక. పద్యముగ డిమాండు లేమిచోద్యముగాదె" అన్నమాట రసవంతంగా వుంది. మూరు దుమూరు చరితం, మండ గబ్బ మూర్ఖుల అధికార దుర్వినియోగాన్ని చూపే ఖండికలు. అన్నిటి లోకల్లా గొప్ప భావనా బలంకల ఖండిక "ఆ-కలికిచావు" శీర్షిక విరుపులోనే వుంది శోభ. "మనిషంటే భయం ఆకలికి ఆకలంటే భయం మనిషికి" అన్న యెత్తుగడయే సుందరంగా వున్నది "మన్మతిను" అనేది సమతా మమతల్ని పెంచే సందేశం. "మన్మతిని బతగ్గ లిగిన్నాడే మనుతుంది సమాజం" అనే వీరి ఆకాంక్ష ఆమోదయోగ్యం. నా భాషేనే కోరేది "నా తెలుగే నా గొప్ప" అన్నది మధుర మనోహరమైన మన తెలుగుదనంమీది వీరి రక్తికి ఆసకి పొంది, చివరగా రాసిన మణిప్రవాళంలోని సంస్కృతాంధ్ర సమ్మేళనాన్ని చమత్కారంగా చేజిక్కించుకుంటాం. అదియిది.

"దురదనే గోకడం చైవతక్షణం సుఖమేవచ
అనంతరం మంట మాప్నోతి ఇత్యేవదురదలక్ క్షణం"

సరళమైన శైలిలో, ఆత్మీయంగా 'ఐ లవ్ యూ' లనే ఈ ఏకలవ్యుని భావాలు వచనకవిత అంటే చెవి కోసుకునే వాళ్ళకు విందుగా వుంటాయి. అయితే ఈ భావాలలో ఆరుద్ర, జలసూత్రంల ప్రభావాలు ఛాయగా గోచరిస్తున్నందున ఆరోగ్యకరంగా రచయిత ఎదగటానికి అవరోధమవుతాయేమో! అనుకరణకు స్వస్తిచెప్పి స్వీయ వ్యక్తిని పెంచుకొని, నలుగురుమెచ్చే అచ్చమైన కవితలు ఈ మాట వాడి, మనసు వేడిగల ఈ రచయితనుండి రావాలి.

శిలలో సెలయేరు (కథల సంపుటి)

[రచన : విహారి & శాలివాహన. పేజీలు : 100. వెల : రు. 4-00. ప్రచురణ : స్పందన సాహితీసమాఖ్య. 23/182/E న్యూ మున్సిపల్ క్వార్టర్సు, మచిలీపట్నం.]

కవితారంగంలో తిరుపతి వెంకట కవుల్లాగ, కథారంగంలో వీరవిహారంచేస్తున్న జంట కథకులు విహారి, శాలివాహనలకు పాఠక లోకంలో ప్రశస్తమైన స్థానంవుంది. వివిధ పత్రికలలో ప్రచురితమైన వీరి కథలను స్పందన వారీ పుస్తకంలో అందించారు. మారే మనసుల మనిషిని, ఆతని విలువను అద్దంలాగా చూపెట్టే కథలిందులో ఎనిమిది వున్నాయి. శిలవంటి మనిషి మనసులోగూడ సెలయేరువంటి రసజ్ఞతను ప్రవహింపజేసినట్టి పీకథనాలు. వాటిని దిఙ్మాత్రంగా అవలోకిద్దాం.

ఇంటింటికథ జీతంచాలని మధ్యతరగతి జీవితాలకు అసమగ్ర రూపకల్పన. రాజారావులాంటి బల్బులు పోయేవరకు యీకథలకు ముగింపు కథకుడు చెప్పినట్లే అసమగ్రంగావుంటుంది. గొంగళి పురుగులాంటి అసిరిగాడి జీవితం ఆకలిమంటలకు కుళ్ళుమామిళ్ళుతిని అంతంకావటం, ఆ శవం సమాజానికి అంకితం కావడం. నిత్యం మనం నగరజీవితంలోచూసే దృశ్యాలకు ప్రతిరూపం. ఈ కథ ఈ కలియుగంలో ఆకలిమంటలకిచ్చిన సమగ్రస్ఫూర్తి – తాను నవ్వుతూ, యితరులను నవ్వించాలనుకొనే సత్యానికి ఆఫీసుమనసుల్లో ఎదురైన చిటపటలు, అసంతృప్తులు, అజ్ఞానాలు విప్పిచెప్పిన ముచ్చటైన మూడోకథ "ఒక్క మనిషీ నవ్వడేం ?". నీతికథ ధర్మారావు కథ. అవినీతికి పరాకాష్ఠగా మనుషులనుతినే మునిరత్నం, బ్రహ్మలనుండి సమాజానికి జీవంపోయాలనే బడుగు బడి పంతులు వేదన.

అతి మంచి తనంతో అయినవాళ్ళను నమ్మి మోసపోయిన అభాగ్యుని అనుభవం మెత్తని పులులు. ఆస్తికోసం స్వంత తమ్ముణ్ణే మోసంచేసే మెత్తని పులులు ఇంటింటా వుంటాయని హెచ్చరించిన నినాదం. ఉద్యోగంచేసే విషయంలో అపోహలు వచ్చిన భార్యా భర్తలు కాలం మాన్పిన గాయంతో కలిసిన వైనం కర్త, కర్మ, క్రియ. దీని శీర్షిక చాలభావ స్ఫోరకంగావుంది. దంపతులు కర్తలు, ఫలితాలు కర్మలు, పునస్సమాగమాలు క్రియలు. నిరుద్యోగి వేదన, ఆత్మ హత్యా ప్రయత్నం తల్లిమనసు తీపికోసం జీవించాలనే ఆశావాదిగ మారి జీవితానికి విజేత యయిన దయానిధి విధికథ విజేత. ఈనాటి నిరుద్యోగ సమస్యల కారణాల తోరణంయిది. ఆఖరుకథ శిలలో సెల యేరు శైలి మనోహరం. ఉత్కంఠంతో గూడిన కథనం. 'టీ' వ్యాపారంలో పోటీ పరిస్థితుల కారణంగా శిలగా మారిన రాఘవులి హృదయంలో చనిపోయిన తన ప్రత్యర్థి పిల్లలను సాకాలనే కరుణారస తరంగిణి ఉద్భూతమైన తీరు వర్ణింపబడింది. ఈ కథ దేశానికి యిచ్చే సందేశం సార్వకాలికం: సర్వజనీనం.

మానవ జీవితాన్ని అనేక కోణాల్నించి, కమనీయంగా చిత్రించిన ఇలాంటి కథాసంపుటలు యువతరానికి కరదీపికలవుతాయి. ఇలాంటి ఆరోగ్యకరమైన గ్రంధాలు నేటిమన సమాజానికి చాల అవసరం.

ముక్కామల కథలు :

[రచన: ముక్కామల వెంకటేశ్వరరావు. పుటలు: 100. వెల : రు. 5–00. ప్రాప్తిస్థానం : నవోదయ పబ్లిషర్సు, విజయవాడ.]

'ముక్కామల' భావుకులైన కథకులు. కథాగంగంలో ముక్కాకలు దీరిన మూర్తి తమ భావనాబలాన్ని అక్షరరూపంలో నిక్షిప్తం చేసి సమాజాన్ని దర్శించి, సందేశాన్ని ప్రదర్శించిన పదిన్నొక్కటి కథలు పదిమంది మెచ్చేరీతిగా యీ పుస్తకంలో కూర్చబడ్డాయి. ప్రఖ్యాత రచయిత పాలగుమ్మి పద్మరాజుగారి 'మాటవరసకు' యీ గ్రంధానికి ముద్దుల మూటలావుంది. "కాలం, ధర్మం కాలంచేస్తున్నాయి" అనే లక్షణంతో ఆరంభించి, "కైపుతో వేడెక్కిన ఒళ్ళు చక్కబరచుకోటానికి సానికొంపల్లో దూరారు సంగమోళ్ళు" అన్న లక్ష్యంతో అంతంచేసిన వీరికథన వృత్తాంతం నేటి సమాజానికి దృష్టాంతం; హృదయంగమం.

మొదటి రెండు కథలు ఆడదాని శీలాన్ని గురించి ప్రత్యక్షంగా కొంత, పరోక్షంగా మరికొంత చెప్పినవి. స్థూలదృష్టులకు దోషైక దృక్కులకు యివి సెక్సు కథల్లాగ గోచరించవచ్చు. వీనిలోని వివేచన తెలియాలంటే పాఠకుడికి అంతర్నేత్రంకావాలి. ఆడదానివల్ల అన్ని విధాలా మోసపోయి 'కట్‌వెయ్యబడ్డ రైల్వే కంపార్ట్‌మెంటు' లా నిలబడిపోయిన రైల్వే నాగభూషణం కథ మూడోది. అడుక్కుతినేవాడు సక్రమంగా బతకాలన్నా ఆధారం యివ్వని సంఘాన్ని అసహ్యించుకొని అడుక్కునేవాడిగానే ఉండిపోయిన రాముడికథ గుండెల్ని తొలుస్తుంది. సంపదతెచ్చే సమతను తెలిపే చక్కని వాక్చితం కలిమి–చెలిమి. కూతుళ్ళ నైజాన్ని దూరదృష్టితోచూసి, తన్నే నమ్ముకున్న నాంచారి, రాధలపట్ల కృతజ్ఞతా పూర్వకంగా వీలునామారాసిన పెరుమాళ్ళకథ ఆస్తి చేజిక్కించుకున్న కూతుళ్ళు చివరకు వాళ్ళ నెలా చూశారో పాఠకుల ఊహలకే వదిలివేయడం రచయిత నేర్పు.

వల్లకాటి ప్రేమ స్మశాన వైరాగ్యంఅనే మన సూక్తికి మనోహర రూపకల్పన చక్కని సింబాలిజంతోకూడి మనుషుల్ని నమ్మే

సరళ భాషలో దివ్యజ్ఞాన తత్త్వము

1/16 క్రౌన్ సైజు, 64 పేజీలు, ఒక్కొక్కటి రు. 1-25

ఆత్మవిద్య (తెలుగు)

యోగవిద్య (తెలుగు)

శరీరములు – సాధనక్రమము (తెలుగు)

THEOSOPHY AND ETHICS (English)

THEOSOPHY, A WAY OF LIFE (English)

నాలుగు రూపాయిలు పంపినవారికి మూడు తెలుగు పుస్తకాలు ఆరు రూపాయిలు పంపినవారికి మొత్తం అయిదు పుస్తకాలు వి.పి. పద్ధతిలేదు. రిజిస్టర్ పోస్టు కావాలన్నవారు అదనంగా రెండు రూపాయిలుపంపాలి.

శ్రీ రమా ప్రచురణలు

17, జైయిన్ టెంపుల్ క్రాస్‌రోడ్,

విశ్వేశ్వరపురము : : బెంగుళూరు-560004

స్మశానానికి వాళ్ళలోని కుళ్ళు చెప్పిన. అందుకే కొండ అయిన కొండ కథ. భార్యమీద ఎంత ప్రేమచూపినా, అది బూటకమేనని తన ప్రాణం మీదే మగాడికి తీపి ఎక్కువని, ఆపదలో తాను నదిలోదూకి ప్రాణం కాపాడుకొనే చలంకథ చెబుతుంది. ఆ స్థితిలో భారతదేశంలోని భార్య లందుకొడిగట్టరని మనందరి నమ్మకం, సహజత్వానికి చాల సన్నిహితంగావున్న రచన. "పాపం! పెళ్ళయింది" కథ సస్పెన్సుగా నడిచినా నిజానికి చాల దూరంగావున్న సరదాకథ బంగారు సంకెళ్ళు కథ అసమగ్రం. మనస్తత్త్వ విశ్లేషణం యిందులో అసంపూర్ణంగా జరిగింది. ఎవరో తరుముకొస్తున్న రీతిగా, హడావుడిగ నవలను కథగా మార్చినట్లున్నది. పిల్లలులేని పడతికథను కళ్ళు చెమ్మగిలేలా చెప్పినది "పాపాయి యాడవదూ" వృత్తాంతంలో. ఇది దుఃఖాంతం అవడంవల్లగూడ గాథానుభూతి పెరుగుతుంది. ఈ సంపుటిలోని అత్యుత్తమమైన కథ నగరంలో తోడేళ్ళు. "మనవాళ్ళ చరిత్ర రాయకుండా మనుచరిత్రను పెద్దనగారు యెందుకు రాశాడా" అనే అనుమానంతో తోడేళ్ళలాంటి పాటకజనాల సంఘపెద్దల అవినీతిని వివరించినకథ. కవిత రాసుకునే అభాగ్యుడిందుకు బలికావడం కవులకు సమాజం యిచ్చే గుర్తింపుకు చిహ్నమేమో! అందుకే సమాజంచేత బ్రహ్మరథం పట్టించుకున్న కాలంలోవున్న పెద్దనగారిలాంటివి దర్శించినా స్పృశించి వుండకపోవచ్చు. మనిషి మనసులో కలకాలం నిలిచేకథయిది.

పాలగుమ్మివారన్నట్లు మనసును మథించే జటిల శిల్పం వీరి రచనలపొత్తు. ఆలోచన. ప్రరోచనలను రేకెత్తించే ఉత్తమ కథన లక్ష్యం యీ రచనయితలో సర్వేసర్వత్ర వెల్లివిరుస్తున్నాయి. రచయిత భావననుబట్టిగూడ వీరిరచనల్లో స్థాయీ, చిరస్థాయీ రెండూ వుంటాయనటంలో సందేహంలేదు. మరి కావలసిందల్లా ఒకటే, శతాధికమైన వీరి యిలాంటికథలు.

ప్రతిభ (హుజూరాబాద్ తాలూకా ఉన్నత పాఠశాలల ద్వితీయ వార్షిక సంచిక)

[మూల్యం: అమూల్యం. పుటలు: 80. ప్రాప్తిస్థానం: సంచాలకుడు, ప్రభుత్వజూనియర్ కళాశాల, హుజూరాబాద్, ఆం.ప్ర.]

విద్యార్థులలో నిద్రాణమైన కళా ప్రతిభలను వెలువరించటానికి దోహదంచేసేవి విద్యాలయాల వార్షిక సంచికలు. తమకున్న పరిమిత వనరులతో హుజూరాబాద్ తాలూకా ఉన్నత పాఠశాలల వారందరు సమష్టిగా సమర్పించిన యీ ప్రతిభ సంచిక లేబ్రాయపు బాలికల స్నిగ్ధ మనో దర్పణంగా, మనోహరంగా వున్నది.

ప్రారంభంలో తెలుగు తల్లికి యిచ్చిన నీరాజనం సముచితంగా వున్నది. కాని ప్రసిద్ధుడైన రచయితను వదలివేయడం శోచనీయం. స్రవంతి, చక్రం పత్రికలవారి సమీక్షలు, ప్రముఖుల సందేశాలు, విద్యాసంస్థాసంబంధ సూత్రాలు, మలికాన్కగా సంపాదకీయం, క్రమబద్ధంగా కూర్చబడ్డాయి. సంచాలకుని అభినందనలు, నివేదికలు, అడ్వర్‌టయిజ్‌మెంట్లు మొదలైన సాంకేతిక ప్రచురణల తదుపరి అధ్యాపక, విద్యార్థుల సారస్వత ప్రతిభకు ప్రతీకలు వ్యాసరూపంలోను, కవితారూపంలోను, కథారూపంలోను కనుపిస్తాయి. అక్కడక్కడ అందమైన సూక్తులు పొదగబడ్డాయి. దేశంలోని పరిస్థితి నాధారంచేసుకున్న రచనలెక్కువగా యిందులోవున్నవి. ఆకాంక్షలాంటి ఉత్తమ కవితలు, క్షణికబుద్ధిలాంటి ఉత్త కవిత లిందులోవున్నాయి. అధ్యాపకవాణి, విద్యార్థులవాణి కలసిన కావ్యం కథాయిది. విద్యార్థుల రచనల్లో స్వాతంత్ర్యానంతర భారతదేశ ప్రగతి, శ్రీనాథుని వ్యాసాలు మెప్పుగొలిపే రచనలు. అయితే యిందులో అధ్యాపకుల ప్రతిభే యెక్కువగా మనల్ని పలకరిస్తుంది. విద్యార్థులపెనుక తాముండి యిలాంటి సంచికలు వెలువరించే శక్తియుక్తులుపాధ్యాయులకు కావాలి. బాల బాలికల చక్కని రచనలందింపజేసినందుకు సంపాదకు లభినందనీయులు. ముమ్ముందీ బాలబాలికలుత్తమ భావుక రచయితలుగా రూపొందుతారని, ఆ వాతావరణకీ సంచిక ఉద్దీపన మవుతుందని ఆశించవచ్చు.

జీవబంధు:
(భగవాన్ మహావీర్ ప్రత్యేకసంచిక)

[పుటలు: 36. వెల: తెలియదు. ప్రాప్తిస్థానం: కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ జీవరక్షాసంఘం -- గుంటూరు-3.]

"అహింసాపరమోధర్మః" అని ప్రవచించబడిన ఈ దేశంలో నానాటికీ జీవహింస పెరిగిపోతోంది. ఆహారంపేరిటా, మూఢనమ్మకాలపేరిటా, జంతుహింస నిరంతరంగా సాగుతోంది. దాన్ని పరిమార్చటానికి ఆంధ్రప్రదేశ్ జీవరక్షాసంఘం నిరంతర సంగ్రామాన్ని సాగిస్తోంది. వారి కృషిలో భాగంగా జీవబంధు పత్రికను వెలువరించటం, భగవాన్ మహావీర్ జన్మదిన ప్రత్యేకసంచికను సిద్ధం చేయడం యిటీవలజరిగింది. ఈ పత్రికలు ఇంగ్లీషు, తెలుగు, హిందీ భాషలలో ప్రచురించటం అందరికీ ఆమోదయోగ్యం అవు

తుంది. అహింసాసిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగ నమ్మిన జైనమతాన్ని గురించి, ప్రవక్తమహావీరునిగూర్చి ప్రతిభా సమన్వితమైన వ్యాసాలు సూక్తులు యిందులో పెక్కులున్నాయి. మాంసాహారం యెందుకు వర్జించాలో చెప్పిన వ్యాసం చాలా హేతుబద్ధంగా వున్నది. భారత దేశంలో జంతు సంరక్షణోద్యమాన్నిగూర్చి అధికార, అనధికారు లనేకులిందులో విప్పిచెప్పారు.

తెలుగు సంచికలో రాష్ట్ర కార్యక్రమాలు, ప్రాణిమిత్ర అవార్డు నందుకొన్న రామకృష్ణగారి కథనం, యజ్ఞ దురాచారాలను గూర్చి, శాకాహార ప్రాధాన్యాన్నిగూర్చి, సాహిత్యంలో పశుపక్ష్యాదుల చిత్రణముగూర్చి, జంతువుల భాషణనుగూర్చి విజ్ఞాన దాయకమైన వ్యాసాలు వున్నాయి. దీనికనుబంధంగా యిచ్చిన జీవబంధు పత్రిక గూడ మూడుభాషలలోవుండి మాంసాహారులను దూరంగా వుంచాలి లాంటి వ్యాసాలతో, గేయాలతో జీవరక్షా సంఘం కార్యకలాపాలతో వున్నది

సాత్త్విక గుణాన్ని పెంచి మనిషిని చేయగల ఈ వుద్యమాన్ని అనేక వ్యయ ప్రయాసలకోర్చి నడుపుతున్న జీవరక్షా సంఘంవారిని హృదయపూర్వకంగా అభినందించాలి. అహింసాత్మకమైన భారతీయ సంస్కృతికి వీరే అనుంగుబిడ్డలు.

సంత్రాగాఛి తెలుగు మీడియం హైస్కూలు తొమ్మిదవ వార్షిక సంచిక:

[పుటలు . 116. వెల : తెలియదు. ప్రాప్తిస్థానం : కార్యదర్శి, సంత్రాగాచి మిక్స్డ్ హైస్కూలు, జగాచా (పి. ఒ.) హౌరా జిల్లా. పశ్చిమ బెంగాల్.]

ప్రవాసాంధ్రులకున్నంతగా మాతృభాషా సంస్కృతులపై మమకారం ప్రదేశాంధ్రులకుండదు. ఎక్కడో తెలుగుదేశానికి చాల దూరంలోవుండి, తెలుగు మీడియం స్కూలును స్థాపించుకొని, తమ తెలుగువాణి నీ సంచికద్వారా వినిపిస్తున్న సంత్రాగాచి తెలుగు వారినిమాచి మనం మెచ్చుకోవాలి. వెలుగునిచ్చే యీ సంచికలో తమ కార్యకలాపాలను మూడుభాషలలో వినిపించారు. కాని మొదట మాతృ భాష ఉంచితే బాగుండేది. పశ్చిమ బెంగాల్‌లోనున్న ఒకే ఒక తెలుగు స్కూలు పుట్టుపూర్వోత్తరాలను తెలిపారు. తదుపరి కార్యదర్శి నివేదిక, విజ్ఞానదాయకమైన కొన్ని ఆంగ్లవ్యాసాలున్నాయి. ఆంధ్రా బెంగాలుల సామ్యవైషమ్యాలను రాసిన ముక్కామలవారి వ్యాసం భారతదేశ తూర్పు ప్రాంతంలోని తెలుగు రచయితలను గూర్చిన షండికోట బ్రహ్మాజీరావుగారి వ్యాసం. అదే ప్రాంతంలోని ఆంధ్ర నటులను గూర్చిన వేదాంతంవారి వ్యాసం నూతన విషయాలనెన్నిటినో మనకు నివేదిస్తున్నాయి మన విద్యామంత్రిని గూర్చిన వ్యాసంకూడ అదే కోవలో వున్నది.

తెలుగు విభాగంలో యివ్వబడిన యోగ్యతాపత్రం, స్వగతం, ఆకాంక్ష ప్రవాసాంధ్రుల తీయని తెలుగుదనాన్ని వినిపిస్తున్నాయి. యువ కవులకవితలు, నాట్యమందిర పరిణామ పరిశీలన వ్యాసాలుదాత్తంగా వున్నాయి. 'మనుగడ' మొదలైన కవితలున్నత భావబంధురాలు. తెలుగుదనాన్నుద్ధరించడానికి కంకణధారియైన విద్యామంత్రి మండలి వారిని గూర్చిన వ్యాసం యీ విభాగంలో గూడ వుండి ఛక్కని వాస్తవికచిత్రణ. ప్రపంచ తెలుగు మహాసభలను పదుగురుమెచ్చేరీతిని నడిపిన ముఖ్యమంత్రిగారిని గూర్చిన భావాలిందులో వ్యాసంగా లేకుండుట పెద్దలోటు హిందీ విభాగంలో గూడ యిలాంటి రచనలే వున్నాయి. ప్రవాసాంధ్రుల హృదయాల స్నేహమాధుర్యామృతం అయిన ఈ సంచిక చాల ఆకర్షణీయంగా, ఆలోచనాత్మకంగావుంది. వెలువరించిన కార్యదర్శిముక్కామల వారభినందనీయులు.

నాట్యకళ:

[మాసపత్రిక నవంబరు 1975. పుటలు : 72, వెల రు1-00. ప్రచురణ : సంచాలకులు, సంగీత నాటక అకాడమీ, సైఫాబాదు, హైదరాబాదు.]

లలిత కళలలో ప్రధానమైన నాటక కళ స్వరూప స్వభావాలను గురించి, ఆవిష్కరించే సపత్రిక యిది దీనిలో సంగీత సాహిత్యాలకు సంబంధించిన వ్యాసాలు గూడ చోటుచేసుకోవటం ముదావహం నాట్యకళ సమాహార కళగదా! దీనిలో కుందుమూల సంస్కృత నాటకాన్ని గూర్చిన కృష్ణారెడ్డి గారివ్యాసం. ఈదర నాగరాజుగారి త్యాగరాజ సంగీతపాఠం, బాపుడ్డిగారి విజయహేల సగీత రూపకం శ్రీ కుమార్‌గారి నృత్యభారతి కవిత తారక రామారావుగారి శరణం గచ్ఛామి నాటకం, శ్రీనివాసరామాయణ భాగవత మేళ నాటకము, ఈలపాటలో ప్రసిద్ధులైన రఘురామయ్య గారిని గూర్చిన వ్యాసం భరతముని నాట్యమే కూచిపూడి నాట్యమనే పరిశోధనాత్మక వ్యాసము, అకాడమీ కార్యక్రమాలు. కళారంగం, గ్రంథసమీక్షలాంటి అన్ని హంగులతో ఆకర్షణీయంగా వుంది

నాటక కళాకోవిదులకేగాక తక్కిన కళాభిజ్ఞులకు గూడ రసా

నందాన్నిచ్చే ఇలాంటి పత్రికలు క్రమబద్ధంగా వెలువరింపబడితే సహృదయులకు సంతోషంగా వుంటుంది. ప్రభుత్వం వారందుకు పూనుకోవాలి.

సుగ్గుల అక్షయలింగం గుప్తగారి షష్ఠిపూర్తి సంచిక:

[పుటలు : 150. వెల: రు 15-00 ప్రాప్తిస్థానం : శ్రీ బి. యస్. గుప్త, కన్వీనరు, మహబూబాబాద్, ఆం. ప్ర.]

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయపథంలో నిరంతరం పురోగమిస్తున్న జిల్లాలలో ఖమ్మం వకటి. నాటి నైజాం నిరంకుశపాలననుండి ప్రజానీకాన్ని విముక్తంచేసి, వారి అజ్ఞానాంధకారాన్ని తొలగించిన అతిరథ మహారథులెందరో నేటికీ ఖమ్మం జిల్లాలో కీర్తి కిరీటాలై వున్నారు. వారిలో వణిక్ప్రముఖులు, ప్రసిద్ధ సంఘసేవకులు, శ్రీ సుగ్గుల అక్షయలింగ గుప్తగారొకరు. ఇటీవల ఖమ్మం పట్టణంలో కనుల పండువుగా జరిగిన వారి షష్ఠ్యపూర్త్యుత్సవ సందర్భంలో వారి సన్నిహితులు శ్రీ కోదాటి నారాయణరావు, శ్రీ బి. యస్. గుప్త వంటి సహృదయులు వెలువరించిన దీ షష్ఠిపూర్తి సంచిక.

సాధారణంగా యిలాంటి సంచికలు మనిషి స్వీయజీవిత వివరాలతో కూడి వుండి అందరికీ ఆసక్తిని గల్గించవు. కాని యీ సంచిక అక్షయలింగంగారి జీవితంతోపాటు, దానితో పెనవేసుకున్న ఖమ్మం ప్రాంతీయ చరిత్రనుగూడ సమానాంతరంగా వివరించుచున్నందువల్ల ఆకర్షణీయమై, చారిత్రిక పరిశోధకులకుగూడ చేతనాత్మక జిజ్ఞాస నిస్తోంది. జవహర్‌లాల్‌వంటి ప్రసిద్ధ నాయకులతోగూడిన వీరి ఛాయాచిత్రాలు, వీరి గురుదేవుల చిత్రాలతో, ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రులు, పలువురు అధికార, అనధికార ప్రముఖులతో గూడిన సందేశాలతో యీ సంచిక సర్వాంగ రమణీయంగా వున్నది. ఆ సందేశాలే గుప్తగారి గురుతర ప్రతిభకు ప్రతీకలుగా వున్నాయి. ఆయన జీవితాన్ని వివరించిచెప్పే వ్యాసాలు, ఆయన వదాన్యతను విశ్లేషించి చూపే విజ్ఞాన నికేతన గ్రంథాలయ, విద్యాలయ, పర్తక సంఘాల వివరాలు సమగ్రంగా తెల్పబడ్డాయి.

తేజం గారుగా పిలువబడే వీరిని గూర్చిన కవితలు, వీరితో తమ అనుభవాలు, జ్ఞాపకాలు వ్యాసాల రూపంగా కోదాటి నారాయణరావు, బొమ్మకంటి, పర్చా, ఉపేందరావు, తిరుమలరావు, హీరాలాల్ మోరియావంటి ప్రముఖులు ప్రశస్తరీతిని తెలిపారు. విడనెడ ఉపనిషత్సూక్తులు ఉటంకించడం ఈ మనిషికి, ధర్మ జీవనానికిఉన్న సమన్వయాన్ని వ్యక్తంచేస్తుంది. ప్రాసంగికంగా తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ మహాసభలలో వీరు నిర్వహించిన పాత్రను తెలిపారు. కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణంగారి వ్యాసం, గీతాధర్మాన్ని గూర్చినవ్యాసం యీసంచికకు 'హైలైట్స్' అని చెప్పవచ్చు. వీరు కర్మయోగి వెంపటి సూర్యనారాయణగారి ఆశీస్సులుకూడ అందుకున్న ధన్యజీవి అని చెప్పవచ్చు.

ఈ సంచికలో సారస్వత వ్యాసాలుగూడ కొన్ని చేర్చివుంటే పండితులకుగూడ పీయూషాన్ని పంచిపెట్టినట్లుగా వుండేది. అదివినా మిగతాసంచికా అంతా సమగ్ర సుందరము, ఉన్నత భావబంధురముగా వున్నది.

—"సుచంద్ర"

బాలరసాలము:

[కోరుట్ల—భారతీ సాహిత్య సమితి సభ్యుల కవితా సంకలనము: డెమ్మీ 1/8. వెల రు. 3/ ప్రతులకు: అధ్యక్షుడు—భారతీ సాహిత్య సమితి, కోరుట్ల, కరీంనగరజిల్లా.

కరినగర (కరీంనగర్) కోరుట్లయందలి భారతి సాహిత్య సమితి, తమ సభ్యుల రచనలను చేర్చి అందించిన మధుర ఫలపళ్లెరము—ఈ కవితా సంకలనము. ప్రతిపట్టణంలో ఇట్టి సంఘాలు ఏర్పడి, తమవారి రచనలు ప్రకటించడం, వారికేగాక ఆంధ్ర పాఠక లోకానికి గూడ మేలు కలిగించ గలిగిన పూనిక. అక్కడక్కడా ఇట్టి ప్రచురణలు సాగడం ముదావహం.

ఇందు ఉపాధ్యాయులు విద్యార్థులు ఉద్యోగులు రచయితలగుట ఒక విశేషం. ఈ కవితాతాల్యం ఉద్యోగులకు అహ్లాదకరమైన మరొక వ్యాసంగం—ఆంధ్రభారతికి ఒక అలంకారం. అపరపోతన—శ్రీమాన్ నానమానులై వరదాచార్యులు గారు విషయ పూర్ణమైన ఒక దీర్ఘ పీఠికను వ్రాస్తూ రచనలను సహృదయంతో సమీక్షించి వెలగట్టినారు; ఇది ఆయన సరసత! అయినా ఒక్కటే ముఖప్రీతి మాటలేదు. ఆచార్యులవారు—'నానృషిః కురుతే కావ్యం' అన్న బూజుపట్టినసూక్తిమాటనే అంటారు; లోకమంతా ఎందరో మహాకవులు ఉండినారు—ఉంటున్నారు; వారెవరూ వీరనుకొన్న ఋషులుగారే! అసలు ఋషికి లౌకికమైన కవిత్వం అబ్బుతుందా? పూతలపట్టు శ్రీరాములురెడ్డి (కంబరు) ఋషిఅయినవాడు కవి కాలేడని "న" స్థానం మార్చి చెప్పుతుండేవారు.

ఇంకొక ఛాందసపుమాట—విశ్వ శ్రేయః కావ్యం అనేది యుగ యుగాలుగా కావ్యాలు అల్లబడుతున్నా ప్రవక్తలు పుట్టుతున్నా ప్రపంచం మంచిచెడ్డలతోనే నిండి ఉంటున్నది. ఇక కావ్యాలవల్ల ఒనగూడిన శ్రేయమేది? ఆనందం కొంత మాత్రమే! లోకానికి ఉపయోగపడే సైన్సు పుస్తకాలు కావ్యాలు అవుతవా?

ఇంకొక మొగమాటంలేని మాట:— ''బాలరసాలసాల నవ పల్లవ కోమల కావ్యకన్యక''—పద్యం పోతనదని ప్రస్తావనలో వ్రాసిన వారితప్పుగాదు; ఇది వేళ్లు పాతుకొనిపోయి ఉన్న ఒక పెద్ద అపోహ. ఇది, పాపం! మంచనకవి కేయూరబాహు చరిత్రలోనిది. ఈ సంగతి ఎవరెన్ని విధాల చెప్పినా వీరు మనసు మార్చుకోరు ఈ ఒక్క పద్యం లేకపోతే పోతన అమృతాక్షర వికాసమైన లేఖినికి కొరత ఏర్పడుతుందా ఏమి? ఇదే తల్వ్రాత రామభూషణకవి ''నానాసూన వితాన వాసనల'' పద్యానిది. ఈ పద్యాన్ని ముక్కు తిమ్మన దగ్గర యీ మహాకవి కొన్నాడట! వింటుందాం. ఇవి నాటకాల్లో స్వగత వచనాలవంటివి లెండి.

ఇక గ్రంథ వస్తువుకు వస్తాం:—ఇందు 58 మంది నవ కవి కుమారుల వ్రాతలున్నవి. వివిధ రుచులకు ఇంపుగూర్చే ఛందోరీతులున్నవి. ఉన్నా భాష భావంలో అరాచకంలేదు. చాలా ఖండికలు ప్రత్యేకంగా ఎత్తి వ్రాయదగిన ఉన్నవి—అది సాధ్యం కానిపని. పాఠకుడు వీటి నన్నిటిని నమలి నెమరువేసి మింగవలసినవే; పంటికి పిప్పి తలుగదు. విభిన్న నూతన భావాలు, వీటికి తగిన భాషలో ఉన్నది. ఆశావాదమేగాని అసూయ ఆందోళనలేవు. నేటి సంఘ విమర్శన—నీతి—ఎత్తిపొడుపు—ఎగతాళి—ఆవేదన అన్నీ ఉన్నవి.

రసలుబ్ధత్వం మహమ్మద్ అలీ గారి పద్యాలను ఉదాహరించ మంటున్నది. ఆంధ్రేతరుడు, పెద్ద ప్రభుత్వోద్యోగి యీ గంభీర ధార భాష భావగురుత్వంగల పద్యాలు వ్రాసినారంటే ప్రతి ఆంధ్రుడూ గర్వింపదగినది. అలీగారి మధూదయంలో—

''అరుణోదయ తరుణీమణి హరి దంత కపోలములకు సప రంజి కళల్ విరచించె రాగరంజిత కరములతో భాస్కరుడు కమనీయముగన్''—కరము—చేయి, కిరణము అన్నసారస్యం.

''తను వొక పానపాత్రము, సుధాపరిమాణము ప్రాయమంచులన్ దొనకక ముప్ప్రిగొని సుఖతోయధి యందున దేలియాడ రమ్మని బులిపించుచున్నటుల సల్లదె ప్రేయసి! పానశాల ప్రాంగణమున గాలికిం గదలు కమ్మని ద్రాక్షలు స్వాగతిం చెడిన్'' స్వాగతించు—గడుసు ప్రయోగం. ఇది దువ్వూరివారి పానశాలలో రాయప్రోలువారి మధుకలశాన్ని ఖాళీ చేసినట్లున్నది.

ఇంకొక సైన్సు వివరణం: నీరదాంగనలో రాచప్ప ప్రాథమిక పాఠశాల టీచరు ''రవి కరముల నీ లోపల రంగులు సింగారించుక దిగ్భామిని గళమునందు తీర్చితె మణి హారమ్మను' ఇంద్రధనువు వర్ణన.

కాహళీ—కాకిగోల

[చామర్తి దుర్గాప్రసాద్. గద్య కవితా సంపుటి డెమ్మి 1/8. 66 పేజీలు; వెల రు 5/-, ప్రతులకు—పురోగామి D-18/15. ఐ. ఐ. టి. మద్రాసు-36]

కవి ఏదో ఆవేశంతో చాలా వ్రాసినారు. కాని, ఆయన భావమేమిటో ఆవేదన ఏదో ఎంత సహానుభూతితో చదివినా అంతు పట్టడంలేదు. సహృదయ పాఠకునిమధ్య ఈ ఆవేశిత కవి మధ్య అర్థంగాని ఒక అగాధాన్ని ఈ''కాకిగోల'' కల్పిస్తున్నది. దీనికి దోడు ఇంగ్లీషు పదాలు పల్లేరు పూచినట్లు పూదోటలో కలుపు మొక్కలై ఉన్నవి. ఈ పదాలు చాలా పారిభాషిక పదాలు. చదరంగా చదువు జరుగదు; భావం మనసుకు పట్టదు. రచయితకు ఉత్సాహమున్నది; తెనుగు వారికి దక్కి పనికి వచ్చేది వ్రాయగలడని నా నమ్మకం; అట్లా వ్రాయమని ప్రార్థన. ఏ శీర్షికలో గాని దానికి తగిన అర్థం బయటబడదు. వీరు, నాది మందబుద్ధి అన్నా నా మనసు నవ్వదు. నిజం నిష్ఠురమైనది గదా!

ఈ పుస్తకం అమ్మకంవల్ల వచ్చిన ధనాన్ని కవికుమారుల కావ్యముద్రణ సహాయనిధిగా ఒక సహకార సంస్థగ (పురోగామి) ఏర్పాటు చేయడం ప్రశంసనీయ ప్రయత్నం.

న క్ష త్రా లు

[వచన కవితా సంపుటి. వైవియర్యాన్ డెమి: 1/8, 85 పాఠటలు. వెల: రు. 2-50/- ప్రచురణ: దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, కాంగ్రెస్ ఆఫీసురోడ్డు, విజయవాడ 2.]

ఇంగ్లీషు పొడి అక్షరాలను తెనుగు సమాసంచేసి, గ్రంథకర్త పేరు దాచుకోవడం ఎందుకో! ఈ కవి బొమ్మమూచిన మాత్రం, పేరు చెవినబడకూడదా? ఇది ఇప్పుడు యీలంవెరిగా (క్రేజ్) ఉన్నట్లున్నది.

రచయితగా సంస్కృత సం ప్రదాయం. తన ఉపోద్ఘాతాన్ని బుధంతి' అన్నారు. ఈ పేరు కాడ సామాన్య పాఠకుడు దాటవేసు

కొని పోతాడుగాని, అనుశీలకులన్నీ అర్థంచేసుకోవద్దా ? అర్థానికి పండితులు ధాతుమంజరి వెదకుతున్నారు. నూరుమూల పాతమాటలు వాడ రాదనడం వినసొంపులేనిమాట; ఉపయోగించకపోతే ఆ పదాలు తుప్పుబట్టిపోవా ?

చాలా శీర్షికలలో భావం మాటల మరుగునే దాగుకొని మర్మ కవిత్వం అనిపిస్తున్నది. "రెక్కలొచ్చిన పక్షి ఎగిరిపోతుందెక్కడికైనా" అన్నది బ్రహ్మంగారి కాలజ్ఞానం మాదిరి ఉన్నది. "కాలం కాటేసిన మనిషి" లోను, మరికొన్నిటిలోను కాలపు భావాన్ని గుర్తించడం ఆశావాదానికి దారి. కాబట్టే "మమత సమత పంచుకుంటే నరుని విడద ప్రేమ దుర్గమే" అని అనగలిగినాడు. మంచి చెడ్డలు జీవిత వసనంలో జమిలి పోగులుగదా, ఒక్క దుఃఖాన్నే — పూర్వప్రబంధ కవులు ప్రేమనువలె—వర్ణిస్తే లాభమేమి ?

కవి సంస్కృతం తెనుగు అందంగా ఉపయోగించగలరు : "పువ్వులల్లె విచ్చుకుంటున్నకళ్లు" "వ్యధాభరిత సధాక్షుభితగానం" (ఈ ప్రాసల ఏడ్పులకు అగత్యంలేదని 'ఇల్లా పుండాలి కవిత్వం' అన్న పరిచయ వాక్యాలలో కుందుర్తివారు) "వెన్నెల వెల్లవేసిన వెలుగుల మేడలలో" హృద్యమైన ప్రయోగం. 'బాహ్యోద్యానస్థిత హర శిరశ్చంద్రికా ధౌతహర్మ్య' అన్న కాళిదాసు సృష్టించిన దృశ్యం కన్నులకు గట్టుతున్నది. "నిన్ను రెండుగ చూపే నీడలు" మంచి ప్రౌఢప్రయోగం. ఇట్లా రచయిత తన భావుకతను చూపుతున్నారు. పోనుపోను రచన ఇంకా మెరుగెక్కుతుంది.

శిల్పవాణి

[విజయనగర సామ్రాజ్య దీప్తగాథ, మధురకవి బెళ్లూరి శ్రీనివాసమూర్తి. డెమ్మి 1/8. 25 పేజీలు. వెల రు. 3/— ప్రచురణ : అవ్వారి నారాయణ సాహిత్యపోషణ సంస్థానము, బుక్కరాయసముద్రం, అనంతపురంజిల్లా.]

"శిలగాజన్మించి శిల్పిచేతులంబడి మంజులతర స్త్రీరూపము గొని పలికితి స్వీయానుభవము"—అని ఒక ప్రతిమచేత విజయనగర చరిత్రను కంటతడిబెట్టునట్లు చెప్పించుట కళాపూర్ణమైన కథక ఫణితి.

"క్షామములెన్నివచ్చిన రసజ్ఞత మాత్రము చావలేదు, జ్ఞానామృత వృష్టికిన్ కొరతనందరి రాయలసీమ లోపలన్" అన్నపొంగె గర్వంతో అభిమానంతో ఈ కవి కృష్ణదేవరాయల చైతన్య చరిత్రను గానంచేసి, పతనానికి ఆక్రందిస్తూ శిల్పలక్ష్మిచేత వివరింపజేస్తున్నారు.

ఈయన పాండిత్య ప్రౌఢి కవితాధారను కుంటుపరచలేదు. పద ప్రయోగ గుంఫన సౌభాగ్యం భావాలకు వన్నెబెట్టుతున్నది గంభీర శయ్య ఉచిత రసాన్నే ఊరిస్తున్నది. కవికి ఆంధ్రత్వంపైగల భక్తి తెనుగు నుడికారాన్ని ప్రదర్శించినది. ఈ గ్రంథపఠనం మనసుకు మంచి హాయిని గూరుస్తున్నది.

"సాహితీపీఠముల సభాస్థానమందు కొండ్రముచ్చులుముప్పూట కొలువుదీరు"అని తుంగభద్ర చేత నేటి దీనస్థితిని ఆక్రందింప జేస్తున్నాడు—కవి; ఆంధ్ర వైభవలక్ష్మి ఉజ్జ్వల భవిష్యత్తుపై మంచి ఆశక నుపరుస్తున్నాడు.

రాయల భువన విజయంలో ఒక కవితాగోష్ఠిని కల్పించినారు; బాగున్నది. కాని, అష్టదిగ్గజాల విషయంలో పాత పాచిపాటే. వీరిలో నలుగురే తెనుగు కవులన్నది నేటి చరిత్రమాట. తమిళ సంస్కృత కర్ణాటకవులు ఇందుచేరి ఉండినారు. ఈ పూర్వవాదారాభకులు ఇూ మాటలను చెవులలో దూరనీయరు. ఇది ఆంధ్రచరిత్రకు ఒక చీడ. రామభూషణుడు సూరన చాలా ఇవతలివారు. సరే! ఎవరిపిచ్చి వాళ్లకు ఆనందం.

రాయలు — "శైవ వైష్ణవ సామరస్యంబుగూర్చి తెనుగు కన్నడులకు వంతెనయగల్గె" అన్న వాక్యం ఈ రచనలో తలమానికం.

— శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి.

బ్రహ్మాండవచనము

[గాయత్రీ ప్రచురణలు—4. మూచనా మాత్యకృతము. సంపాదకుడు — పరిష్కర్త — శ్రీ చొక్కపు—నారాయణస్వామి, క్రౌను 32+29 పుటలు. వెల : సాధారణప్రతి రు. 3 లు. క్యాలికో బైండు రు. 5 లు. ప్రతులకు — (1) శ్రీ ఏస్. వెంకటరమణ గాయత్రీ ప్రచురణలు, ఉ. కొత్తపల్లి, ధోన్ తాలూకా, కర్నూలు జిల్లా. (2) వెంకటేశ్వర బుక్‌డిపో, క్లాక్‌టవర్‌వద్ద, మహబూబ్ నగర్.].

నన్నయభట్టు మొదలుకొని చిన్నయసూరివరకూ తెలుగులో పద్యగ్రంథాలే రచించబడుతూ ఉండినవి. అనువాదాలు జరిగేటప్పుడు కూడా సంస్కృతమూలంలోని గద్యగ్రంథాలు పద్యకావ్యాలుగానే వస్తూ వుండేవి. 18—వ శతాబ్ది ప్రారంభమునుంచే కొద్దిగా వచన గ్రంథాల రచన ప్రారంభమైనది. ఆ శతాబ్దం మధ్యకాలంలో రచించబడిన వచన గ్రంథాలలో ఇది ఒకటని ఊహించబడుతున్నది. ఇంత

వరకూ అముద్రితంగా ఉన్న యీ వచనకృతి సంపాదకుల గట్టి ప్రయత్నంవల్ల చీకటికోణంనుంచి వెలుగులోనికివచ్చి ప్రచురింపబడింది.

పేరునుబట్టి యిందులో బ్రహ్మాండాన్ని గురించిన వివరాలు వ్నట్లు తెలుస్తున్నది. ఇది దేనికీ అనువాదమైనట్లు కానరాదు. మాచనామాత్యుడు వివిధ శాస్త్రాలనూ, పురాణాలనూ చదివి వాటిలోని విషయాన్ని స్వీకరించి దీనిని రచించినట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా భారత, భాగవతాలలోని విషయాలు కానవస్తున్నవి. పార్వతీదేవి ప్రశ్నింపగా, పరమేశ్వరుడు బ్రహ్మాండాన్నిగురించి తెలిపినట్లు ఇందున్నది.

పార్వతీదేవి పరమేశ్వరుణ్ణి చూచి ''స్వామీ! సకల జగదుత్పత్తి స్థితిలయంబులకుఁ గారణకర్తయైన మూర్తిత్రయంబెట్లు కలిగె? బ్రహ్మాండ నిర్మాణం బెట్టిది? తదాత్మకంబగు నీ విశ్వ ప్రపంచం బెట్లు కలిగె? వర్ణాశ్రమ ధర్మంబులును, ఛప్పన్న దేశంబులును, నవ ఖండంబులును, సప్త సముద్రంబులును, నగంబులును, త్రేతాగ్నులును, సప్త కులపర్వతంబులును, లోకాలోక పర్వతంబును, చేషష్ఠి విద్యలును, సముద్ర మథనంబును, సప్త వాయువుల చలనంబులును, సప్తారణ్యంబులును, నవనాథ సిద్ధులును, దశావతారంబుల తెఱంగును, సూర్యాది నవగ్రహంబుల తెఱంగును, యుగకాల ప్రమాణంబును, బ్రహ్మయువు ప్రమాణంబును, సూర్యుని రథవేగంబును, ఏకోదకంబైన విధంబును, సకల జగదుత్పత్తిస్థితి లయప్రకారంబును, దేవ తిర్యఙ్మనుష స్థావర జంగమంబుల కగ్గంబైన యీశ్వర ప్రపంచంబు నే విధంబునఁ గలిగె? అంతయుఁ దెలుపవలెను'' అని ప్రార్థించగా, ఆయన సంగ్రహంగా ఆ విషయాలన్నీ తెలియజేశాడు. దీనినిబట్టి యిందులోని విషయాలేమో గ్రహించవచ్చును.

శ్రీ నారాయణస్వామిగారు జీవిత భీమా సంస్థకు సంబంధించి పనిచేస్తున్నా, తమకుగల వాఙ్మయాభిమానాన్ని పురస్కరించుకొని తమవద్దనున్న తాళపత్ర ప్రతిని, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపుస్తక భాండాగారంవారి వ్రాత ప్రతిని పరిశీలించి పరిష్కరించి దీనిని ప్రకటించారు. ఆయన గ్రంథంలోని విషయాలనే కాకుండా తమ తాళపత్ర ప్రతికీ, ప్రాచ్యపుస్తక భాండాగారంలోని ప్రతికీఉండే పాఠభేదాలను వివరిస్తూ పెద్ద పీఠిక రచించారు. అది పరిశోధకులకు మిక్కిలి ఉపయోగమైనది. సూర్యుణ్ణి గురించి చెప్పుతున్నప్పుడు XXIV వ పుటలో ''(సూర్యున కింద విష్ణువను పేరు వాడబడినది)'' అని వున్నది విష్ణువు ద్వాదశాదిత్యుల్లో ఒకడు కావున కుండలీకరణంలో ఇలా చెప్పనక్కర్లేదు.

వచన వాఙ్మయం గురించి నారాయణస్వామిగారు తీసుకున్న శ్రద్ధ మెచ్చదగినది.

పుస్తకం చిన్నదే అయినా కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావుగారి 'ఆమోదం', పరిష్కర్త 'సంపాదకీయం' దీనికి వన్నె కూరుస్తున్నవి. శ్రీ వేంకటరావుగారు వచన వాఙ్మయాన్ని గురించీ, శ్రీ నారాయణస్వామిగారి సాహిత్యసేవను గురించీ వివరిస్తూ, తాము సంపాదకుని ప్రశంసిస్తూ చెప్పిన పద్యాలనుకూడా అందులో చేర్చారు. 'అగ్గింపు'లో వల్లపురెడ్డి –బుచ్చారెడ్డిగారు ఏతద్గ్రంథ సంపాదన పరిష్కరణాలలో శ్రీ నారాయణస్వామిగారు తీసుకున్న శ్రమను, శ్రద్ధను చక్కగా వివరించారు. శ్రద్ధతో చేసినపుడే పనిఅయినా, ప్రచురణ అయినా రాణిస్తాయి.

ఈ లఘుకృతి ఆంధ్ర సాహిత్యాభిమానుల ఆదరాన్ని పొందుతుందనే నా దృఢవిశ్వాసం.

— *శ్రీ బులుసు వేంకటరమణయ్య*

గ్రంథ స్వీకారము

1 శ్రీ నరసింహ తాండవము (హరికథ), రచన: శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్య; పేజీలు: 40; వెల: రూ. 1-50.

ముకుందమాల; మూలము: శ్రీ కులశేఖరాళ్వారు, పద్యమాల: శ్రీ మడుపు శేషారావు, పేజీలు: 27; శ్రీకృష్ణ

ఉపయోగకరమైన
సరికొత్త గ్రంథములు
వ్యవసాయము - ఫిషరీ-కోళ్ల పెంపకం-అడవులు-తోటపని ఇంజినీరింగ్-వైద్యము-వివిధ సాంకేతిక విషయములపై గ్రంథములుగలవు. కేటలాగుఉచితం. ఇంగ్లీషులో వాయండి.
N. K. PAUL & SONS.
P. B. No. 12202, Calcutta—5

రసాయనము – గద్యానుకర్త: శ్రీ చరణ రేణువు, పేజీలు: 40; ఈ రెండు కలిసివున్న పుస్తకము వెల: రూ. 2/–

పై రెండుపుస్తకములకు ప్రకాశకులు: శ్రీ గోదా గ్రంథమాల; శ్రీమన్నారాయణస్వామి దేవస్థాన ధర్మకర్తలు; శ్రీమన్నారాయణపురము; ఉల్లిపాలెము; కృష్ణాజిల్లా.

2 శ్రీరామ గీతామృతము రచయిత: కళా ప్రపూర్ణ, విద్యారత్న, పరిశోధనా పరమేశ్వర నిడుదవోలు వేంకటరావు; పేజీలు: 63; వెల: తెలియదు శ్రీ రామా బుక్‌డిపో వ్యవస్థాపకులు శ్రీ పబ్బా శంకరయ్య శెట్టిగారిచే స్వకీయ శ్రీ రామా విద్యున్ముద్రణాలయమున ముద్రింపబడినది. ప్రతులకు: శ్రీ రామాలయ నిర్మాణ సంఘము; (సరస్వతీ నగరము) క్రొత్తనల్లకుంట, హైదరాబాదు–500044,

3 ఇదా ప్రపంచం (పద్యకావ్యము) కృతికర్త: శ్రీ సాహిణి వేంకటలక్ష్మీపతిరావు; పేజీలు: 154. వెల రూ. 6/– ప్రతులకు: కృతికర్త; సూపరెంటెండింగ్ ఇంజనీరు, స్పెషల్ డ్రైనేజీ సర్కిల్; ఏలూరు. ప. గో. జిల్లా.

4 సింధువు – బిందువు, శ్రీశ్రీశ్రీ సత్యసాయి భగవానుడు; సర్వదేవతా స్వరూపుడా?! (సంగ్రహ సమీక్ష), రచన: శ్రీ వట్టికూటి గోపాలరావు. పేజీలు: 17; వెల: తెలియదు; ప్రతులకు: రచయిత; భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయి సేవాసమితి, వినుకొండ; గుంటూరుజిల్లా.

5 అమృతఫలాలు (కవితాసంపుటి) రచయిత: భాషా ప్రవీణ శ్రీ పొదిల రాధాకృష్ణమూర్తి; పేజీలు: 88; వెల రూ. 2–50. ప్రతులకు: శ్రీ పి. ఎస్. ఆర్. ఆంజనేయులు; శివాలయంవీధి, మునిసిపల్ అప్పర్ ప్రైమరీ స్కూలు; విజయవాడ–520001. లేక పి. ఎస్. ఆర్. ఆంజనేయులు; విజిలెన్స్‌సెల్; పి. ఏస్. డిపార్టుమెంట్; పంజగుట్ట; హైదరాబాదు.

6 శ్రీ రాజరాజేశ్వరీ సమేత కుక్కుటేశ్వర విలాసం; రచన: శ్రీ మేకా సుధాకరరావు; పేజీలు: 44; వెల: రెండు రూపాయిలు; ప్రతులకు: రచయిత; మేకావారి వీధి, పిఠాపురం–533450

7 క్రీస్తుపుట్టుక (నాటకము); రచయిత: విద్వాన్ బీర్నీడి ప్రసన్న; పేజీలు: 67; వెల: రూ. 2-50. ప్రతులకు: రచయిత; వినుకొండ.

8 శ్రీ కనకదుర్గాంబ సంకీర్తనలు; రచన: బాలకవి – శ్రీ బూర్ల మురళీకృష్ణ; పేజీలు: 25; వెల రూ. 1–50 ప్రచురణ: శ్రీ దుర్గామల్లేశ్వర దేవస్థానం; విజయవాడ–1

9 త్యాగము ప్రమద్వర, శర్మిష్ఠ, ఖడ్గతిక్కన నిర్వేదము; మూడు నాటికలు; రచన: డాక్టరు అత్తిలి రాజగోపాలరావు, పేజీలు: 48; వెల: రూ. 2. ప్రతులకు: ఆనంద సాహిత్యనిలయం, 16-2-741/45, ఆంధ్రా బ్యాంకు కాలనీ, హైదరాబాదు–500036.

10 పుర మందిరం (నాటకము), రచయిత: కవిభూషణ, విద్వాన్ శ్రీ చిట్టా రామకృష్ణారావు; పేజీలు: 78; వెల రూ. 2–50; ద్వితీయముద్రణ; ప్రతులకు: రచయిత; సర్కిల్ పేట, మచిలీపట్నం.

11 జ్ఞాన భాస్కరోపనిషత్ (టీకా తాత్పర్య విశేషాంశ సహితము) గ్రంథకర్త: శ్రీ డి. జయరామ్, పేజీలు: 110; వెల: రూ. 7–50, ప్రతులకు: శ్రీ బి. జగన్నాథరాజు, దుర్గా వర్కింగ్ హోమ్, అమలాపురం, తూ. గో. జిల్లా.

12 ఇది కథకాదు (నాటిక) పేజీలు: 46, నిజం కాటేసింది (నాటిక) పేజీలు: 40; రచయిత: శ్రీ ఎస్. మునిసుందరం; ఈ రెండూ కలిసివున్న పుస్తకం వెల రూ. 3/– ప్రచురణ: విశ్వప్రభ పబ్లిషింగ్ హౌస్; నెంద్రగుంట, చిత్తూరుజిల్లా.

13 మానవత (పద్యకావ్యము) రచయిత: శ్రీ యం. పి. జాను కవి. పేజీలు: 52, వెల: రు. 2/– ప్రతులకు: శ్రీమతి యం. దేవకుమారి, ఇంటి నెం. 17-11-11, కత్తి రామయ్యవీధి, బాప్టిస్టుపాలెం, విజయవాడ–3.

14 "తేజః స్వరం" కిరణమాల. ఈ చిన్న గ్రంథము "దివ్య గ్రంథము" నాధారముచేసుకొని ఒక్కొక్క సూక్తము ఒక్కొక్క కిరణముగా భక్తులకు ఉపయోగార్థం వ్రాయబడినది. క్రోడీకరణ: శ్రీ సున్న క్రిష్ణయ్య, సహోదరులు. పేజీలు: 176, వెల రు. 3/– ప్రతులకు: జ్యోతి స్టాప్–శాంతిగిరి, గాజువాక (పి. ఒ) విశాఖ–2.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.